భయమెరుగని
సాహసంతో వ్యక్తి
జీవించాలి.
మత సిద్ధాంతాలతో
వ్యక్తి మనసు
పాడు చేసుకోకూడదు
- స్వామి వివేకానంద

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250

Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

RNI No.52722/90 సంపుటి : 38 సంచిక : 138 విశాఖపట్నం, 06 మార్చి 2026 శుక్రవారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00

## సంతానోత్పత్తి రేటు 2.1% ఉంటే సుస్థిర ప్రగతి: చంద్రబాబు



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 5 :** ఇప్పటి వరకు కుటుంబ నియంత్రణకు ప్రాధాన్యం ఇచ్చామని, ఇప్పుడు పాపులేషన్ మేనేజ్‌మెంట్ గురించి చర్చిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. దీనిపై డ్రాఫ్ట్ పాలసీ రూపొందిస్తున్నామని, నెల రోజుల పాటు చర్చ తర్వాత తుదిరూపు ఇస్తామని చెప్పారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై శాసనసభలో సీఎం ప్రకటన చేశారు. 2023 లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏడాదికి 6.70 లక్షల మంది పిల్లలు పుడుతున్నారని అన్నారు. 2047 నాటికి రాష్ట్రంలో వృద్ధాప్యం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు (TFR) 1.5 శాతంగా ఉందని చెప్పారు. ఇది 2.1 శాతంగా ఉంటే సుస్థిర ప్రగతి ఉంటుందని చెప్పారు. దేశంలో కంటే రాష్ట్రంలో వృద్ధాప్యం ఎక్కువగా ఉందన్నారు.

"1997లో ఏపీ పాపులేషన్ పాలసీ తీసుకొచ్చాం. మన వద్ద 1992లో టీఎఫ్ఆర్ 3 ఉండగా ఇప్పుడు 1.5కు వచ్చింది. ప్రస్తుతం తమిళనాడులో 1.4శాతం, కేరళలో 1.6శాతం, బిహార్‌లో 3 శాతం టీఎఫ్ఆర్ ఉంది. 57 శాతం మంది ఒక్కరితో ఆపివేస్తున్నారు. 32 శాతం మంది ఇద్దరిని కంటున్నారు. 9శాతం మాత్రమే ఇద్దరి కంటే ఎక్కువ మందిని కంటున్నారు. 60 ఏళ్లు దాటినవారు 10 శాతం మంది ఉన్నారు. 2047 నాటికి ఇది 23 శాతానికి చేరుతుంది.

ఏప్రిల్ 1 నుంచి కొత్త పాలసీ అమలు చేస్తాం. పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ అమలు చేసిన మొదటి రాష్ట్రంగా ఏపీ నిలుస్తుంది. 1.5గా ఉన్న టీఎఫ్ఆర్‌ను 2.1కు తీసుకెళ్లడం మన లక్ష్యం. ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లల్ని కంటే కాన్పు సమయంలో రూ.25వేలు ఇస్తాం. నగదు పురస్కారం గేమ్ ఛేంజర్ కానుందని భావిస్తున్నాం. ఫ్యామిలీ ప్లానింగ్ ఇప్పుడు అసంబద్ధం. నా మాటల్ని గతంలో వ్యతిరేకించిన జేపీ వంటి వారు ఇప్పుడు సమర్థించారు. ఆర్ఎస్ఎస్ మోహన్ భగవత్ కూడా పాపులేషన్ పెంచాలని అంటున్నారు. యూపీ, బిహార్‌లో మాత్రమే దేశంలో అత్యధిక జనాభా ఉంది. దక్షిణ భారత దేశంలో జనాభా తక్కువగా ఉంది. జనాభా తగ్గడం వల్ల రాజకీయంగానూ ఇబ్బందులు వస్తాయి. కానీ, నేను రాజకీయ ప్రయోజనాల గురించి మాట్లాడటం లేదు.

**ఒకరు వద్దు.. ఇద్దరు ఓకే.. ముగ్గురు ముద్దు**

ఇక నుంచి ఒకరు వద్దు.. ఇద్దరు ఓకే.. ముగ్గురు ముద్దు అని మాట్లాడాలి. శాసనసభలో చర్చ జరిగితే విభిన్న అభిప్రాయాలు వచ్చాయి. లేదంటే ఆ అభిప్రాయాలు ఎలా తెలుస్తాయి? ఇప్పటికీ పేద వర్గాల వారే ఎక్కువ మంది పిల్లల్ని కంటున్నారు. అందుకే తల్లికి వందనం పథకం అందరికీ ఇచ్చాం. డబ్బులు ఉన్నవారు ఎందుకు తక్కువ మంది పిల్లల్ని కంటున్నారు. ⏭ తరువాయి 2లో..

## ఏపీ హోం మంత్రి వంగలపూడి అనితకు అస్వస్థత



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 5 :** ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత అసెంబ్లీలో అస్వస్థతకు గురయ్యారు. పరీక్షించిన వైద్యులు బీపీ ఎక్కువగా ఉన్నట్లు నిర్ధరించారు. అక్కడి నుంచి ఆమె చికిత్స కోసం విజయవాడ ఆస్పత్రికి వెళ్లారు. అనంతరం తన ఆరోగ్యం బాగానే ఉన్నట్లు హోం మంత్రి అనిత వెల్లడించారు. అలసట కారణంగా చిన్న ఇబ్బంది కలిగిందని, ఎవరూ ఆందోళన చెందవద్దని కోరారు.

## రోడ్ల విస్తరణలో తొలగించే చెట్లను తిరిగి నాటేలా పాలసీ: పవన్ కల్యాణ్



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 5 :** రోడ్ల విస్తరణకు అడ్డంగా ఉన్నాయని వందేళ్లకు పైబడిన చెట్లను కొట్టేయడం ఆవేదన కలిగిస్తోందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అసెంబ్లీలో చర్చ సందర్భంగా ప్రస్తావించారు. వృక్షాలను కొట్టేయకుండా మరో చోట వాటిని మళ్లీ నాటితే చిగురిస్తాయని తెలిపారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్.. రోడ్ల విస్తరణలో తొలగించే చెట్లను తిరిగి నాటేలా పాలసీ రూపొందిస్తామన్నారు. మొక్కలు నాటిన తర్వాత వాటి సంరక్షణపైనా దృష్టి పెడతామన్నారు.



## సైనిక ఘర్షణల ద్వారా సమస్యలను పరిష్కరించలేం

### ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ :** సైనిక ఘర్షణల ద్వారా ఏ సమస్యనూ పరిష్కరించలేమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో యుద్ధాలకు త్వరగా ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. భారత్ పర్యటనలో ఉన్న ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో చర్చలు నిర్వహించిన అనంతరం ప్రధాని మోదీ మాట్లాడారు. ఇటీవల ఈయూతో కుదుర్చుకున్న 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం'.. భారత్, ఫిన్లాండ్‌ల మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేస్తుందన్నారు.

"భారత్, ఫిన్లాండ్‌లకు చట్టబద్ధ పాలన, చర్చలు, దౌత్యమార్గాలపై విశ్వాసం ఉంది. కేవలం సైనిక ఘర్షణల ద్వారా సమస్యలను పరిష్కరించలేం. అది ఉక్రెయిన్, లేదా పశ్చిమాసియా.. ఏదైనా కావచ్చు. వివాదాలను వీలైనంత త్వరగా ముగించేందుకు, శాంతిని నెలకొల్పేందుకు చేసే ప్రతి ప్రయత్నానికి మద్దతు ఇస్తూనే ఉంటాం" అని మోదీ తెలిపారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**ఇరాన్‌పై దాడి కోసం భారత పోర్టులను అమెరికా వాడుతోందా?**

ఫిన్లాండ్ అధ్యక్షుడితో చర్చల్లో భాగంగా ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. "ఏఐ నుంచి 6జీ వరకు, క్లీన్ ఎనర్జీ నుంచి క్వాంటం కంప్యూటింగ్ వరకు అనేక హైటెక్ రంగాల్లో పరస్పర సహకారానికి కట్టుబడి ఉన్నాం" ⏭ తరువాయి 2లో..

## అసెంబ్లీకి గైర్హాజరవడం సబబు కాదు: అయ్యన్న పాత్రుడు



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 5 :** ప్రజా సమస్యల పరిష్కార వేదికైన అసెంబ్లీకి గైర్హాజరవడం సబబు కాదని శాసనసభాపతి అయ్యన్న పాత్రుడు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికే ఎమ్మెల్యేలను ఎన్నుకుంటారని ఆయన వ్యాఖ్యానించారు. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మీడియాతో అయ్యన్నపాత్రుడు చిట్‌చాట్‌గా మాట్లాడారు. అసెంబ్లీలో ప్రతిపక్షం, పాలకపక్షం ఉంటేనే బాగుంటుందన్నారు.

"వైకాపా సభ్యులకు నోటీసులు ఇవ్వాలంటే సమయం కావాలి. అనర్హత వేటు అంశం ఏపీలో విజయవంతమైతే దేశమంతా అలాగే జరుగుతుంది. గవర్నర్ ప్రసంగం రోజు వస్తే హాజరుగా పరిగణించాలనే నిబంధన ఎక్కడిది? ఆ రోజు వచ్చినా హాజరుగా పరిగణించరు. నిబంధనలను కాదని, అడ్డగోలుగా వాదించేవారిని ఏమనాలి? మాజీ సీఎంగా దక్కాల్సిన అన్ని మర్యాదలు జగన్‌కు లభిస్తున్నాయి. అప్పట్లో అధికార– ప్రతిపక్ష సభ్యులు పోరాడినా బయట స్నేహంగా ఉండేవారు. ఇప్పుడు ఆ సంస్కృతి పోయి విరోధుల్లా తయారవుతున్నారు. శాసనమండలి అంటే పెద్దల సభగా, పెద్ద ఆలోచనలు ఉన్న వారితో ఉండేది. పెద్ద ఆలోచనలు లేనివారు ఆ సభలో ఉంటే ఎలా ఉంటుందో ఇప్పుడు చూస్తున్నాం" అని అయ్యన్న పాత్రుడు అన్నారు.



## లడ్డూ కల్తీ.. నివేదికలను వైకాపా తొక్కిపెట్టలేదా?

### మంత్రి ఆనం

**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 5 :** తిరుమల లడ్డూ కల్తీ జరిగిందని నివేదికలన్నీ చెబుతున్నా.. వైకాపా సభ్యులు దుష్ప్రచారాలు చేస్తున్నారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఏపీ శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ.. తిరుమల లడ్డూపై స్టేట్‌మెంట్ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వైకాపా సభ్యులు నినాదాలు చేశారు. గందరగోళ పరిస్థితి తలెత్తడంతో మండలి ఛైర్మన్ మోషేను రాజు సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

"జగన్ నాయకత్వంలో నివేదికలను తొక్కిపెట్టిన విషయం అందరికీ తెలుసు. టెండర్లన్నీ మార్చి నిబంధనలను తుంగలో తొక్కారు. తమకు అనుకూలంగా నిబంధనలను మార్చుకున్నారు. కల్తీ జరగడం వాస్తవమేనని వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి ఒప్పుకొన్నారు కదా. ఆనాటి తితిదే ఛైర్మన్లే ఒప్పుకొన్నప్పటికీ.. వైకాపా నేతలు మాత్రం ఒప్పుకోవడం లేదు. వాస్తవాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది" అని ఆనం అన్నారు.

## 'రప్పా రప్పా'.. మరోసారి వైకాపా కార్యకర్తల అత్యుత్సాహం



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 3 :** వైకాపా అధినేత జగన్ వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు పర్యటనలో మరోసారి ఆ పార్టీ కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రొద్దుటూరుకు చెందిన వైకాపా మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు జగన్ హాజరయ్యారు. ఆయన రావడానికి ముందు నుంచే హెలిపాడ్ వద్ద ప్రధాన రహదారిలో వైకాపా కార్యకర్తలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు రాసి ఉన్న పోస్టర్లు, ప్లకార్డులు పట్టుకొని హంగామా చేశారు. '2029లో రప్పా రప్పా' అంటూ పోస్టర్లు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు.

## రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు తొలి రోజు ముగిసిన సునీల్ నాయక్ విచారణ



**గుంటూరు, విశాఖ సమాచారమ్, మార్చి 3 :** ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును గతంలో కస్టడీలో చిత్రహింసలకు గురి చేసిన కేసులో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ తొలిరోజు విచారణ ముగిసింది. విజయనగరం ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో దాదాపు 7 గంటలపాటు విచారణ జరిగింది. ⏭ తరువాయి 2లో..



## గన్నవరంలో ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

**గన్నవరం, విశాఖ సమాచారమ్, మార్చి 5 :** కృష్ణా జిల్లా గన్నవరం ఎయిర్‌పోర్టులో ఇండిగో విమానం అత్యవసరంగా ల్యాండైంది. హైదరాబాద్ వెళ్లాల్సిన విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. రన్‌వేపై టేకాఫ్ అవుతున్న సమయంలో ఇంజిన్‌లో సాంకేతిక లోపాన్ని పైలట్ గుర్తించారు. దీంతో రన్‌వేపై నిలిపివేశారు. ఈ విమానంలో ⏭ తరువాయి 2లో..

## రూ.6 వేల కోట్లతో కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణం: మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 5 :** ఏపీలో పవర్ డిమాండ్‌ను అధిగమించేందుకు రూ.6 వేల కోట్లతో కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుపై అసెంబ్లీ సమావేశాల ప్రశ్నోత్తరాల్లో ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, కోళ్ల లలిత కుమారి, అశోక్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. అధిక విద్యుత్ లోడ్ ఉన్న ప్రాంతాల్లో 200కు పైగా 33/11 కేవీ సబ్ స్టేషన్ల డిమాండ్ ఉందని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. విజయనగరం జిల్లా వేణుగోపాలపురం సబ్ స్టేషన్‌ను 2027 మార్చి నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.



## వైకాపా హయాంలో భగవద్గీత పుస్తకాల పేరిట భారీ అవినీతి: కిరణ్ రాయల్

**తిరుపతి(గాంధీరోడ్డు), విశాఖ సమాచారమ్, మార్చి 5 :** వైకాపా హయాంలో తిరుమలలో భగవద్గీత పుస్తకాల పేరుతో భారీ అవినీతి జరిగిందని జనసేన నేత కిరణ్ రాయల్ ఆరోపించారు. తితిదే చరిత్రలోనే ⏭ తరువాయి 2లో..

# ఘనంగా అర్జున్ తెందూల్కర్ వివాహం



**ముంబయి:** సచిన్ తెందూల్కర్ తనయుడు అర్జున్ తెందూల్కర్ వివాహం ఈ రోజు ముంబయిలో ఘనంగా జరిగింది. అర్జున్ తన స్నేహితురాలు సానియా చందోక్‌ను వివాహం చేసుకున్నాడు. ఆమె ముంబయికి చెందిన వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలు. ఆమె కూడా వ్యాపారవేత్తే. ముంబయిలో మిస్టర్ పాస్ పెట్ స్పా సంస్థను నడుపుతోంది. చాలా ఏళ్ల నుంచి సచిన్ కుమార్తె సారాతో సానియాకు అనుబంధం ఉంది. వివాహానికి ఐసీసీ ఛైర్మన్ జైషా, ఏపీ మంత్రి నారా లోకేశ్, ప్రముఖ వ్యాపారవేత్త ముకేష్ అంబానీ కుటుంబం, బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్, టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్లు ఎం.ఎస్.ధోని, ఇర్ఫాన్ పఠాన్, యూసుఫ్ పఠాన్, సురేశ్ రైనా, ఆకాశ్ చోప్రా, మహమ్మద్ కైఫ్ తదితరులు హాజరయ్యారు.

## ఏపీ పదోతరగతి హాల్ టికెట్లు.. వాట్సాప్‌లో డౌన్‌లోడ్ చేసుకోండి ఇలా



**'అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 3 :**

ఏపీలో మార్చి 16 నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి హాల్ టికెట్లు విడుదల అయ్యాయి. బోర్డ్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్, మనమిత్ర వాట్సప్ నంబరు, పాఠశాల విద్యాశాఖకు చెందిన లీప్ యాప్‌లో నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు. 9552300009 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేస్తే హాల్‌టికెట్లు పొందే అవకాశాన్ని అధికారులు కల్పించారు. ఏప్రిల్ ఒకటి వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

## పాత్రికేయ దిగ్గజం హెచ్.కె.దువా కన్నుమూత



**దిల్లీ:** పాత్రికేయ దిగ్గజం, మాజీ రాయబారి, రాజ్యసభ మాజీ సభ్యుడు హెచ్.కె.దువా(88) కన్నుమూశారు. అనారోగ్యంతో దిల్లీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం దువా తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన 2009-2015 మధ్య రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. ది హిందుస్థాన్ టైమ్స్ ఎడిటర్‌గా, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ట్రిబ్యూన్ పత్రికలకు ఎడిటర్ ఇన్ చీఫ్‌గా, టైమ్స్ ఆఫ్ ఇండియా ఎడిటోరియల్ అడ్వైజర్‌గా పని చేశారు. డెన్మార్క్‌లో 2001 నుంచి 2003 వరకూ భారత రాయబారిగా సేవలు అందించారు. 1937 జులై 1న జన్మించిన దువా మాజీ ప్రధానమంత్రులు వాజ్‌పేయీ, దేవెగౌడలకు మీడియా సలహాదారుగా ఉన్నారు. పాత్రికేయ రంగానికి అందించిన సేవలకుగానూ పంజాబ్, కురుక్షేత్ర విశ్వవిద్యాలయాలు ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశాయి. పద్మభూషణ్, దుర్గా రతన్ పురస్కారాలతో పాటు బాల గంగాధర్ తిలక్ అవార్డును సొంతం చేసుకున్నారు.

# రాజ్యసభకు వెళ్తున్నా.. నీతీశ్ కుమార్ కీలక ప్రకటన

**బిహార్ :** జేడీయూ అధ్యక్షుడు, బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ రాజ్యసభకు వెళ్తున్నారు. ఈ విషయాన్ని స్వయంగా తన ఎక్స్ పోస్టులో ధ్రువీకరించారు. దీంతో సీఎం పదవికి ఆయన రాజీనామా చేయనున్నారని స్పష్టమవుతోంది.

'రెండు దశాబ్దాలుగా మీరు నన్ను నమ్మి నాకు మద్దతు ఇచ్చారు. అంకితభావంతో నా విధుల్ని నిర్వర్తించాను. మీ మద్దతు, నమ్మకం వల్లే బిహార్ అభివృద్ధిలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది. నా పార్లమెంటరీ జీవితాన్ని ప్రారంభించినప్పటి నుంచే మనసులో ఒక కోరిక ఉండేది. రాష్ట్ర స్థాయిలో రెండు చట్టసభలకు, పార్లమెంట్‌లో రెండు సభలకు ప్రాతినిధ్యం వహించాలని అనుకున్నాను. అందుకే త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాజ్యసభ ఎంపీగా నా ప్రయాణాన్ని ప్రారంభించాలని అనుకుంటున్నాను. కొత్త బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా బిహార్‌తో నా బంధం కొనసాగుతుందని హామీ ఇస్తున్నాను. కొత్త ప్రభుత్వానికి నా పూర్తి మద్దతు అందిస్తాను" అని తన పోస్టులో నీతీశ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బిహార్‌కు కొత్త సీఎం రానున్నారు. ఈ ముఖ్యమంత్రి పదవి భాజపాకే దక్కొచ్చని వార్తలు వస్తున్నాయి.

దేశవ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16న ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రోజే నీతీశ్ నామినేషన్



వేయనున్నట్లు తెలుస్తోంది. ఇక, బిహార్ కొత్త ముఖ్యమంత్రి పదవికి పలువురు పోటీపడుతున్నారు. ఆ జాబితాలో డిప్యూటీ సీఎంలు సామ్రాట్ చౌధరీ, విజయ్‌కుమార్ సిన్హా, బిహార్ మంత్రి దిలీప్ జాయస్వాల్, దిఘా భాజపా ఎమ్మెల్యే సంజీవ్ చౌరాసియా, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ పేర్లు వినిపిస్తున్నాయి. కాగా.. నీతీశ్ నాలుగు నెలల క్రితమే బిహార్ ముఖ్యమంత్రిగా పదోసారి బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే.

# ఇరాన్‌పై దాడి కోసం భారత పోర్టులను అమెరికా వాడుతోందా?

**పశ్చిమాసియా :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు సంబంధించి సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారం ఆందోళనను కలిగిస్తోంది. ఇరాన్‌పై దాడి కోసం భారత పోర్టులను అమెరికా వినియోగించుకుంటోందని అగ్రరాజ్య మాజీ అధికారి ఒకరు వ్యాఖ్యలు చేశారు. దీన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. అవన్నీ నిరాధార వార్తలంటూ కేంద్ర విదేశాంగ శాఖ 'ఫ్యాక్ట్‌చెక్'లో వెల్లడించింది.

యూఎస్ ఆర్మీ మాజీ కల్నల్ డగ్లస్ మెక్‌గ్రెగొర్ అమెరికాలోని ఓ మీడియా ఛానల్‌లో మాట్లాడుతూ.. తమ బేస్‌లు ధ్వంసమయ్యాయని తెలిపారు. అందుకే సమీపంలోని భారత నేవీ బేస్‌లను అమెరికా ఉపయోగించుకోవాల్సి వస్తోందన్నారు. అయితే ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ భారత విదేశాంగ ఫ్యాక్ట్‌చెక్ ఎక్స్‌లో పోస్టు చేసింది. "ఇవన్నీ తప్పుడు, నకిలీ ఆరోపణలు మాత్రమే. ఇలాంటి కల్పిత, నిరాధార వ్యాఖ్యలను నమ్మొద్దని హెచ్చరిస్తున్నాం" అని విదేశాంగ శాఖ

### ఫ్యాక్ట్ చెక్ చేసిన కేంద్రం

### ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనా-75

వెల్లడించింది. హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌక పై దాడి జరిగిన వేళ ఈ అసత్య ప్రచారం బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనా-75పై అమెరికా జలాంతర్గామితో దాడి చేసి ముంచేసిన సంగతి తెలిసిందే. దాడి సమయంలో నౌకలో 180 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో కొంతమందిని శ్రీలంక దళాలు రక్షించగా.. 87 మంది మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాయి. మిగతా వారికోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నౌక విశాఖపట్నం నుంచి వెళ్తుండగా శ్రీలంక తీరంలో దాడి జరిగింది.

# యుద్ధం గెలిస్తే ఏం జరుగుతుంది.. ఓడితే ఏం జరుగుతుంది ?

**యుద్ధం ఖరీదెంత అని ప్రశ్నిస్తే.. వెలకట్టలేం అన్నదే సమాధానం ఎందుకంటే.. నష్టం ఆర్థిక, సహజ వనరులకే పరిమితం కాదు.**

యుద్ధం ఖరీదెంత అని ప్రశ్నిస్తే.. వెలకట్టలేం అన్నదే సమాధానం. ఎందుకంటే.. నష్టం ఆర్థిక, సహజ వనరులకే పరిమితం కాదు. ఆయా దేశాల భావితరాల భవిష్యత్తుకు సంబంధించినది. ఇది వెలకట్టలేని నష్టం. గెలుపుంటే లాభం. ఓటమి అంటే నష్టం అన్నఅర్థాలు, అభిప్రాయం సమాజంలో ఉంటుంది. కానీ యుద్ధంలో గెలుపు, ఓటమి రెండూ ఒకటే. నష్టమే. అవి సామాన్య జనానికి ఈజీగా అర్థం కావు. అర్థం చేసుకోరు. అందుకే యుద్ధమంటే మనకు సంబంధం లేనిదిగా, మన వరకు రాని ప్రమాదంగా చూస్తారు. అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధంలో అమెరికా గెలిచినా, ఇరాన్ గెలిచినా నష్టం రెండు దేశాలకు ఉంటుంది. యుద్ధంలో గెలుపు లాభాన్ని ఇవ్వదు. యుద్ధం అంటేనే నష్టం. అది గెలిచినా, ఓడినా. పెద్ద దేశమైనా, చిన్నదేశమైనా. చివరికి మూల్యం చెల్లించేది సామాన్య ప్రజలే. అదెలా అన్న విషయం చూద్దాం.

చరిత్రలో అన్ని యుద్ధాల్లోనూ ఒకరు గెలిచారు. మరొకరు ఓడిపోయారు. కానీ నష్టం మాత్రం ఇద్దరికీ జరిగింది. ఉదాహరణకు అమెరికా బలమైన ఆయుధ సంపత్తి కలిగిన దేశమైనప్పటికీ.. ఇరాన్ తో యుద్ధం చేసినప్పుడు భారీ స్థాయిలో డబ్బును ఖర్చు పెట్టాలి. యుద్ధం ఒక్కరోజుతో ఆగదు. ఆపలేరు. రెండో ప్రపంచ యుద్ధాన్ని జపాన్ పై అణుబాంబులు వేసి అమెరికా ఆపింది అన్న వాదన ఉంది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితిలేదు. చాలా దేశాలతోనూ అణుబాంబులు ఉన్నాయి. ఒక్కరు వాడినా, రెండోవాడు వాడుతాడు. ఇద్దరూ తుడిచిపెట్టుకుపోతారు. కాబట్టి ఇక్కడ గెలుపు లేదు. నష్టం మాత్రమే ఉంది. యుద్ధ సమయంలో ప్రభుత్వాలు భారీగా డబ్బును ఖర్చు పెడతాయి. ఫారిన్ రిజర్వులను వాడుతాయి. మరోవైపు సొంత కరెన్సీ ముద్రిస్తాయి. కరెన్సీ ముద్రణ కారణంగా ఇప్పటికే ఆయా దేశాల్లోని




సేవింగ్స్ వాల్యూ పడిపోతుంది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతుంది. దీనికి తోడు చమురు సరఫరా వ్యవస్థలు దెబ్బతింటే ధరలు పెరిగి.. కరెన్సీ వాల్యూ పడుతుంది. అప్పుడు కూడా ప్రజల కొనుగోలు శక్తి పడిపోతుంది. మళ్లీ ఆ దేశం కోలుకోవడానికి చాలా కాలం పట్టవచ్చు. హింస, యుద్ధం ఆయుధాలుగా చేసుకున్న దేశాలు ఆర్థికంగా చితికిపోయిన ఉదాహరణలు అనేకం. అంతిమంగా ప్రజల జీవనప్రమాణాలు తగ్గిపోతాయి. భవిష్యత్ తరాలు ప్రపంచంతో పోటీ పడలేవు. నిరుద్యోగం, ఆర్థిక అస్థిరత్వం, వనరుల కోసం ఇతర దేశాలపై ఆధారపడటం, ఆ దేశాలు ఇబ్బందుల్లో ఉన్న దేశాలను తమ అవసరాలకు అనుగుణంగా వాడుకోవడం ఇవన్నీ కూడా చరిత్రలో కనిపించిన సంఘటనలు. ాశ్రీంశీ =ము౹న - రాజ్యసభ సీటు.. వైఎస్సార్-కే యుద్ధం ఎవరికీ లాభం కాదు. కానీ ఆయా దేశాల్లోని అధినేతలు, రాజకీయ పార్టీలు యుద్ధాలను అనేక రకాలుగా వాడుకుంటాయి. ఒకరు అంతర్గత సమస్యలు వెలుగుచూడకుండా ఉండటానికి యుద్ధాన్ని కాంక్షిస్తారు. మరొకరు అధికారం కోసం యుద్ధాన్ని కాంక్షిస్తారు. నిత్యం ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేస్తారు. ప్రధాన సమస్యలను మాట్లాడకుండా ఉంచేందుకు యుద్ధ వాతావరణం సృష్టిస్తారు. ప్రజల భావోద్వేగాలను అనుకూలంగా మార్చుకుంటారు. అంతిమంగా నష్టపోయేది మాత్రం సామాన్య ప్రజలు, వారి పిల్లలే.

## వైకాపా హయాంలో భగవద్గీత పుస్తకాల పేరిట భారీ అవినీతి: కిరణ్ రాయల్

(మొదటి పేజీ తరువాయి)

అతిపెద్ద స్కామ్ అని అన్నారు. తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "50 గ్రాములు కూడా లేని భగవద్గీత పుస్తకాన్ని వైకాపా హయాంలో ముద్రించారు. 15 పేజీలతో ఇలా ఇంతవరకు ఎక్కడా లేదు. భగవద్గీత పుస్తక ముద్రణలో ధర్మారెడ్డి పేరు ఎందుకు ఈ పుస్తకం పేరుతో రూ.కోట్లు తినేశారు. హిందూ సమాజానికి జగన్, భూమన కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి క్షమాపణ చెప్పాలి. భగవద్గీత బాగోతాన్ని బయటపెట్టినందుకు తితిదే ఛైర్మన్‌ను టార్గెట్ చేశారు. అందుకే ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు" అని కిరణ్ రాయల్ అన్నారు.

## గన్నవరంలో ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి గొట్టిపాటి రవి, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, ప్రత్తిపాటి పుల్లారావుతో పాటు సుమారు 70 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. సాంకేతిక సమస్య కారణంగా విమానాన్ని ఇండిగో అధికారులు రద్దు చేశారు. దీంతో గొట్టిపాటి రవి, కన్నా లక్ష్మీనారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు రోడ్డు మార్గాన బయల్దేరారు. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ విమానం ఏర్పాటు చేస్తామని ఇండిగో అధికారులు హామీ ఇచ్చారు.

## సైనిక ఘర్షణల ద్వారా సమస్యలను పరిష్కరించలేం

(మొదటి పేజీ తరువాయి)

అని చెప్పారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు స్టబ్ నాలుగు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం భారత్‌కు వచ్చారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పర్యటన చేపట్టారు.

## సంతానోత్పత్తి రేటు 2.1% ఉంటే సుస్థిర ప్రగతి: చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు ఉండేలా చూస్తాం. ఒక జంటకు కనీసం ఇద్దరు పిల్లలుండాలి. ముగ్గురు పిల్లల్ని కంటే ఇంకా మంచిది. రెండో బిడ్డను కన్న తండ్రికి ఒక నెల, మూడో బిడ్డను కన్న తండ్రికి 2 నెలలు సెలవు మంజూరు చేస్తాం" అని చంద్రబాబు అన్నారు.

## రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు తొలి రోజు ముగిసిన సునీల్ నాయక్ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

మరో మూడు రోజుల పాటు సునీల్ నాయక్ విచారణ కొనసాగనుంది. రఘురామను సీఐడీ విచారణ పేరిట హింసించిన ఘటనపై సునీల్ నాయక్‌ను అధికారులు ప్రశ్నించగా.. అరకొర సమాధానాలు చెప్పినట్లు సమాచారం. హైకోర్టు ఉత్తర్వుల మేరకు 5 నుంచి 9వ తేదీ వరకు సునీల్ నాయక్ విచారణ జరగనుంది.



## గల్ఫ్ నుంచి శంషాబాద్‌కు వచ్చే పలు విమాన సర్వీసులు రద్దు

**హైదరాబాద్:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం హైదరాబాద్‌కు వచ్చే విమానాల రాకపోకలపై పడింది. తాజాగా గల్ఫ్ దేశాల నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి రావాల్సిన 16 విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. అదే సమయంలో శంషాబాద్ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన 15 విమాన సర్వీసులను సైతం రద్దు చేశారు.

# దేశ భవిష్యత్తుకు బరువు భయం ఆరోగ్యంతో పాటూ ?



**ఈ పెరిగే బరువును ఇప్పుడే కంట్రోల్ చేయకపోతే, రాబోయే తరాలు బలహీనపడే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిస్తున్న నిపుణులు**

ఈరోజు పిల్లలే రేపటి దేశ పౌరులు. కానీ, నేడు ఆ చిన్నారులు ఊబకాయం బారిన పడటం అనేది కేవలం వారి వ్యక్తిగత ఆరోగ్య సమస్య మాత్రమే కాదు, అది దేశ ఆర్థిక వ్యవస్థకే ఒక సవాల్‌గా మారుతోంది. చిన్న వయసులోనే అధిక బరువు పెరగడం వల్ల వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. శారీరక శ్రమ తగ్గడం, జంక్ ఫుడ్ అలవాట్లు దేశ ముఖచిత్రాన్ని మార్చేస్తున్నాయి. ఈ పెరిగే బరువును ఇప్పుడే కంట్రోల్ చేయకపోతే, రాబోయే తరాలు బలహీనపడే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ వివరాలు ఇలా వున్నాయి ..

పెరిగే బరువు.. కుదేలయ్యే ఆరోగ్యం: పిల్లల్లో ఊబకాయం పెరగడం వల్ల కేవలం లావు అవ్వడమే కాదు, చిన్న వయసులోనే మధుమేహం, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులు చుట్టుముడుతున్నాయి. దీనివల్ల ఫ్యూచర్‌లో హెల్త్‌కేర్ ఖర్చులు విపరీతంగా పెరిగిపోతాయి. ఇక ఒక వ్యక్తి సంపాదనలో ఎక్కువ భాగం హాస్పిటల్స్ కే పోతే, అది ఆ కుటుంబానికే కాకుండా దేశ ఆర్థిక ప్రగతికి కూడా పెద్ద అడ్డంకి. ఆరోగ్యకరమైన యువశక్తి ఉంటేనే ఏ దేశమైనా అభివృద్ధి చెందుతుంది. కానీ, అనారోగ్యంతో ఉన్న వర్క్‌ఫోర్స్ వల్ల పని సామర్థ్యం తగ్గిపోతుంది, ఇది దేశాభివృద్ధిని కుంటుపరుస్తుంది.

బడుల్లో ఆటలు.. ప్రభుత్వాల అప్రమత్తత: ఇక దీనిని అరికట్టాలంటే ముందుగా బడుల్లో మార్పు రావాలి. చదువుతో పాటు వ్యాయామం, ఆటలను ప్రభుత్వం తప్పనిసరి చేయాలి. కేవలం పుస్తకాలతోనే కుస్తీ పట్టకుండా, మైదానంలో పరుగు తీయడం వల్ల పిల్లల మెదడు, శరీరం చురుగ్గా ఉంటాయి. స్కూళ్లు కూడా జంక్ ఫుడ్ విషయంలో కఠినంగా ఉండాలి. ప్రభుత్వం కూడా ఊబకాయం వల్ల వచ్చే అనర్థాల మీద భారీ స్థాయిలో చైతన్యం తీసుకురావాలి. స్కూల్ సిలబస్‌లో పౌష్టికాహారం, ఫిజికల్ ఫిట్‌నెస్ గురించి ప్రత్యేక పాఠాలు ఉండటం తప్పనిసరి కావాలి. ఇంటి భోజనం.. తల్లిదండ్రుల బాధ్యత: ఇక బయట పిల్లలు ఏమి తింటున్న, పిల్లల ఆహారపు అలవాట్లు ఫస్ట్ ఇంటి దగ్గరే మొదలవుతాయి. సెల్‌ఫోన్లు ఇస్తూ పిల్లలకు తినిపించడం మానేసి, వారిని శారీరక శ్రమ చేసేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. ఇంట్లో వండిన సమతుల్య ఆహారం అందేలా చూడటం పేరెంట్స్ బాధ్యత. కేవలం ప్రోటీన్లు, విటమిన్లు ఉన్న ఆహారాన్ని ఇస్తూ, అనవసరమైన స్వీట్ పదార్థాలను దూరం పెట్టాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలతో కలిసి వ్యాయామం చేస్తే, వారు దాన్ని ఒక ఆహ్లాదకరమైన అలవాటుగా మార్చుకుంటారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుంది. ఊబకాయం అనే మహమ్మారిని తరిమికొట్టడానికి స్కూళ్లు, ప్రభుత్వం, తల్లిదండ్రులు ముగ్గురూ కలిసికట్టుగా అడుగు వేయాల్సిన సమయం వచ్చేసింది.

# గ్రేటర్ ఎన్నికలపై సందిగ్ధం



విశాఖపట్నం, విశాఖసమాచారం: జీవీఎంసీ పాలకవర్గ పదవీకాలం ఈనెల 17వ తేదీతో ముగియనున్నది. 18వ తేదీ నుంచి ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ వ్యవహరించనున్నారు. నగర పాలక సంస్థకు తిరిగి ఎన్నికలు నిర్వహించాలంటే ముందుగా వార్డు రిజర్వేషన్లు ఖరారు కావాలి. రాష్ట్ర ప్రభుత్వం కులగణన ప్రారంభించింది. మరో మూడు నెలల్లో ఈ ప్రక్రియ కొలిక్కి రానున్నప్పటికీ, జీవీఎంసీలో కొత్తగా పెందుర్తి, భీమిలి మండలాల్లోని మిగిలిన గ్రామాలతోపాటు ఆనందపురం, పద్మనాభం మండలాలను విలీనం చేయాలనే ప్రతిపాదన పరిశీలనలో ఉండడంతో వెంటనే ఎన్నికలు నిర్వహిస్తారా?, లేదా?...అనే అంశంపై సందిగ్ధం నెలకొంది. జీవీఎంసీకి 2021 మార్చిలో ఎన్నికలు జరిగాయి. మార్చి 17న పాలకవర్గం కొలువుతీరింది. మెజారిటీ వార్డులను వైసీపీ దక్కించుకోవడంతో వైసీపీకి చెందిన 11వ వార్డు కార్పొరేటర్ గొలగాని హరివెంకటకుమారి మేయర్‌గా ఎన్నికయ్యారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో జీవీఎంసీ కౌన్సిల్‌లో రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. వైసీపీకి చెందిన పలువురు కార్పొరేటర్లు, స్వతంత్రులుగా గెలిచిన కార్పొరేటర్లు టీడీపీ, జనసేనల్లో చేరిపోయారు. దీంతో కౌన్సిల్‌లో కూటమి బలం పెరిగింది. ఈ నేపథ్యంలో మేయర్, డిప్యూటీ మేయర్‌పై కూటమి కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో పదవుల్లో ఉన్నవారు వైదొలిగారు. టీడీపీకి చెందిన 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు మేయర్‌గా, జనసేనకు చెందిన 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరాజు డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. కాగా ఐదేళ్లు పూర్తవుతుండడంతో తాజా పాలకవర్గం ఈ నెల 17వ తేదీన రద్దవుతుంది. తిరిగి కొత్త పాలకవర్గాన్ని ఎన్నుకోవాలంటే జీవీఎంసీకి ఎన్నికలు నిర్వహించాలి. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయడంలో భాగంగా నిర్ణీత కాలానికి కులగణన చేపట్టి కేంద్ర ప్రభుత్వం ఆదేశాలకు లోబడి ప్రకటన చేయాల్సి ఉంటుంది. కులగణన ప్రారంభించారు. అది ముగిసిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించడం, రిజర్వేషన్లను ఖరారు చేయడం, వాటిపై గెజిట్ జారీచేసి ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించడం వంటివి పూర్తికావాలంటే కనీసం మూడు నెలలు పడుతుందని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కాగానే రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఎన్నికల ప్రధానాధికారి జీవీఎంసీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేస్తారని కొందరు అంచనా వేస్తున్నారు. అయితే జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం పెందుర్తి, భీమిలి నియోజవర్గాల్లోని కొన్ని గ్రామాలు ఉన్నాయి. మిగిలిన గ్రామాలతోపాటు ఆనందపురం, పద్మనాభం మండలాలను కూడా జీవీఎంసీ పరిధిలోకి చేర్చాలని ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆ దిశగా నిర్ణయం తీసుకోదలిస్తే మాత్రం రెండేళ్ల వరకూ జీవీఎంసీకి ఎన్నికలు జరగకపోవచ్చునని అధికారులు అభిప్రాయపడుతున్నారు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

టెండరు కోరుతూ ప్రకటన

టెండరు నం.30265395 తేది: 25.02.2026

పని పేరు: ఫైబర్ బ్రాగ్ గ్రేటింగ్ సెన్సింగ్ టెక్నాలజి మరియు AI ఉపయోగించడం ద్వారా అన్‌ఈవెన్ లోడెడ్ వ్యాగన్స్‌ను గుర్తించేందుకు ఆటోమేటిక్ డిటెక్షన్ సిస్టమ్ సరఫరా మరియు నియోగం. తయారీ: L2M రైల్, గ్రీన్ పవర్ టెక్నిక్, సాయికిరణ్ టెలీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ లేదా ఇదేతరహా. (వారంటీ గడువు: బట్వాడా తేదీ తరువాత 30 నెలలు)

పరిమాణం: 02 సెట్లు

గమనిక: మెటీరియల్స్‌ను 30 రోజుల్లోగా సరఫరా చేయవలెను

టెండరు తెరచు తేది మరియు సమయం: 27.03.2026న 1500 గం.

తనిఖీ :TPI ద్వారా

పూర్తి వివరాలు లభించే వెబ్‌సైట్: www.ireps.gov.in

సీనియర్ డివిజనల్ మెటీరియల్ మేనేజర్ / వాల్తేరు

PR-1187/Q/25-26


# నీటి అడుగున ఏఐ ప్రయోగం



అనకాపల్లి, విశాఖసమాచారం: ప్రతి రంగంలో కృత్రిమ మేధ ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో గీతం విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్లు ఏఐను మరింత సమర్థంగా వినియోగించుకోవడంపై దృష్టి పెట్టారు. వర్సిటీలోని 'సెంటర్ ఫర్ అటానమస్ సిస్టమ్స్'లో అండర్ వాటర్ వెహికల్ (ప్రొటోటైప్ (నీటి అడుగున ప్రయాణించే వాహనాల నమూనా)ను మరింత అభివృద్ధి చేస్తున్నారు. ప్రొఫెసర్ డా.భరణి చంద్ర కుమార్ నేతృత్వంలో రెండేళ్లుగా విద్యార్థులు ఆయా పరికరాలను అభివృద్ధి చేస్తున్నారు. రొయ్యల సాగులో రైతులకు సహకరించడం, సముద్రంలో జీవరాశుల గురించి తెలుసుకునేందుకు వీలుగా వీటిని తీర్చిదిద్దుతున్నారు. ఆయా ప్రాజెక్టులకు హైదరాబాద్, తిరుపతి, గువాహటి ఐఐటీల నుంచి నిధులు సమకూరాయి.ప్రతి పది అడుగులకు: రొయ్యల సాగుకు చెరువులో నీటి నాణ్యత కీలకం. నీటిలో పీహెచ్, ఆక్సిజన్ నిర్ణీత స్థాయిలో లేకపోతే రొయ్యలు చనిపోతాయి. వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలి. సాధారణంగా వారం, నెలకోసారి నీటి నాణ్యతను ప్రయోగశాలల్లో పరీక్షిస్తుంటారు. రొయ్యల సాగు కోసం 'సీటూవో స్కై ఏఐ' అనే అంకుర సంస్థతో కలిసి అండర్ వాటర్ వెహికల్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఆ అంకుర సంస్థ గీతం పూర్వ విద్యార్థికి చెందినదే. ఈ పరికరాన్ని నీటిలోకి పంపిస్తే.. ఎప్పటికప్పుడు నమూనాలు సేకరిస్తుంది. ప్రతి పది అడుగులకు నమూనా తీసుకుని, విశ్లేషించి, యాప్ ద్వారా రైతులకు సమాచారం వస్తుంది. ఏదైనా నిర్ణీత స్థాయి దాటితే రైతులను హెచ్చరిస్తుంది. ఏ ప్రదేశంలో సమస్య ఉందో కూడా తెలియజేస్తుంది. దానికి తగ్గట్టుగా నివారణ చర్యలు చేపట్టేందుకు వీలుంది. అల్గారిథమ్ ఆధారంగా: సముద్రంలో జీవరాశుల గురించి అధ్యయనం చేసేందుకు మరో ప్రొటోటైప్‌ను రూపొందిస్తున్నారు. ఈ పరికరానికి కెమెరాలు అమరుస్తారు. సముద్రంలో ఒక స్థాయి వరకే మనుషులు వెళ్లగలరు. ఈ వెహికల్ ఎక్కువ లోతుకు వెళ్లేలా రూపొందిస్తున్నారు. అక్కడ చేపలు, ఖనిజాలు, సీవీడ్.. ఇలా ఏమున్నా సమాచారం సేకరిస్తుంది. అల్గారిథమ్ ఆధారంగా ఇది పనిచేస్తుంది. అది ప్రయాణించే మార్గంలో ఏమేం కనిపించాయో విశ్లేషించి, సమాచారం అందిస్తుంది. ఏ లోతులో ఏమున్నాయో చెప్పగలదు. దీనికి మరికొన్ని మార్పులు చేస్తే రక్షణ శాఖ, ఇతర రంగాల్లోనూ వినియోగించుకోవచ్చని ప్రొఫెసర్ డా.భరణి చంద్ర కుమార్ తెలిపారు.

## జీవ వైవిధ్యానికి నిలయం 'డాల్ఫిన్ నేచర్ కన్జర్వేటివ్ సొసైటీ'



కీటకాహార మొక్క



కాసియా అలటా

విశాఖపట్నం, విశాఖసమాచారం: పెదవాల్తేరు, న్యూస్‌టుడే: జీవ వైవిధ్య కేంద్రంగా..అరుదైన మొక్కలకు ఆలవాలంగా పరిఢవిల్లుతోంది పెదవాల్తేరులోని జీవ వైవిధ్య ఉద్యానవనం. డాల్ఫిన్ నేచర్ కన్జర్వేటివ్ సొసైటీ ప్రకృతి పరిరక్షణ సంస్థగా ఏర్పడి 2001లో రాణిచంద్రమణి ఆసుపత్రి ఆవరణలో ఉద్యానవనాన్ని ప్రారంభించింది. 2002లో వీఎంఆర్డీఏ, ఆర్సీడీ ఆసుపత్రి సహకారంతో మూడు ఎకరాల స్థలంలో జీవవైవిధ్య ఉద్యానవనంగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి దేశంలో ఒక ప్రత్యేకమైన ఉద్యాన వనంగా పేరు తెచ్చుకుంది. ఈ నెల 5వ తేదీకి పాతికేళ్ల ప్రస్థానం పూర్తవుతున్న నేపథ్యంలో ఇక్కడి ప్రత్యేకతలు తెలుసుకుందాం. 2 వేల మొక్కల సంరక్షణ డాక్టర్ మంతా రామమూర్తి ఉద్యానవనం వ్యవస్థాపకులు. సభ్యులుగా మంగతాయి, జె.ఎస్.ప్రసాద్, జోగారావు, కామేశ్వరరావు, పూర్ణిమ, ఉషా, పద్మ, ఉమాబాల ఉన్నారు. ఇక్కడ సుమారు 2 వేల మొక్కలను సంరక్షిస్తున్నారు. అంతరించిపోతున్న అరుదైన మొక్కలు, ఎడారి మొక్కలు, విదేశాల్లోని ఆర్కిడ్స్ ఇక్కడ కనిపిస్తాయి. మొత్తం 12 విభాగాలు: ఈ ఉద్యానవనంలో మొత్తం 12 విభాగాలు ఉన్నాయి. వాటిల్లో అడవి మొక్కలు, కీటక సంహార, రాక్షస బల్లుల కాలం నాటివి, పాకుడు, ఔషధ, అలంకరణ మొక్కలను సంరక్షిస్తున్నారు. నీటిలో పెరిగేవి, అతిశీతల వాతావరణంలో పెరిగే మొక్కల కోసం ప్రత్యేకంగా షేడ్‌నెట్‌లు తీర్చిదిద్దారు. నిర్వహణకు వీఎంఆర్డీఏ ముగ్గురు సిబ్బందిని నియమించింది. అదే విధంగా సీతాకోక చిలుకల సంరక్షణ కేంద్రం కూడా ఉంది. విద్యార్థులకు విజ్ఞానం పంచేలా..: ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి విద్యార్థులు అధ్యయన యాత్రకు ఇక్కడికి వస్తుంటారు. అరుదైన మొక్కలపై పీహెచ్‌డీ చేసే వారికి ఈ కేంద్రం ఒక వరంలా నిలుస్తోంది. ఫిబ్రవరి నుంచి ఇంటర్న్‌షిప్ కోసం నెలకు 100 మంది వరకు వస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజు 50 నుంచి 100 మంది వరకు పాఠశాలల విద్యార్థులు పార్కును సందర్శిస్తుంటారు. ప్రతి మొక్కా ప్రత్యేకమే..: 'పాతికేళ్లలో ఉద్యానవనం ఇంతింతై అన్నట్లు ఎదిగింది. ఇక్కడ ప్రతి మొక్క జీవవైవిధ్యాన్ని ప్రతిబింబిస్తోంది. వాటిని కాపాడి భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. అందుకే వాటి పరిరక్షణకు ఏటా రూ.10లక్షల వరకు ఖర్చు చేస్తున్నాం. ఈ మొత్తాన్ని వీఎంఆర్డీఏ, దాతల నుంచి సేకరిస్తున్నాం' అని నిర్వాహకులు డాక్టర్ రామమూర్తి తెలిపారు.

# జగన్ పర్యటన విశాఖలో వాహన చోదకులకు చుక్కలు



విశాఖపట్నం, విశాఖసమాచారం: విశాఖపట్నం: మాజీ ముఖ్యమంత్రి జగన్ పర్యటన విశాఖలో వాహన చోదకులకు చుక్కలు చూపించింది. జగన్ విశాఖ ఎప్పుడు వచ్చినా ట్రాఫిక్ కష్టాలు తప్పవా అని ప్రజలు విసుగెత్తిపోయారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ కుమారుడి వివాహం ఇటీవల జరిగింది. వధూవరులు గోవింద్ సాకేత్, శ్రావణిలను ఆశీర్వదించేందుకు మద్రిపాలెంలోని వారి నివాసానికి జగన్ వెళ్లారు. ఈ నేపథ్యంలో పోలీసుల ట్రాఫిక్ నియంత్రణ చర్యలు ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగించాయి. బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు జగన్ మద్రిపాలెం చేరుకోగా అప్పటి నుంచి తిరుగు పయనమయ్యేవరకు ట్రాఫిక్ నిలిపేశారు. మద్రిపాలెం రైల్వే స్టేషన్ కూడలి వద్ద సుమారు అరగంటకు పైగా రాకపోకలు నిలిపేయడంతో అధిక సంఖ్యలో వాహనదారులు ఎండలోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఓ వైపు ఎండ, మరో వైపు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. వాహనాలను సర్వీసు రోడ్డులో పంపించే అవకాశం ఉన్నా వదల్లేదు. ఇక్కడ జగన్ కోసం బీఆర్‌టీఎస్ ప్రధాన రోడ్డును ఉపయోగించి మిగిలిన రెండు సర్వీసు రోడ్లలో రాకపోకలు కొనసాగించొచ్చు. అలా చేయకపోవడంతో మండుటెండలో ప్రజలు చెమటలుకక్కారు. ఆయా రూట్లలో తాళ్లు కట్టి ఎవరూ రోడ్డు మీదికి రాకుండా నియంత్రించారు. సమీప వీధుల్లోకి వెళ్లేవారు సైతం ఇబ్బంది పడాల్సి వచ్చింది. తమ పర్యటనల సమయంలో ప్రజల రాకపోకలకు విఘాతం కలిగించొద్దని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చెబుతుంటే మాజీ సీఎం కోసం మిట్ట మధ్యాహ్నం వేళ ట్రాఫిక్ ఆంక్షలు ఏమిటని పోలీసుల తీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. జగన్ పర్యటన నేపథ్యంలో మద్రిపాలెంలో భారీ సంగీత శబ్దాలతో, వివిధ వేషధారణలతో కొందరు అర్ధ నగ్న నృత్యాలు చేశారు. ఒకరు కొండచిలువను పట్టుకొని దాంతో నృత్యాలు చేయడం గగుర్పాటుకు గురి చేసింది. మరికొందరు శరీరమంతా వైకాపా జెండా రంగులు పులుముకొని అర్ధనగ్నంగా తిరిగారు. జగన్ రాకముందు నుంచే వారంతా హడావుడి చేశారు. వెళ్లేంతవరకు అక్కడే ఉన్నారు.

# ఆదాయం పోతోంది.. ఆయువు తీస్తోంది



చోడవరం, విశాఖసమాచారం: భీమిలి-నర్సీపట్నం (బీఎన్) రోడ్డుపై ప్రయాణం నరకానికి నకలులా తయారైంది. మొత్తం 110.58 కి.మీ. పొడవున్న బీఎన్ రోడ్డు ఒక్క చోడవరం నియోజక వర్గంలోనే దాదాపు 58 కి.మీ. మేర ఉంది. ఒక్క చోడవరం నియోజకవర్గంలోనే 25 చోట్ల చెరువులను తలపించేలా భారీ గోతులు పడ్డాయి. దశాబ్దకాలంగా ఈ రహదారి కనీస నిర్వహణ లేక దారుణంగా తయారైంది. ఈ రోడ్డు కారణంగా గతేడాది నలుగురు ప్రాణాలు కోల్పోగా.. దాదాపు పదిమంది జీవితాంతం మంచానికే పరిమితం కావాల్సి వచ్చింది. అధ్వానంగా మారిన రోడ్డు ఏ ఒక్క వర్గాన్నీ వదలకుండా అందరిపైనా ప్రభావం చూపుతోంది. ఆదాయ మార్గాలను హరించేయడమే కాకుండా ఆరోగ్యాలను దెబ్బతీస్తోంది. రెండేళ్ల కిందట సంక్రాంతికి కోటవురట్లకు చెందిన గట్టి వీర రాఘవులు ద్విచక్ర వాహనంపై రావికమతం బయలుదేరారు. టి.అర్జాపురం వచ్చే సరికి భారీ గుంతవద్ద వాహనం అదుపుతప్పి మృతి చెందాడు. బీఎన్ రోడ్డు రోలుగుంటకు చెందిన చెవ్వేటి కొండబాబు జీవితాన్ని ఛిద్రం చేసింది. రావికమతం నుంచి రోలుగుంట వచ్చేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కారు. సీటు లేక డ్రైవర్ వెనుక రాడ్ పట్టుకుని నిల్చున్నారు. మేడివాడ దాటిన తర్వాత గోతిలోకి వెళ్లడంతో బస్సులోనే పడిపోయారు. ఈ ప్రమాదంలో అయన వెన్నుముకకు తీవ్రగాయమై మంచానికే పరిమితమవడంతో కుటుంబ పరిస్థితి దారుణంగా మారింది. వేళకు చేరడం కష్టం: బుచ్చెయ్యపేట మండలం కోమళ్లపూడి నుంచి రోలుగుంట వరకు చాలామంది విద్యార్థులు ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ విద్య కోసం రావికమతం, కొత్తకోట, రోలుగుంటకు తదితర ప్రాంతాలకు నిత్యం ప్రయాణిస్తుంటాం. నర్సీపట్నంలోని వివిధ కోర్సులు నేర్చుకోవడానికి వెళ్లాలన్నా ఈ మార్గమే ఆధారం. నిత్యం దాదాపు 350 మందికి పైగా రాకపోకలు సాగిస్తుంటారు. అధ్వానమైన రోడ్డు కారణంగా ప్రయాణం ఎప్పుడూ ఆలస్యమే. సమయానికి వెళ్లలేక ఎన్నోసార్లు తరగతులు కోల్పోయాం. పరీక్షల వేళ మరింత ఇబ్బందిగా ఉంటుందని పిల్లావానిపాలెం ఇంటర్ విద్యార్థిని హేమ తెలిపింది. ఆర్థికంగా భారం: చోడవరం పట్టణం నుంచి కె.జె.పురం, మాడుగుల, వడ్డాది, రావికమతం, అర్జాపురం, చీడికాడ, అనకాపల్లి వైపు తిరిగే ఆటోలు 600 వరకు ఉండేవి. రోడ్లు బాగోలేక 200 ఆటోలు అతి త్వరగా షెడ్లకు చేరుకున్నాయి. గుంతల కారణంగా చక్రం రాడ్డు, యాక్సిల్ వంగిపోతున్నాయి. సంపాదన అంతా మరమ్మతులకే పోతుంది. దీనికి తోడు ఇంధనం ఖర్చు భారం కూడా పెరిగింది. కొన్ని సందర్భాల్లో నెలకు దాదాపు రూ. 10 వేలు ఖర్చు చేసిన సందర్భాలు ఉంటున్నాయి. చికిత్సకు విశాఖకే: చుట్టుపక్కల ఐదు మండలాల నుంచి గతంలో చోడవరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకొచ్చేవారు. ఈ రోగుల సంఖ్య తగ్గింది. ప్రధానంగా బుచ్చెయ్యపేట, మాడుగుల మండలం నుంచి వచ్చేవారంతా దూరమైనా అనకాపల్లి వెళ్లిపోతున్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. దేవరాపల్లి, చీడికాడ మండలాల వారైతే కొత్తవలస మీదుగా విశాఖపట్నం వెళ్తున్నారు. వ్యాపారాలకు నష్టం: చోడవరంలో 825 దుకాణాలు న్నాయి. వీటిలో కిరాణా 42 ఉన్నాయి. చిల్లర కిరాణా దుకాణాలు మరో 25 వరకు ఉన్నాయి. వడ్డాది వైపు నుంచి కొనుగోలుదారులు పూర్తిగా రావట్లేదు. చీడికాడ మండలం నుంచి కొనుగోలుదారులు తగ్గిపోయారు. గతంలో మా ఆసుపత్రికి రోజుకు 500 మందికి పైగా వచ్చేవారు. ఎక్కువగా చిన్నపిల్లల వైద్యం కేసులు వచ్చేవి. ప్రస్తుతం ఆ సంఖ్య సరాసరి 176కి పడిపోయిందని వైద్యుడు బంగారు కృష్ణ తెలిపారు. రోడ్డుపై కుదుపుల కారణంగా నా వెన్నుపూసలు దెబ్బతిన్నాయి. ఆటో నడపలేకపోతున్నా. కుటుంబం గడవడం కష్టంగా మారిందని ఆటో డ్రైవర్ శ్రీను తెలిపారు. ఒకప్పుడు రోజుకు రూ.17 లక్షలకు పైబడి అమ్మకాలు జరిగేవి. నేడు రూ. తొమ్మిది లక్షలకు అమ్మకాలు పడిపోయాయి. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పసుమర్తి వెంకట్ తెలిపారు.

# ఫెర్రో పరిశ్రమలకు ఉపశమనం

విశాఖపట్నం, విశాఖసమాచారం: అచ్యుతాపురం, జగన్ బాదుడుతో కుదేలైన ఫెర్రో పరిశ్రమలకు కూటమి ప్రభుత్వం ఉపశమనం కల్పించింది. ఈ రంగాన్ని ఆదుకోవడానికి రాయితీలను కొనసాగించాలని నిర్ణయించింది. నడపాలో, మూసివేయాలో తెలియని పరిస్థితుల్లో ఈ పరిశ్రమలకు ట్రూఅప్ ఛార్జీల చెల్లింపులో వెసులుబాటుతోపాటు ఇప్పుడు టారిఫ్ ఛార్జీల రాయితీని మరో ఏడాది కొనసాగించాలంటూ పంపిణీ సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. తెదేపా కృషితో ఫెర్రో కళ: 2002-12 వరకు కేవలం ఏడు పరిశ్రమలే ఉన్న ఏపీలో తెదేపా ప్రభుత్వ కృషి కారణంగా 2018 నాటికి రూ. 15 వేల కోట్ల పెట్టుబడితో 37 పరిశ్రమలను ఏర్పాటు చేశారు. విద్యుత్తుపై ఆధారపడే ఈ పరిశ్రమలకు తెదేపా ప్రభుత్వం సింగిల్ టారిఫ్ కింద యూనిట్ ధర రూ. 4.95కే అందించింది. 2016-17లో రూ.1.50, 2017-18లో 0.75 పైసలు రాయితీ ఇచ్చి నష్టాలు రాకుండా ఆదుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్షంగా 50 వేల మంది అనుబంధ రంగాల ద్వారా మూడు లక్షల మందికి ఉపాధి అందించే ఫెర్రో పరిశ్రమలను వైకాపా పాలనలో నిర్లక్ష్యం చేశారు. రాయితీలు ఇవ్వకపోవడం, నాయకుల వేధింపులు, అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గిపోవడం, నిర్మాణరంగం కుదేలు కావడంతో ధరలు పతనమయ్యాయి. ఇదే సమయంలో అప్పటి ప్రభుత్వం ఈ పరిశ్రమలకు ఉండే సింగిల్ టారిఫ్‌ను డబుల్‌గా మార్చి యూనిట్‌కు 60 పైసలుగా ఉన్న డ్యూటీని 94 పైసలకు పెంచింది. ట్రూ అప్ ఛార్జీల పేరుతో యూనిట్‌కు 70 పైసలు జగన్ సర్కారు ఐదేళ్లపాటు ముక్కుపిండి వసూలు చేసింది. ఎనర్జీ కింద యూనిట్‌కు 52 పైసలు, ఫ్యూయల్ ఛార్జీల కింద 0.40 పైసలు ఇలా అన్ని రకాల బాదుడు కలిపి యూనిట్‌కు రూ.3.89 విధించారు. ఫలితంగా సాధారణంగా యూనిట్ విద్యుత్తుకు చెల్లించే రూ.4.95 కలిపి ఒక్కో యూనిట్ ధర ఏపీలో దేశంలో మరెక్కడా లేనివిధంగా రూ. 8.84కి చేరింది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో (సెజ్) ఉన్న ఆసియాలోనే అతిపెద్ద అభిజీత్ ఫెర్రో ఎల్లాయిస్‌తోపాటు సుందరం, టఫ్ మెటలాజికల్ ఇండియా లిమిటెడ్, రాజరాజేశ్వరీ లలిత త్రిపుర సుందరీదేవి వంటి పరిశ్రమలు వైకాపా పాలనాకాలంలో మూతపడ్డాయి. ఇప్పుడు ఊరట : ఉపాధి పరంగా, ఆదాయం పరంగా అధిక ప్రాధాన్యత గల ఫెర్రో రంగాన్ని ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంది. ట్రూఅప్ ఛార్జీలను 2022-23 ఛార్జీలను 30 నెలల్లో, 2023-24 మొత్తాన్ని 48 నెలల్లో చెల్లించేందుకు అనుమతి ఇచ్చింది. చెల్లించిన మొత్తాన్ని మినహాయించి 2028 మార్చి వరకు చెల్లించే అవకాశం కల్పించింది. దీంతోపాటు ఇప్పుడు టారిఫ్ ఛార్జీలపై రాయితీ మరో ఏడాదికి పొడిగించింది. ట్రూఅప్ వెసులుబాటుతోపాటు ప్రస్తుతం విద్యుత్తు సరఫరా యూనిట్ ధర రూ. 4.95 కొంతమేర తగ్గిస్తే మూసివేసిన పరిశ్రమలు తెరుచుకునే అవకాశం ఉంటుందని ఈ పరిశ్రమల ప్రతినిధులు చెబుతున్నారు. ప్రభుత్వ రాయితీతో అచ్యుతాపురం సెజ్‌లోని అభిజీత్ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమను త్వరలో తెరిపించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే రాజరాజేశ్వరి లలిత త్రిపురసుందరీదేవి పరిశ్రమను తిరిగి ప్రారంభించారు. దీని వల్ల ఎనిమిది వేలమందికి ఉపాధి లభించనుంది.

# గంజాయి వినియోగం కట్టడికి చర్యలు



అనకాపల్లి, విశాఖసమాచారం: అనకాపల్లి పట్టణం, గంజాయి మత్తు వదిలించేలా పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇంతవరకు అమ్మకందారులు, రవాణాదారులను పట్టుకోవడానికే ప్రాధాన్యమిచ్చారు. పోలీసులు ఇప్పుడు గంజాయి తాగేవారిపైనా నిఘా పెడుతున్నారు. ఇందుకోసం గతనెల 21 నుంచి మార్చి 20 వరకు జిల్లాలో ఆపరేషన్ వజ్రప్రహార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఈ మత్తుపదార్థం అమ్మకాలు ఎక్కడెక్కడ సాగుతున్నాయనే దానిపై నిశిత పరిశీలన చేస్తున్నారు. మత్తు బారిన పడుతున్న యువత: చదువు మానేసి ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ మత్తుకు అలవాటు పడుతున్న యువత సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తుంది. ఇటీవల శంకరం శివారు ప్రాంతాల్లో గంజాయి తాగుతున్న ముగ్గురు యువకులను అరెస్ట్ చేశారు. మరోవైపు ఈ వ్యసనం బారిన పడినవారిని గుర్తించి... మాన్పించడానికి అనకాపల్లిలోని వ్యసన విముక్తి కేంద్రానికి పంపుతున్నారు. ఇలా ఇప్పటివరకు 28 మందిని పంపి వీరిని వ్యసన విముక్తులను చేశారు. తాజాగా ఆపరేషన్ వజ్రప్రహార్‌లో నెల రోజులపాటు గంజాయి తాగేవారిపై ప్రత్యేక దృష్టి సారించేలా కార్యక్రమాన్ని రూపొందించారు. దీంట్లో భాగంగా జిల్లాలో నిర్మానుష్య ప్రదేశాలు, శివారు ప్రాంతాలు, పాతపడిన భవనాలు, లాడ్జిల్లో తనిఖీలు చేస్తున్నారు. జిల్లాలో గంజాయి వినియోగం ఎక్కువగా ఉండే 72 హాట్‌స్పాట్లను గుర్తించారు. ఈ ప్రాంతాల్లో అమ్మకాలతోపాటు తాగేవారు ఉంటున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఇప్పటివరకు 32 హాట్‌స్పాట్లలో తనిఖీలు చేశారు. ప్రతిరోజూ వీటిపై ప్రత్యేక నిఘా పెడుతున్నారు. అవసరమైన చోట డ్రోన్ కెమెరాలతో పరిశీలిస్తున్నారు. అమ్మకాలపై ప్రత్యేక నిఘా: గంజాయి అమ్మకాలతోపాటు ఇది తాగేవారిపైనా కేసులు నమోదు చేస్తున్నాం. జిల్లాలో ఆపరేషన్ వజ్రప్రహార్‌లో భాగంగా తనిఖీలు ముమ్మరం చేస్తున్నాం. గంజాయి కేసుల్లో ఎక్కువసార్లు ప్రమేయం ఉన్న వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తున్నాం. జిల్లాలో 23 మందిపై పీడీ యాక్టుకు సిఫార్సు చేశాం. వీరిలో ఆరుగురిపై యాక్టు అములు చేసి జైలుకి పంపాం. మిగిలిన వారిపై అమలు చేస్తాం. యువత మత్తు బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు.

# 'దక్షిణ కోస్తా రైల్వే జోన్'పై వరుసగా చర్చలు

విశాఖపట్నం, విశాఖసమాచారం: విశాఖ కేంద్రంగా ఏర్పడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ పూర్తిస్థాయి కార్యకలాపాలు ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ తేదీ నుంచి అమల్లోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం రైల్వేశాఖను గట్టిగా కోరుతోంది. దీనికి సంబంధించిన కసరత్తు వేగంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. దిల్లీలో రైల్వే బోర్డు ఉన్నతాధికారులతో కలిసి దక్షిణ కోస్తా రైల్వే జోన్ జీఎం సందీప్ మాథుర్, అధికారులు గత కొద్ది రోజులుగా తరచూ సమావేశం అవుతున్నారు. డెక్' నుంచి మొదలైన పాలన: హనుమంతువాక వద్ద నిర్మిస్తున్న జోన్ కార్యాలయం అందుబాటులోకి వచ్చేవరకు వీఎంఆర్‌డీఏ డెక్ భవనంలో తాత్కాలికంగా కార్యకలాపాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా ఈ భవనంలోని ఓ ఫ్లోర్‌ను ఆధునికీకరించారు. పలు విభాగాల అధికారులు, బదిలీపై వచ్చిన కొందరు అధికారులు ప్రస్తుతానికి రోజూ ఇక్కడికే వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. జీఎం మాథుర్ బీచ్ రోడ్డులోని క్యాంపు కార్యాలయంలోనే ఉంటున్నారు. జోన్ కార్యకలాపాల నిర్వహణపై అధికారిక ఉత్తర్వులు రానందున డెక్ భవనంలోని అధికారిక కార్యాలయానికి ఆయన రావడం లేదు. కీలక అధికారుల రాకతో..: దక్షిణ కోస్తా జోన్ కార్యకలాపాల నిర్వహణలో కీలక అధికారుల నియామకం దాదాపు పూర్తయింది. ఆ తర్వాతి స్థాయి అధికారులు బదిలీల్లో రావాల్సి ఉంది. జోన్ పరిధిలో లోకోషెడ్లు, డీజిల్ లోకోషెడ్లు, వ్యాగన్ల నిర్వహణ కేంద్రాలు ఎక్కడెక్కడ ఉన్నాయి, వాటి పర్యవేక్షణ కోసం అవసరమైన ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ నియామకం జరగ్గా ఆయన వీటన్నింటికి సంబంధించిన నివేదిక తయారు చేస్తున్నారు. ఎలక్ట్రికల్ లోకోషెడ్లు, విద్యుత్తు సరఫరా, విద్యుద్దీకరణ, అంతరాయం లేకుండా సరఫరా అందించడం వంటి పర్యవేక్షణ ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ చేయాల్సి ఉంటుంది. డివిజన్లు, జోన్ పరిధిలో స్టేషన్లు...జోనల్ పరిధిలో రైల్వేకు చెందిన ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయి, వాటిని లెక్కించడంలో ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ కీలక పాత్ర వహించనున్నారు. ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్.. నియామకం జరగ్గా ఆయన ఉద్యోగులకు చెందిన అన్ని రకాల వివరాలు నమోదు చేస్తారు. జోన్ పరిధిలో ఆర్థిక వ్యవహారాలు, ఆడిటింగ్‌తో పాటు జోన్‌కు వచ్చే ఆదాయం, చేసే ఖర్చు మదింపులో ప్రిన్సిపల్ చీఫ్ ఫైనాన్షియల్ అధికారి కీలకంగా వ్యవహరిస్తారు. ఇటీవల ఆయన నియామకం పూర్తయింది.జోనల్ పరిధిలో రైల్వేకు చెందిన ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయి, వాటిని లెక్కించడంలో ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ కీలక పాత్ర వహించనున్నారు. ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్.. నియామకం జరగ్గా ఆయన ఉద్యోగులకు చెందిన అన్ని రకాల వివరాలు నమోదు చేస్తారు.జోన్ పరిధిలో ఆర్థిక వ్యవహారాలు, ఆడిటింగ్‌తో పాటు జోన్‌కు వచ్చే ఆదాయం, చేసే ఖర్చు మదింపులో ప్రిన్సిపల్ చీఫ్ ఫైనాన్షియల్ అధికారి కీలకంగా వ్యవహరిస్తారు. ఇటీవల ఆయన నియామకం పూర్తయింది.

## యువకుడి మాటలు నమ్మి విశాఖ నుంచి నెల్లూరుకు

విశాఖపట్నం, విశాఖసమాచారం: కావలి, ప్రేమిస్తున్నానంటూ ఓ యువకుడు చెప్పిన మాటలను నమ్మిన ఓ బాలిక(17) ఉచిత బస్సు సర్వీసు ఉపయోగించుకుంటూ విశాఖపట్నం నుంచి నెల్లూరుకు బయల్దేరింది. మంగళవారం అర్ధరాత్రివేళ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి బస్టాండ్‌లో ఒంటరిగా ఉండగా గస్తీ పోలీసులు ఆరా తీశారు. మహిళా కానిస్టేబుల్ ద్వారా వివరాలు రాబట్టారు. ఆ వివరాలు బుధవారం పోలీసులు వెల్లడించారు. విశాఖపట్నం సీతమ్మధారకు చెందిన ఆ బాలిక ఇంటర్ చదువుతోంది. ఓ సామాజిక మాధ్యమం ద్వారా నెల్లూరు యువకుడు పరిచయమయ్యాడు. ప్రేమిస్తున్నానంటూ చెప్పడంతో బాలిక నమ్మింది. వారిద్దరూ తిరుపతికి వెళ్లి పెళ్లి చేసుకునేందుకు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో సోమవారం పరీక్ష నిమిత్తం కళాశాలకు వెళ్లిన బాలిక ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విశాఖ నుంచి పలు ఉచిత బస్సులు మారుతూ కావలికి చేరుకోగా.. అప్పటికే అర్ధరాత్రి అయింది. నెల్లూరుకు ఉచిత సర్వీసులు లేకపోవడంతో బుధవారం తెల్లవారుజామున వెళ్లేందుకు నిర్ణయించుకుంది. అంతలో పోలీసులు గుర్తించి కావలి ఒకటో పట్టణస్టేషన్‌కు తరలించారు. వారి కుటుంబసభ్యులకు సమాచారం తెలియజేసి అనంతరం వారికి అప్పగించారు. యువకుడి ఆచూకీపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# ఎమ్మెల్యే కుమారుడి పెళ్లికి జగన్ హాజరు



అరకులోయ, విశాఖసమాచారం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అరకులోయ తాంగులగుడ ఆలయ సమీపంలో జరుగుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కుమారుడు చాణక్య వివాహ వేదిక వద్ద వరకు ప్రత్యేక వాహనంలో వచ్చారు. జగన్‌కు ఎమ్మెల్యే దంపతులు బొకే ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం వధూవరులను జగన్ ఆశీర్వదించారు. వివాహ వేదిక వద్ద ఆరు నిమిషాల పాటు ఉండి తిరిగి హెలిప్యాడ్‌కు బయలుదేరారు. దారి పొడవునా ఉన్న పార్టీ శ్రేణులు, అభిమానులకు అభివాదం చేసుకుంటూ వెళ్లారు. హెలిప్యాడ్ వద్ద పార్టీ ముఖ్య నాయకులతో మాట్లాడి హెలికాప్టర్‌లో విశాఖపట్నం వెళ్లిపోయారు. ఈ వివాహానికి మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, కురసాల కన్నబాబు, అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి, తదితరులు హాజరయ్యారు.

విశాఖ సమాచారమ్
శుక్రవారం 6-3-2026

# ఈ బాణాసంచా మేధం ఇంకా ఎన్నాళ్లు?

ఇటీవల వేట్లపాలెంలో చోటుచేసుకున్న భారీ బాణసంచా పేలుడు మరోసారి మనలను ఆలోచనలో పడేసింది.
ఈ బాణాసంచా మేధం ఇంకా ఎన్నాళ్లు?

ఇటీవల వేట్లపాలెంలో చోటుచేసుకున్న భారీ బాణసంచా పేలుడు మరోసారి మనలను ఆలోచనలో పడేసింది. ఆనందానికి ప్రతీకగా నిలిచే బాణసంచా వెనుక ఎంతటి ప్రమాదం దాగి ఉందో ఈ ఘటన ఘోరంగా గుర్తు చేసింది.

ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన కార్మికులు సాయంత్రం సురక్షితంగా తిరిగి వస్తారని ఎదురు చూసిన కుటుంబాలకు అందింది మాత్రం కన్నీటి వార్త.

ఉపాధి.. అవసరమా ప్రమాదమా!
బాణసంచా పరిశ్రమ గ్రామీణ ప్రాంతాల్లో వేలాది కుటుంబాలకు జీవనాధారం. పరిమిత ఉపాధి అవకాశాలున్న ప్రాంతాల్లో రోజువారీ ఆదాయం కోసం ప్రజలు ఈ రంగాన్ని ఆశ్రయించడం సహజం. వ్యవసాయం సీజనల్‌గా ఉండడం, ప్రత్యామ్నాయ పరిశ్రమల కొరత, అప్పుల భారాలు.. ఇవన్నీ కలిసి కార్మికులను ప్రమాదం తెలిసినా అదే పనిలో కొనసాగించేలా చేస్తున్నాయి. జీవనోపాధి అవసరం ముందు భద్రత తరచూ వెనుకబడిపోతోంది. ఇలాంటి ప్రమాదాలు కొత్తవి కావు. తమిళనాడులోని శివకాశి, విరుదునగర్ ప్రాంతాల్లో గతంలో జరిగిన వరుస బాణసంచా పేలుళ్లు ఇదే వాస్తవాన్ని పలుమార్లు మన ముందుంచాయి. ప్రతి ప్రమాదం తర్వాత కఠిన చర్యల హామీలు వినిపిస్తాయి. విచారణలు జరుగుతాయి. బాధ్యులపై కేసులు నమోదవుతాయి. కానీ కొంతకాలం గడిచాక వ్యవస్థ మళ్లీ అలసత్వంలోకి జారిపోతుంది. ఫలితంగా మరో ప్రమాదం, మరో విషాదం. ప్రశ్న ఒకటే.. నేర్చుకున్న పాఠం ఎక్కడ?
నిబంధనలు ఉన్నా అమలు ఎక్కడ?
ముడి పదార్థాల నిల్వ పరిమితి, తయారీ ప్రక్రియలను వేర్వేరు యూనిట్లుగా విభజించడం, అగ్నిమాపక పరికరాల ఏర్పాటు, కార్మికుల సంఖ్యపై నియంత్రణ ఇవన్నీ చట్టాలలో స్పష్టంగా ఉన్నాయి. కానీ అమలు దశలోనే లోపాలు కనిపిస్తున్నాయి. కొందరు యజమానులు లాభాల కోసం అనుమతించిన పరిమితికి మించి రసాయనాలు నిల్వ చేయడం, ఒకే గదిలో అధిక సంఖ్యలో కార్మికులను పని చేయించడం, శిక్షణ లేకుండా కొత్త కార్మికులను నియమించడం, రక్షణ పరికరాల లోపం.. ఇవన్నీ ప్రమాదాలకు దారితీసే అంశాలే..

ప్రభుత్వం పాత్ర.. కఠిన అమలే మార్గం!
ప్రభుత్వం తన బాధ్యతను మరింత కఠినంగా నిర్వర్తించాల్సిన సమయం ఇది. ఆకస్మిక తనిఖీలు క్రమం తప్పకుండా జరగాలి. ఉల్లంఘనలపై భారీ జరిమానాలు విధించాలి. అవసరమైతే లైసెన్సులు రద్దు చేయాలి. తనిఖీలను డిజిటల్ పద్ధతిలో పారదర్శకంగా నిర్వహించాలి. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం సరిపోదు. ప్రమాదం జరగకుండా నిరోధించడమే నిజమైన పాలన.
లాభాల కంటే ప్రాణాలు ముఖ్యం!
పరిశ్రమ యజమానులు కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. భద్రతా పరికరాలు, శిక్షణ, మౌలిక సదుపాయాలు ఖర్చు కాదు.. బాధ్యత! యాంటీ-స్టాటిక్ దుస్తులు, గ్లౌవ్స్, మాస్కులు, కంటి రక్షణ పరికరాలు తప్పనిసరిగా వినియోగంలో ఉండాలి. ప్రతి యూనిట్‌లో అగ్నిమాపక పరికరాలు, స్పష్టమైన అత్యవసర నిష్క్రమణ మార్గాలు ఉండాలి. లాభాల కోసం భద్రతను పక్కన పెట్టడం తాత్కాలిక లాభం కావచ్చు. కానీ అది శాశ్వత నష్టం.
సాంకేతికత.. ప్రమాదాలకు పరిష్కారం!
ప్రమాదకర దశల్లో మానవ జోక్యాన్ని తగ్గించడం అత్యవసరం. రసాయనాల మిశ్రమం, ప్యాకింగ్ వంటి సున్నిత దశల్లో ఆటోమేటెడ్ యంత్రాలను వినియోగించడం ద్వారా ప్రమాద అవకాశాలు తగ్గించవచ్చు. ఉష్ణోగ్రత, తేమ, వాయు ఒత్తిడి మార్పులను గుర్తించే సెన్సర్ వ్యవస్థలు అమలు చేస్తే ముందస్తు హెచ్చరికలు అందుతాయి. ప్రమాదం జరిగిన తర్వాత ఇచ్చే పరిహారం తాత్కాలిక ఉపశమనం మాత్రమే.
సమాజ బాధ్యత
అభివృద్ధి అంటే కేవలం ఉత్పత్తి, ఆర్థిక గణాంకాలు పెరగడం కాదు. ప్రతి కార్మికుడు సురక్షితంగా ఇంటికి చేరుకోవడం కూడా ముఖ్యమైనది. ప్రాణ భద్రత లేకుండా అభివృద్ధి అనే మాట ఖాళీ నినాదంగా మారిపోతుంది. వేట్లపాలెం ఘటన మరోసారి మనకు హెచ్చరిక ఇచ్చింది. ఈసారి అయినా మార్పు తీసుకురాగలమా లేక మరో ప్రమాదం కోసం వేచి చూస్తామా? వెలుగులు ఆనందానికి ప్రతీకలు కావాలి. కానీ ఆ వెలుగుల వెనుక కార్మికుల ఇళ్లలో శాశ్వత చీకట్లు మిగలకూడదు. నరాల బిగువుతో ప్రపంచాన్ని నిలబెట్టే శ్రమజీవి ప్రాణమే నిజమైన సంపద. ఆ ప్రాణాన్ని కాపాడే విధానాలే నిజమైన అభివృద్ధి మార్గం.

# వేడిగాలులు.. వడదెబ్బ ముప్పు

ఈ సమ్మర్ సలసలే.. రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. ఈ మార్చి నెల మొదటి వారం నుంచే సూర్యుడు చుర్రుమనిపిస్తున్నాడు. ఏప్రిల్, మే నెలల్లో మరింత తీవ్రం కానున్నాయి. ఉదయం 10గంటలకే ప్రతాపం చూపుతున్న సూరీడు మధ్యాహ్నం సమయంలో చెమటలు కక్కిస్తున్నాడు. వేడి ఉక్కపోత పెరుగుతాయి. అందుకే అడుగు బయట పెట్టాలంటనే జనం భయపడుతున్నారు. దేశంలో గడిచిన కొన్నేళ్లు గా ఎండలు దంచి కొడుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ పారిశ్రామికీకరణ పేరుతో ప్రపంచ వ్యాప్తంగా అడవులు నరికివేత, కొండలు తొలచివేత, భూమిలో కలవని వ్యర్థాలతో భూ ఉపరితలం నిండిపోవడం, కాలుష్యం, ప్లాస్టిల్ వినియోగం మొదలైన కారణాలతో వస్తున్న వాతావరణంలోని మార్పులు విపత్తులకు కారణభూతాలవుతున్నాయి.
ఎండాకాలం వచ్చిందంటే బైటికెల్లి ఏ పని చేసుకోవాలన్నా కష్టమే. అతిచెమట కాకుండా వడదెబ్బ తగిలే ప్రమాదం కూడా ఉంది. సూర్యకిరణాల వేడిని భరించలేక శరీరంలో ఏర్పడే ఇంబాలెన్స్ వల్ల వ్యక్తి స్పృహ తప్పి పడిపోతాడు. దీన్నే 'వడదెబ్బ' అంటారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులే ఎక్కువగా వడదెబ్బకు గురవుతుంటారు. వీరేకాక దీర్ఘ వ్యాధులతో బాధపడుతున్న వారు, దుర్బలురు, శుష్కించిపోయిన వారిలోను, ఊపిరితిత్తులు, గుండె, జీర్ణకోశ, మూత్రకోశాలకు సంబంధించిన వ్యాధులతో బాధపడేవారు ఎండలో పనిచేసేవారు, స్థూల కాయులు, వాతావరణంలోని మార్పులకి తట్టుకోలేనివారు, శరీరంలో నీటిశాతం తగ్గిన వారు, అధిక శారీరక, మానసిక శ్రమచేసేవారు ప్రత్యక్షం గానో, పరోక్షంగానో వేసవి తాపానికి గురి అవుతారు.
వడదెబ్బ కేసుల్లో పదింట ఒక్కరు మరణించడం జరుగుతున్న కారణంగా ఇది అంత తేలికగా తీసివేయవలసిన సమస్య కూడా కాదు. వడదెబ్బ వల్ల మెదడులో కంజేషన్ ఏర్పడుతుంది. దీనివల్ల బలహీనత, తలనొప్పి, తలతిప్పుట, నోట్లో నీరు ఊరడం, వాంతులు, శరీరం తూలినట్లుండడం, మైకం రావడం, మెంటల్ కన్ఫ్యూజన్, అస్థిమితం, అమిత దాహం, కండరాలలో క్రాంప్స్, అధిక చెమటలు, మెదడులోని సెరిబ్రో స్పైనల్ ద్రవంలో ప్రెషర్ పెరగడం వల్ల నాడీ మండలం దెబ్బతిని రోగి స్పృహ కోల్పోతాడు. ఒక్కోసారి రక్తస్రావం, లివర్, హెపాటిక్ ఫెయిల్యూర్, షాక్ వల్ల మరణం కూడా సంభవిస్తుంది. జీర్ణక్రియ లోపాల వల్ల కడుపుబ్బరం, విరేచనాలు, అపానవాయువు లెక్కువగా పోవడం, వాంతులు కావడం, పోషకాహార లోపం, డీహైడ్రేషన్ వంటి లక్షణాలేర్పడతాయి.
వడదెబ్బ – ముఖ్య లక్షణాలు
శరీర ఉష్ణోగ్రత: జ్వరం 104–106 డిగ్రీల ఫారన్హీట్ వరకుంటుంది.
నాడి వ్యవస్థ: నాడి వేగంగా (నిమిషానికి 150–160 సార్లు) కొట్టుకోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది. నిమిషానికి 20–40 సార్లు ఉచ్ఛ్వాస, నిశ్వాస లుంటాయి. రోగి ఆందోళనగా, నిర్లిప్తంగా, నీరసంగా ఉంటాడు.
మానసిక స్థితి: తలతిరగడం, వాంతులు, మగత, ఫిట్స్ లేదా స్పృహ కోల్పోవడం.
ఇతర లక్షణాలు: చెమట పట్టకపోవడం, విపరీతమైన దాహం, కండరాల నొప్పులు
వడదెబ్బ రకాలు
1. క్లాసిక్ వడదెబ్బ): గాలి ఆడనీ ఇరుకు గదుల్లో ఉండటం వల్ల పిల్లలు, వృద్ధులకు వస్తుంది. ఇది ఆల్కహాలిక్స్, మెడిసిన్స్ వాడేవారిలో వస్తుంది.
2. ఎగ్జర్షనల్ వడదెబ్బ : ఎండలో శారీరక శ్రమ చేసే అథ్లెట్లు, కూలీలు, మిలిటరీ వ్యక్తులకు వస్తుంది.
తీసుకోవాల్సిన జాగ్రత్తలు & చికిత్స:
తక్షణ సాయం: బాధితుడిని వెంటనే నీడలోకి లేదా చల్లని ప్రదేశానికి చేర్చాలి. దుస్తులను వదులు చేసి, శరీరంపై చల్లటి నీరు చిలకరించాలి. చికిత్స ప్రారంభించే ముందు వడదెబ్బ తగిలిన వ్యక్తి వయసు, ఎండ తీవ్రత, రోగి ఆరోగ్య పరిస్థితి, వ్యాధి లక్షణాల్ని బట్టి చికిత్స చేయాల్సి ఉంటుంది
పానీయాలు: కొబ్బరి నీళ్లు, మజ్జిగ, గ్లూకోజ్, ఎలక్ట్రోలైట్ నీళ్లు తరచుగా తీసుకోవాలి.
విశ్రాంతి: ఎండలో బయట తిరిగి వచ్చిన వెంటనే నీళ్లు తాగకుండా, 10–15 నిమిషాల విశ్రాంతి తర్వాతే తీసుకోవాలి.
ఆహారం: తాటి ముంజలు, గంజి వంటి చలవ చేసే పదార్థాలు మరియు పోషకాహారం తీసుకోవాలి.
1. వేసవిలో తీసుకోవాల్సిన పోషకాహారం
ఎండకాలంలో జీర్ణశక్తి మందగిస్తుంది కాబట్టి తేలికపాటి ఆహారం తీసుకోవడం ఉత్తమం.
నీటి శాతం ఎక్కువగా ఉన్న పండ్లు: పుచ్చకాయ, కర్బూజ, నారింజ, మరియు ద్రాక్ష వంటివి శరీరానికి కావాల్సిన ఎలక్ట్రోలైట్లను అందిస్తాయి.
పెరుగు & మజ్జిగ: ఇవి శరీరానికి చలువ చేయడమే కాకుండా ప్రోబయోటిక్స్ వల్ల జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.
ఉల్లిపాయలు: పచ్చి ఉల్లిపాయలను ఆహారంలో తీసుకోవడం వల్ల వడదెబ్బ తగలకుండా రక్షణ లభిస్తుంది.
సబ్జా గింజలు: నీళ్లలో నానబెట్టిన సబ్జా గింజలు తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత త్వరగా తగ్గుతుంది.
2. వడదెబ్బ తగిలినప్పుడు ప్రథమ చికిత్స
ఒకవేళ ఎవరైనా వడదెబ్బ వల్ల స్పృహ కోల్పోతే ఈ క్రమాన్ని పాటించండి:
చల్లబరచడం: బాధితుడి చంకలు, మెడ మరియు గజ్జల భాగంలో ఐస్ ప్యాక్‌లు లేదా తడి గుడ్డలు ఉంచాలి. ఇక్కడ రక్తనాళాలు చర్మానికి దగ్గరగా ఉండటం వల్ల శరీరం త్వరగా చల్లబడుతుంది.
గాలి: ఫ్యాన్ లేదా కూలర్ కింద ఉంచి గాలి తగిలేలా చూడాలి.
ద్రవాలు: స్పృహలో ఉంటేనే ఓఆర్ఎస్ లేదా మజ్జిగ తాగించాలి. స్పృహ లేకపోతే నోటి ద్వారా ఏమీ ఇవ్వకూడదు.
3. ఇతర జీవనశైలి జాగ్రత్తలు
దుస్తులు: లేత రంగులో ఉండే కాటన్ (నూలు) దుస్తులు ధరించాలి. ఇవి గాలిని లోపలికి పంపి, చెమటను త్వరగా పీల్చుకుంటాయి.
సమయం: ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అత్యవసరమైతే తప్ప ఈ సమయంలో బయటకు వెళ్లకపోవడం మంచిది.
రక్షణ: బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ లేదా తలకు రుమాలు చుట్టుకోవడం మర్చిపోవద్దు.
జాగ్రత్త: ఊపిరాడక ఇబ్బంది పడుతున్న వారికి ఆక్సిజన్ ఇవ్వడం చేయాలి. యాంటి షాక్ ట్రీట్మెంట్, ఎలక్ట్రోలైట్ ట్రీట్మెంట్ ఇవ్వాల్సి ఉంటుంది. 95శాతం మందికి విశ్రాంతి ఇచ్చిన 4–5 రోజులకి కోలుకుంటారు. సరైన నిద్ర లేనివారు, ఉపవాసాలున్నవారు, మద్యం సేవించేవారు, జ్వరం ఉన్నవారు, జీర్ణాశయ వ్యాధులతో బాధపడేవారు, జబ్బుపడి కోలుకుంటున్న వారు, సోరియాసిస్, ఎగ్జిమాతో బాధపడేవారు బైట తిరగకుండా జాగ్రత్తపడాలి.
ముందస్తు హెచ్చరికలు
మీకు విపరీతమైన తలనొప్పి వస్తున్నా, చెమట పట్టడం ఆగిపోయినా లేదా కండరాలు పట్టేస్తున్నా (జతీఋఎజూం) వెంటనే నీడలోకి వెళ్లి విశ్రాంతి తీసుకోవాలి. ఇది వడదెబ్బకు ప్రాథమిక సంకేతం.
ముఖ్య గమనిక:
వడదెబ్బ అనేది కేవలం ఎండలో తిరిగే వారికే కాదు, గాలి ఆడని గదుల్లో ఉండేవారికి కూడా ప్రమాదకరమే. ముఖ్యంగా ఊపిరితిత్తులు, గుండె జబ్బులు ఉన్నవారు, స్థూలకాయులు మరింత జాగ్రత్తగా ఉండాలి.
అందుకే అందరూ తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వడదెబ్బ బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవాలి.

**డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు,**
**మాజీ రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం,**
**మేనేజింగ్ ట్రస్టీ, లయన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, విశాఖపట్నం.**

# ఆధ్యాత్మిక స్పర్శ

నాలాంటి ఓ ఆధ్యాత్మికవాదిని ఇంకెక్కడా మీరు చూడలేరు ని ఓ వ్యక్తి తన గురించి గొప్పలు చెప్పుకుంటున్నాడు. ఎలా అలా చెప్పుకుంటున్నారు అని అడిగాడు ఇంకొకడు ఆయనను.
నలబై ఏళ్ళుగా నేను క్రమం తప్పకుండా ఆలయానికి వెళ్ళొస్తున్నాను అన్నాడా పెద్దాయన.
ఆలయానికి వెళ్ళొచ్చినంత మాత్రాన ఆధ్యాత్మికవాది అయిపోతారా అని అడిగాడు రెండో మనిషి.
కాదా మరి అని పెద్దాయన ఎదురుప్రశ్న. మీరు చెప్పిన ప్రకారమైతే ఓ సంగీత కార్యక్రమంలో తల అటూ ఇటూ ఊపే వారందరూ సంగీతకళాకారులేనా అని అడిగాడు. ఏమంటున్నారు అని పెద్దాయన ప్రశ్న.
ఇలా కూర్చోండి...మీరు ఓ కథ చెప్తాను. చెప్పండి.... ఓ దేశంలో ఓ రాజున్నాడు. అతనికి సంగీత జ్ఞానం కాస్తంత కూడా లేదు. కానీ తనకు సంగీత జ్ఞానం ఉందని చెప్పుకోవాలనుకుంటాడు.
అందుకోసమే అప్పుడప్పుడు తను కొన్ని సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుంటాడు. వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులను ఆహ్వానించి వారితో కార్యక్రమాలు నిర్వహిస్తుంటాడు. ప్రజల సమక్షంలో వారిని పాడమంటాడు. కార్యక్రమం జరిగేంతవరకూ రాజు ముందు వరసలో కూర్చుంటాడు, సంగీతాన్ని తెలిసి ఆస్వాదిస్తున్నట్టు తలను అటూ ఇటూ ఊపుతుంటాడు. పైగా ఇందుకోసం ఓ రహస్య ఏర్పాటు చేసుకున్నాడు.
వేదికపైన కళాకారుడు పాడుతుంటాడు. ఎదురుగా రాజు కూర్చుని ఉంటాడు. కింద ఓ నల్లటి తివాచీ పరచి ఉంటుంది. రాజు కాలి వేలికి ఓ నల్లటి తాడు కట్టి ఉంటుంది. ఎవరి కంటికీ తెలియనట్లుగా ఆ తాడు మరొక అంచు తివాచీ కింద నుంచి వైదిక వేనుక ఉన్న మంత్రి చేతిలో ఉంటుంది.
ఎందుకంటే ఆ మంత్రికి సంగీత జ్ఞానముంది. ఆ తాడుని పట్టుకుని నిల్చునుంటాడు. ఈ ఏర్పాటనేది ఎవరూ గుర్తుపట్టలేనంతగా ఎతో పకడ్బందీగా చేయించాడు రాజు. సంగీత విద్వాంసుడు బాగా పాడుతున్నప్పుడల్లా మంత్రి తన చేతికున్న తాడుని మెల్లగా లాగుతాడు. వెంటనే రాజు ఆహా అద్భుతం అంటూ చప్పట్లు కొడతాడు బలంగా. సెభాష్ అంటాడు.
పాడుతున్నతను అది చూసి పరవశించిపోతాడు.
రాజుగారి సంగీత జ్ఞానం అపారమని ప్రజలు కూడా చెప్పుకునేవారు.
ఇలా చాలా కాలం కొనసాగింది
ఓసారి ఓ కళాకారుడు చాలా సేపటి నుంచి పాడుతున్నాడు.
ఓ అద్భుతమైన ఘట్టం. మంత్రి తాడుని బలంగా లాగాడు. ఆ లాగుడుకి తాడు మధ్యలో తెగిపోయింది. రాజు వెంటనే లేచి నిల్చున్నాడు.
ఓయి కళాకారుడా, పాడటాన్ని కాస్తంత పు. తాడు తెగిపోయింది. దాన్ని కట్టుకోనివ్వండి అన్నాడు.
ఈ కథ వినడంతోన ఆధ్యాత్మికవాదినని చెప్పుకునే మనిషి ఆలోచనలో పడ్డాడు.
ఈ ప్రపంచం తలను ఊపే వారందరినీ సంగీతకళాప్రియులు, రసికులు అని అనుకుంటోంది.
ఆలయంలో ప్రదక్షిణలు చేసే వారందరినీ ఆధ్యాత్మికవాదులనుకుంటోంది.
సంగీతానికి పరవశించి అందులో మమేకమైనప్పుడు ఏ కదలికా ఉండదు. మనసారా ఆస్వాదించడం తప్ప. భగవంతుడితో మమేకమైనప్పుడు ఇక ఆరాధన అనేది వీడ్కోలు పలుకుతుంది. అందుకే అంటారు అనుభవజ్ఞులు ... నిదిని దాటడానికి పడవ అవసరం లేదు. ఆధ్యాత్మికతను స్పర్శించేవారికి ఆలయం అవసరం లేదు.
**- యామిజాల జగదీశ్**

# ఆరో రుద్రుడి అమోఘ ముద్ర


**తెలకపల్లి రవి**
**వ్యాసకర్త సీనియర్ పత్రికా సంపాదకులు**

కవి, రచయిత, సినిమారంగ ప్రముఖుడు, కాలమిస్టు, చరిత్ర, సాహిత్య పరిశోధకుడు, నాలుగైదు భాషలు తెలిసినవారు, శ్రీశ్రీ భాషలో తొలుత ఆరో రుద్రుడు... ఆరుద్ర. విశాఖపట్నంలో 1925 ఆగస్టు 31న పుట్టిన భాగవతుల సదాశివ శంకర శాస్త్రి అనేక కలం పేర్లను వాడుతూ 'ఆరుద్ర'గా స్థిర పడ్డారు. ప్రపంచ సాహిత్యాన్ని అధ్యయనం చేసిన ఆయన విద్యార్హత ఎస్సెస్సెల్సీనే! తండ్రి నరసింగరావు సాహిత్యా భిలాషి గనక కనిపించిన పుస్తకమల్లా తెస్తే మేనమామ శ్రీశ్రీ అప్పటికే విశాఖ రీడింగు రూ-ములో పుస్తకాలన్నీ తాను చది వేసి ఆరుద్రతోనూ చదివించారు. ఆ విధంగా 13 ఏళ్ల వయసులోనే ఆరుద్ర కవిత్వ రచన మొదలుపెట్టారు. కొడవటిగంటి కుటుంబరావు కూడా రచనా శిల్పాన్ని మెరుగులు దిద్దారు. చాగంటి సోమయాజులు మార్క్సిజాన్ని మేధాగతం చేసుకోవడానికి ఉత్ప్రేరకంగా పనిచేశారు. 1942లో సెట్టి ఈశ్వరరావు సిఫార్సుపై ఆరుద్ర కమ్యూ నిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించి పార్టీ కార్యకలాపాల్లో పాల్గొ న్నారు. రెండవ ప్రపంచ యుద్ధంలో రష్యాపై జర్మనీ దాడి చేశాక... అందుకు వ్యతిరేకంగా తన వంతు పాత్ర నిర్వహించేందుకై ఆరుద్ర వైమానిక దళంలో చేరారు. 'ఆనందవాణి' పత్రికలో కొలువుతో సహా అనేక మజిలీల తర్వాత మద్రా సులో స్థిరపడి సృజన, పరిశోధన సాగించారు. 1955లో దర్శక దిగ్గజం హెచ్‌ఎం రెడ్డి, శ్రీశ్రీలే సాక్షులుగా రూ.60 ఖర్చుతో రామలక్ష్మిని రిజిస్టరు వివాహం చేసుకున్నారు.
కవిత్వంలో ప్రయోగాలకూ ఆధునికతకూ ఆరుద్ర ప్రాధాన్యాన్నిచ్చారు. 'గాయాలూ గేయాలూ', 'సాహిత్యోపని షత్', (ఛందస్సు లేని) 'ఇంటింటి పజ్యాలు', 'కూనలమ్మ పదాలు', 'సినీ వాలి', 'పైలా పచ్చీసు', 'అమెరికా ఇంటింటి పజ్యాలు' తదితర రచనలు చేశారు. నాట్యశాస్త్రంలోని 'హస్త లక్షణ పదాలు' మరో ప్రత్యేక రచన. 'ఆరుద్ర అరబ్బీ మురబ్బాలు' ఆయన మరణానంతరం వెలువడ్డాయి. జీవితపు చివరి దశలో మొదలు పెట్టిన 'మనిషి %–% ఆడ మనిషి' కావ్యంలోని ఒక భాగం 'స్త్రీ పురాణం' మహిళా కోణాన్ని ఆవిష్కరించింది.
తను రాయని 'సినీవాలి' అనే కావ్యం రాసినట్టు ఎవరో పొరబాటున పేర్కొంటే ఆ పేరుతో కావ్యం రాశారు. ఇంటింటి పజ్యాలు, కేరా శతకము వంటివి అలవోక ప్రయోగాలే. 'కూనలమ్మ పదాలు' వందల మందిని కవులను చేశాయంటారు. వీర తెలంగాణ సాయుధ పోరా టంపై హరీంద్రనాథ్ చటోపాధ్యాయ గీతాలను తెలుగులోకి అనువదించగా సుందరయ్యగారి పుస్తకంలో ప్రచురించారు.
'కొండగాలి తిరిగింది' పేరిట వచ్చిన సినిమా పాటలు ఆయన పట్టును చెబుతాయి. 'ఎదగడానికెందుకురా తొందర' పాటలో నిరుద్యోగాన్ని వివరిస్తారు. 'గాన్ధీ పుట్టిన దేశమా ఇది' అంటూ ప్రశ్నిస్తారు. 'వేదంలా ఘోషించే గోదావరి', 'మహాబలిపురం' వంటి పాటలు వింటే రాగం చరిత్ర అల్లుకుపోవడం చూస్తాం. అందులో కూడా 'కట్టు కథల చిత్రాంగి కనకమేడలు' అంటూ అది నిజం కాదని సూచిస్తారు.
'కొట్టుకుని పోయే కొన్ని కోటి లింగాలు వీరేశలింగమొకడు మిగిలెను చాలు' అన్న ఆయన మాటలు సుభాషితాల్లా నిలిచిపోయాయి. 'రగిలింది విప్లవాగ్ని ఈ రోజు' అంటూ 'అల్లూరి సీతారామరాజు'కు రాసిన పాట కూడా గొప్పగా ఉంటుంది. సినిమా పాటల తీరు మారి విలువలు తగ్గిపోతున్న దృష్ట్యా వాటిని రాయడం విరమించుకున్నారు. 150 చిత్రాలకు మాటలూ, 500 చిత్రాల్లో నాలుగు వేల పాటలూ రాశారు. సినీ జనానికి ఆయనో విజ్ఞాన సర్వస్వంలా గోచరించేవారు.
సామాన్యుడికి సాహిత్య చరిత్ర తెలియడానికి 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' మహాభారం వేసుకున్నానని ఆరుద్ర వినయంగా చెప్పినా... పండితులకే గొప్ప వనరు సమ కూర్చారు. దాన్ని రాసే సమయంలో తీరిక లేకపోవడం వల్లనే గడ్డం చేసుకోవడం మానేసి పెంచేశానని సరదాగా చెబుతుండేవారు. 'వేమన వేదం', 'మన వేమన', 'వ్యాస పీఠం', 'గురజాడ గురుపీఠం' సంపుటాలుబీ 'ప్రజా కళలూ %–% ప్రగతివాదులూ' ఆయన ప్రజ్ఞకు ప్రతిబింబాలుగా నిలిచి ఉన్నాయి. 'రాముడికి సీత ఏమవుతుంది?, 'గుడిలో సెక్స్' అన్న గ్రంథాలు ఇప్పుడెంత సంచలనమయ్యేవో! కళలు, క్రీడలు, ఇంద్రజాలం వంటి అంశాలపై కూడా సాధికార గ్రంథాలు వెలువరించారు.
రెండవ ప్రపంచ యుద్ధంలో ఫాసిజాన్ని ఓడించా లంటూ సైన్యంలో చేరడంతో మొదలైన ఆరుద్ర రాజకీయ అవగాహన ఆఖరు దాకా ప్రగతిశీలంగానే సాగింది. సైద్ధాంతిక విభేదాలు పెరిగినపుడు మామూలు కవులుగా అందు కోవడంలో తాము పొరబడి ఉండొచ్చని నిస్సంకోచంగా వినయంగా చెప్పారేగానీ ఇతరులపై దాడి చేయలేదు.
1985లో ఆరుద్ర షష్టి పూర్తి సాహిత్య లోకంలో ఒక పండుగలా జరిగింది. తర్వాత కాలంలో ఆరుద్ర ఉద్యమానికి మరింత దగ్గరయ్యారు. సోవియట్ విచ్ఛిన్నం, ప్రపంచీ కరణ, దేశంలో అయోధ్య వివాద తరుణంలో ఆరుద్ర 'మనీ ప్రపంచం మనీ ప్రపంచం/ మనీ ప్రపంచం గెలిచిందా? మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం మారిందా?' అని ప్రశ్నించారు.
ఆరుద్ర 1998 జూన్ 4న కన్నుమూసిన సంగతి అంత్యక్రియలు ముగిశాక గాని తెలియలేదంటే అది ఆయన నిరాడంబరతకు ఓ నిదర్శనమే. తన అంతిమఘట్టం అలా నిశ్శబ్దంగా జరిగిపోవాలని ఆయన ఆకాంక్షించారని భార్య రామలక్ష్మి నా ఇంటర్వ్యూలో చెప్పారు. చరిత్రనే తిరగదోడే అసహన ధోరణులు దాడులూ, కళాసాహిత్యాలలో వాణిజ్య ప్రలోభాలూ పెరిగిన ఈ తరుణంలో ఆరుద్ర జీవితం అధ్యయనానికీ, ఆచరణకూ మార్గదర్శకం.

# ఆడవారికి దీర్ఘకాలం నొప్పులేల?



నొప్పుల విషయంలో ఆడవారి తీరే వేరు. మరింత తీవ్రంగా, ఎక్కువకాలంగా నొప్పులు వేధిస్తున్నాయని మహిళలు చెబుతుంటారు. భావోద్వేగంతో వాళ్లు అలా భావిస్తుండొచ్చని, అంతా వారి మెదడులోనే ఉందని చాలాకాలంగా భావిస్తూ వస్తున్నారు. అయితే ఇది నిజం కాదని ఎట్టకేలకు బయటపడింది. శరీరం నొప్పిని 'ఆపటం'లో ప్రాథమికంగానే ఆడ, మగవారి మధ్య తేడా ఉంటోందని మిషిగన్ స్టేట్ యూనివర్సిటీ అధ్యయనం పేర్కొంటోంది. ఇదంతా రోగనిరోధక వ్యవస్థతో ముడిపడి ఉంటుండటం గమనార్హం. దీర్ఘకాల నొప్పిని డాక్టర్లు చూస్తున్న తీరునే ఇది మార్చేసింది. ఇప్పటివరకూ డాక్టర్లు నొప్పి ఎలా మొదలైందనే దాని మీదే దృష్టి సారిస్తున్నారు. తాజా అధ్యయనం మాత్రం నొప్పి ఎందుకు తగ్గటం లేదనే దాన్ని నిశితంగా పరిశీలించింది. సమయం గడుస్తున్న కొద్దీ నొప్పి తగ్గటం మాటెలా ఉన్నా ఇదో చురుకైన ప్రక్రియని, ఒంట్లోని హార్మోన్ల మీద ఇది ఆధారపడి ఉంటున్నట్టు పరిశోధకులు గుర్తించారు.

ఎందుకీ తేడా?: మోనోసైట్స్ అనే తెల్ల రక్తకణాలు సమాచార వాహకాలుగా పనిచేస్తుంటాయి. ఇవి నొప్పి సంకేతాలను నాడులకు చేరవేయొద్దని శరీరానికి చెబుతుంటాయి. వీటి మీదే పరిశోధకులు ప్రత్యేకంగా అధ్యయనం చేశారు. టెస్టోస్టిరాన్ హార్మోన్ ప్రభావం కారణంగా మగవారిలో ఇవి చాలా చురుకుగా ఉంటున్నట్టు గుర్తించారు. పురుషులకు గాయాలైనప్పుడు వారి శరీరం ఐఎల్-10 అనే అణువులను విడుదల చేస్తుంది. ఇవి ఒకరకంగా నొప్పిని ఆపేసే శారీరక 'మీట' మాదిరిగా పనిచేస్తాయి. టెస్టోస్టిరాన్ ప్రేరేపితం కావటం వల్ల మగవారి శరీరం నొప్పి సంకేతాలను త్వరగా ఆపేస్తుందన్నమాట. దీన్ని మరింత లోతుగా విశ్లేషించగా- నాడులను శాంతింపజేయటానికి పురుషుల్లో రోగనిరోధక వ్యవస్థ ఇంకాస్త సమర్థంగా పనిచేస్తున్నట్టూ వెల్లడైంది. ఆడవారిలోనైతే ఈ ప్రక్రియ మందకొడిగా సాగుతున్నట్టు బయటపడింది. నొప్పి భావన తగ్గటానికి తోడ్పడే మోనోసైట్స్ స్త్రీలలో తక్కువగా ఉండటమే కాకుండా, అవి అంత చురుకుగా ఉండవు కూడా. దీని మూలంగానే వీరికి ఎక్కువకాలం నొప్పి కలుగుతుండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. ఆడవారిని దీర్ఘకాలం నొప్పులు ఎందుకు వేధిస్తుంటాయో.. ప్రమాదాల, గాయాలు, శస్త్రచికిత్సల నుంచి కోలుకున్నా నెలల తరబడీ నొప్పులతో ఎందుకు బాధపడుతుంటారో ఇది విశ్లేషిస్తోందని చెబుతు న్నారు.

# క్యాన్సర్‌ను ఓడిద్దాం!



అధునాతన చికిత్సల పుణ్యమాని ఇప్పుడు ఎంతోమంది క్యాన్సర్ నుంచి బయటపడుతున్న మాట నిజమే అయినా దీన్ని నివారించుకోవటంలోనే ఉంది అసలు విజ్ఞత. క్యాన్సర్లను తగ్గించుకోవటానికి సమర్థమైన, చవకైన, సుస్థిరమైన వ్యూహం ఇదేనన్నా అతిశయోక్తి కాదు. అందువల్ల జబ్బు వచ్చాక చికిత్స తీసుకోవటం కన్నా నివారించుకోవటం మీద దృష్టి సారించేలా చూడటం ప్రధానం. ప్రజలతో పాటు ప్రభుత్వాలు, సంస్థలూ కలిసి కట్టుగా పనిచేస్తేనే ఇది సాధ్యమవుతుంది.

నివారణే ప్రధానం

ఆశ్చర్యంగా అనిపించినా సుమారు 40-50% క్యాన్సర్లు నివారించుకోదగ్గవే. జీవనశైలిని మార్చుకోవటం, టీకాలు తీసుకోవటం, తొలిదశలో గుర్తించటం, పర్యావరణ పరిరక్షణ ఇందులో కీలక పాత్ర పోషిస్తాయి. మనదేశంలో చాలామందిలో ముదిరిన తర్వాతే క్యాన్సర్ బయటపడుతుండటం, మారుమూల ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు అంతగా అందుబాటులో లేకపోవటం వంటి పరిస్థితుల నేపథ్యంలో నివారణ చర్యలతో ఎంతోమంది ప్రాణాలను కాపాడుకోవచ్చు. క్యాన్సర్‌తో బాధపడకుండా చూసుకోవచ్చు. వైద్య ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చు. కాబట్టి నివారించుకోదగిన ప్రధానమైన క్యాన్సర్ ముప్పు కారకాల గురించి తెలుసుకొని ఉండటం మంచిది.

**పొగాకు వాడకం - ముఖ్యమైన కారణం**

పొగాకు ఏ రూపంలోనైనా హానికరమే. సిగరెట్లు, చుట్టలు, బీడీలు కాల్చినా.. గుట్కా, జర్దా, ఖైనీ నమిలినా క్యాన్సర్ ముప్పు కొని తెచ్చుకున్నట్టే. మనదేశంలో మూడింట ఒకవంతు క్యాన్సర్లకు పొగాకే కారణం. నోరు, గొంతు, నాలుక, ఊపిరితిత్తులు, అన్నవాహిక, మూత్రాశయ క్యాన్సర్లకూ పొగాకు వాడకానికీ బలమైన సంబంధం ఉంది. పొగ తాగొద్దు, పొగాకు నమలొద్దు. అలవాటుంటే వెంటనే మానెయ్యాలి. పొగాకు వాడకాన్ని నిషేధించే చట్టాలను కచ్చితంగా అమలు చేయాలి. బడులు, సమాజంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పొగ మానెయ్యటానికి కౌన్సెలింగ్, తోడ్పాటు ఇవ్వాలి.

ఆరోగ్యకర ఆహారం, వ్యాయామం కీలకం

క్యాన్సర్ నివారణకు తోడ్పడే జీవనశైలి మార్పుల్లో అతి ముఖ్యమైనవి ఇవే. మాంసం, చక్కెర, ఉప్పు ఎక్కువగా తినటం.. పండ్లు, కూరగాయలు తక్కువగా తినటం వల్ల పెద్ద పేగు, రొమ్ము, జీర్ణాశయ క్యాన్సర్లు తలెత్తే అవకాశముంది. వ్యాయామం, శారీరక శ్రమ తగ్గినా క్యాన్సర్ల ముప్పు పెరుగుతుంది.

పండ్లు, కూరగాయలు, నిండు గింజ ధాన్యాలు, పప్పులతో కూడిన సమతులాహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయల్లో క్యాన్సర్ నిరోధకాలు ఎక్కువగా ఉంటాయి.

మాంసాహారులు మాంసం తగ్గించుకోవాలి.

బాగా శుద్ధిచేసి తయారుచేసిన ఆహార పదార్థాలు, తీపి పానీయాలు, కొవ్వు పదార్థాలు పరిమితం చేసుకోవాలి.

వీలైనంత వరకూ ఉడికించిన పదార్థాలు తినాలి. వేపుళ్లు తగ్గించుకోవాలి.

రోజూ కనీసం అరగంట వ్యాయామం చేయాలి.

శరీర బరువు అదుపులో ఉంచుకోవాలి.

**మద్యం - పెద్ద శత్రువు**

మద్యం క్యాన్సర్ కారకం. ఇది కాలేయం, రొమ్ము, నోరు, గొంతు, అన్నవాహిక క్యాన్సర్లకు దారితీస్తుంది.

మద్యం జోలికి వెళ్లొద్దు. అలవాటుంటే పరిమితం చేసుకోవాలి. మద్యంతో ముంచుకొచ్చే ముప్పుల మీద ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి.

**టీకాలు - ఒక అభయం**

మనదేశంలో కొన్నిరకాల ఇన్‌ఫెక్షన్లు క్యాన్సర్లు తలెత్తటంలో పెద్ద పాత్ర పోషిస్తున్నాయి. హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ)తో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్.. హెపటైటిస్ బి, సితో కాలేయ క్యాన్సర్.. హెలికోబ్యాక్టర్ పైలోరీతో జీర్ణాశయ క్యాన్సర్లు వస్తున్నాయి. అదృష్టం కొద్దీ హెచ్‌పీవీ, హెపటైటిస్ బి నివారణకు టీకాలు అందుబాటులో ఉన్నాయి.

యుక్తవయసు అమ్మాయిలందరికీ హెచ్‌పీవీ టీకా ఇప్పించాలి. వీలైతే అబ్బాయిలకూ ఇప్పించటం మంచిది.

సార్వత్రిక హెపటైటిస్ బి టీకా కార్యక్రమాన్ని అమలు చేయాలి. సూదులు ఇవ్వటం, తీసుకోవటం, రక్త పరీక్షల విషయంలో సురక్షిత విధానాలు పాటించాలి.

దీర్ఘకాల ఇన్‌ఫెక్షన్లకు ముందుగానే చికిత్స తీసుకోవాలి.

**పర్యావరణ, వృత్తిపర అంశాలు**

గాలి కాలుష్యం, పురుగు మందుల ప్రభావం, పారిశ్రామిక రసాయనాలు, పనిచేసే చోట సురక్షితంగా లేకపోవటం వంటివీ క్యాన్సర్ ముప్పు పెరిగేలా చేస్తాయి. ముఖ్యంగా ఊపిరితిత్తి, చర్మ క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఎక్కువ.

కాలుష్యాన్ని కట్టడి చేయటానికి కఠినమైన చర్యలు తీసుకోవాలి. పరిశ్రమలు, ఆఫీసుల్లో భద్రత నియమాలు పాటించాలి. అవసరమైన చోట మాస్కుల వంటివి ధరించే ఏర్పాట్లు చేయాలి. పర్యావరణ ప్రమాదాల మీద ప్రజలకు అవగాహన కల్పించాలి. ముందస్తు పరీక్షలు, తొలిదశలో గుర్తించటం క్యాన్సర్ నివారణ చర్యలు ముప్పును తగ్గిస్తే.. తొలిదశలో గుర్తించటం ప్రాణాలను కాపాడుతుంది. ఎందుకంటే తొలిదశలోనే పట్టుకొని, తగు చికిత్స చేస్తే ఎన్నో క్యాన్సర్లను నయం చేయొచ్చు. ఇందుకు ముందస్తు పరీక్షలు (స్క్రీనింగ్) బాగా ఉపయోగపడతాయి.

వీఐఏ (విజువల్ ఇన్‌స్పెక్షన్ విత్ అసిటిక్ యాసిడ్), పాప్ స్మియర్, హెచ్‌పీవీ పరీక్షలు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ముందే గుర్తించటానికి తోడ్పడతాయి.

రొమ్ముల స్వీయపరీక్ష, డాక్టర్‌తో పరీక్షించుకోవటం, మామోగ్రామ్ ద్వారా రొమ్ముక్యాన్సర్‌ను పట్టుకోవచ్చు.

తరచూ నోటిని పరీక్షించుకోవటం ద్వారా ముఖ్యంగా పొగాకు అలవాటు గలవారిలో నోటి క్యాన్సర్ ఆనవాళ్లను గుర్తించొచ్చు. పెద్దపేగు క్యాన్సర్ ముప్పు ఎక్కువగా గలవారికి కొలనోస్కోపీ పరీక్షతో ముందే కనుక్కోవచ్చు.

**అవగాహన ఆయుధంగా**

అవగాహన లేమి, అపోహలు, చిన్నచూపు, భయం మూలంగా క్యాన్సర్ నిర్ధారణ ఆలస్యమవుతోంది. అందువల్ల క్యాన్సర్ హెచ్చరిక సంకేతాలను గుర్తించటం, అపోహలను తొలగించటం, సమయానికి డాక్టర్‌ను సంప్రదించటం, చిన్నప్పటి నుంచి ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించటం మీద విస్తృతంగా ప్రచారం చేయటం, అవగాహన కల్పించటం ముఖ్యం. పాఠశాలలు, కార్యాలయాలు, మీడియా, సామాజిక కార్యకర్తలు అంతా ఇందుకు కృషి చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

# దేవతలా? ఆకాశ యాత్రికులా?



ఇతర నక్షత్ర మండలం నుంచి మన సౌర మండలంలోకి దూసుకొచ్చిన 3ఐ/అట్లాస్ అనే ఖగోళ వస్తువు శాస్త్రరంగంలో కొత్త చర్చను రేకెత్తించింది. కొందరు శాస్త్రవేత్తలు దీన్ని గ్రహాంతరవాసుల వ్యోమనౌక కావొచ్చని చెబుతోంటే.. అమెరికా అంతరిక్ష సంస్థ మాత్రం అది తోకచుక్కేనని పేర్కొంటోంది. ఎవరి వాదన ఎలా ఉన్నా గ్రహాంతరవాసుల మీద మనకు మొదటి నుంచీ ఆసక్తే. మనలాంటి బుద్ధిజీవులు ఇంకా ఎక్కడైనా ఉన్నారేమోననే అన్వేషణ చాలాకాలంగా సాగుతూనే వస్తోంది.

డ్రేక్ సమీకరణ అంచనాను బట్టి మన పాలపుంతలోని 'గోల్డిలాక్స్ జోన్'లో సుమారు 5-20% నక్షత్రాలు భూమిలాంటి గ్రహాలు కలిగుండొచ్చని అంచనా. అయితే, ఇవి నిజంగా మనుషులతో నిండివున్నాయా? అనేది మాత్రం ప్రశ్నార్థకమే!

మన విశ్వం ఎంత పెద్దదంటే, చిన్నప్పుడు మనం చెప్పుకొన్న కథల్లోని అంతులేని లోకాల కన్నా చాలా గొప్పది. ఊరి చివర నిలబడి చూస్తే, ఆకాశంలో నక్షత్రాలు చిన్న చిన్న చుక్కల్లా కనిపిస్తాయి కదా. కానీ, మన శాస్త్రవేత్తలు, తమ శక్తిమంతమైన కళ్లతో.. అంటే టెలిస్కోపులతో చూసి, లెక్కలు కట్టి ఏం కనిపెట్టారంటే- ఆ చుక్కల్లో చాలావరకూ మన సూర్యుడిలాంటివేనని! వాటి చుట్టూ మన భూమి లాంటి గ్రహాలు అనేకం తిరుగుతున్నాయనీ. అంటే జీవం పుట్టడానికి కావలసిన పరిస్థితులు గల గ్రహాలు చాలానే ఉన్నాయనే అర్థం. ముఖ్యంగా, ఇటీవలే ప్రయోగించిన జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ మనకు వేలకొద్దీ కొత్త గ్రహాలను (ఎక్సోప్లానెట్స్) చూపించింది. వాటిలో కొన్ని మన భూమిని పోలిన.. జీవం మనగలిగే పరిస్థితులు (వేడి, చలి వంటివి) గల గ్రహాలు అనేకం ఉన్నాయని, జీవం బతికే అవకాశం వీటిలో పుష్కలమని శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు. ఇంత పెద్ద విశ్వంలో, మనలాంటి ప్రాణులు.. ఆ మాటకొస్తే మనకన్నా తెలివైన వాళ్లు ఉన్నారేమోననే ప్రశ్న మన మనసులను నిరంతరం తొలవటానికి ఇలాంటివి మరింత ఆజ్యం పోస్తున్నాయి.

కథలు-అనుమానాలు

గ్రహాంతర వాసుల గురించి చరిత్రలో పేర్కొన్న కొన్ని ఆసక్తికరమైన కథలు, కొన్ని అనుమానాలను, వాటికి సంబంధించిన సిద్ధాంతాలను అవలోకిస్తే చాలా చిత్రంగా తోస్తాయి.

ఈజిప్టులోని పిరమిడ్లలో, మెక్సికోలోని మాయన్ నాగరికతకు చెందిన చిత్రాలలో ఆకాశం నుండి దిగి వచ్చే వింత వస్తువులు, చిత్ర విచిత్ర ఆకారంలో ఉన్న మనుషులు మొదలైనవన్నీ ఒకప్పుడు భూమిని సందర్శించిన గ్రహాంతరవాసుల ఆనవాళ్లేనని.. వీరే దేవుళ్లని వ్యోమగామి సిద్ధాంతం పేర్కొంటోంది. వారే ఇక్కడి ప్రజలకు సంస్కృతి, జ్ఞానాన్ని, నిర్మాణ పద్ధతులను నేర్పారని చెబుతోంది.

2. ఆ ఆయుధాల రహస్యం అదేనా?

ప్రపంచంలో కొన్ని దేశాలు, మిగతా దేశాల కన్నా చాలా వేగంగా, విపరీతంగా ఆయుధ సాంకేతికతలో ముందుకెళ్తుంటాయి. ఒక్కసారిగా కొత్తరకం విమానాలు, కొత్తరకం క్షిపణులు వచ్చేస్తాయి. బహుశా, ఆ దేశాల ప్రభుత్వాలు రహస్యంగా గ్రహాంతరవాసుల అంతరిక్ష నౌకలను లేదా వారి పరికరాలను భూమిపైకి తెచ్చి, వాటిని జాగ్రత్తగా పరిశీలించి, ఆ జ్ఞానాన్ని ఉపయోగించుకుని తమ ఆయుధాలను తయారు చేసుకుంటున్నాయేమోనని ఒక వాదన ప్రచారంలో ఉంది. దీనినే రివర్స్ ఇంజనీరింగ్ సిద్ధాంతంగా పేర్కొంటారు.

3. ఏరియా 51 - అమెరికా రహస్య ప్రదేశం

అమెరికా దేశంలో, నెవాడా ఎడారి ప్రాంతంలో ఏరియా 51 అని ఒక సైనిక స్థావరం ఉంది. అది అత్యంత రహస్యమైంది. అక్కడికి ఎవరినీ సులభంగా వెళ్లనివ్వరు. అసలు అక్కడ ఏం జరుగుతుందో బయటి ప్రపంచానికి తెలియదు. వాడుకలో ఉన్న కథనం ప్రకారం- 1947లో న్యూ మెక్సికోలోని రోస్‌వెల్‌లో గ్రహాంతరవాసుల ఎగిరే పళ్లెం కూలిపోయిందని, అందులోంచి అంతరిక్ష నౌక శకలాలను, గ్రహాంతర వాసుల మృతదేహాలను సంగ్రహించారని.. మరికొందరిని బందీలుగా పట్టుకొని ఏరియా 51లో రహస్యంగా ఉంచి అధ్యయనం చేస్తున్నారని కథలు ప్రచారంలో ఉన్నాయి. బాబ్ లాజార్ అనే శాస్త్రవేత్త అక్కడి పరిశోధనలలో గ్రహాంతర టెక్నాలజీపై తాను పనిచేసినట్లు చెప్పి, ఈ కథనాలకు మరింత ఊపునిచ్చారు.

ఎన్నెన్నో..

నాసా, కెప్లర్ టెలిస్కోప్, హబుల్ టెలిస్కోప్, జేమ్స్ వెబ్ టెలిస్కోప్, టిస్ సమాచారాన్ని బట్టి.. 1. గెలాక్సీలు: మనం చూడగలిగే విశ్వంలో దాదాపు 10,000 కోట్ల నుండి 2 లక్షల కోట్ల వరకు గెలాక్సీలు ఉండొచ్చని అంచనా.

2. నక్షత్రాలు: మన పాలపుంత గెలాక్సీలోనే 10,000 కోట్ల నుండి 40,000 కోట్ల వరకు నక్షత్రాలు ఉండొచ్చు. విశ్వం మొత్తం కలిపితే 1 సెప్టిలియన్ (1 తర్వాత 24 సున్నాలు!) నక్షత్రాలు ఉండొచ్చని అంచనా.

ఎలా లెక్కిస్తారు? ఆకాశంలో కొన్ని భాగాలను అన్వేషించి, అక్కడ ఎన్ని గెలాక్సీలు/నక్షత్రాలున్నాయో లెక్కిస్తారు. ఇదే లెక్కను మిగిలిన భాగాలకు విస్తరణ చేసి ఎన్ని ఉండవచ్చో గణిస్తారు.

3. గ్రహాలు: మన గెలాక్సీలోనే ప్రతి నక్షత్రానికి కనీసం ఒక గ్రహం అయినా ఉండే అవకాశం ఉంది. అంటే లక్షల కోట్ల గ్రహాలు మన గెలాక్సీలోనే ఉండొచ్చు. విశ్వం మొత్తం కలిపితే క్విన్టిలియన్ల (1 తర్వాత 18 సున్నాలు) వరకు ఉండొచ్చు.

ఎలా లెక్కిస్తారు? గ్రహం దాని నక్షత్రం ముందునుంచి వెళ్లినప్పుడు, నక్షత్రం కాంతి కొద్దిగా తగ్గడాన్ని బట్టి అక్కడ గ్రహం ఉన్నట్టు అర్థం .

అలాగని ఈ గణాంకాలు స్థిరమేమీ కాదు. ఎందుకంటే విశ్వ ఆవిర్భావాన్ని వివరించే మహా విస్ఫోటం సిద్ధాంతం ప్రకారం ఇంకా విశ్వం వ్యాప్తి చెందుతూనే ఉంది. ఈ క్రమంలో కొత్త గెలాక్సీల ఆవిర్భావం జరుగుతూనే ఉంటుందన్నమాట.

విజ్ఞానశాస్త్రం చెబుతున్నదేంటి?

ఈ మహా విశ్వంలో మనలాంటి బుద్ధిజీవులు ఎవరైనా ఉన్నారా? ఈ రహస్యాన్ని ఛేదించడానికి విజ్ఞానశాస్త్ర సహాయాన్ని తీసుకొని ప్రయత్నించి చూద్దాం.

డ్రేక్ సమీకరణం: మన పాలపుంత గెలాక్సీలోనే.. మనలాంటి బుద్ధి జీవులు (అంటే, మనలాగే ఆలోచించేవారు) ఎంతమంది ఉండొచ్చో అంచనా వేయటానికి డాక్టర్ ఫ్రాంక్ డ్రేక్ అనే శాస్త్రవేత్త ఒక 'జీవన లెక్క' కనిపెట్టారు. ఇందులో నక్షత్రాలు ఎంత వేగంగా పుడుతున్నాయి? వాటి చుట్టూ జీవానికి అనుకూలమైన గ్రహాలు ఎన్ని దొరుకుతున్నాయి? ఆ గ్రహాలపై జీవం పుట్టే అవకాశం ఎంత? ఆ జీవం తెలివైన నాగరికతగా మారే అవకాశం ఎంత? ఇలాంటివన్నింటినీ లెక్కలోకి తీసుకుంటారు. ఆయన సమీకరణ అంచనా ప్రకారం- 'గోల్డిలాక్స్ ప్రాంతం' (నీరు ద్రవరూపంలో ఉండి, నియమిత శీతోష్ణస్థితులతో జీవం కలిగుండే పరిస్థితులతో కూడిన భూమి వంటి గ్రహాలు ఉండే ప్రదేశం)ను పరిగణలోకి తీసుకొని చూస్తే, కేవలం మన గెలాక్సీలోనే వేలల్లో, లక్షల్లో తెలివైన నాగరికతలు ఉండే అవకాశం ఉందట! నిజంగా ఆశ్చర్యకరమైన విషయం కదా!

ఫెర్మీ వైరుధ్యం: మన నక్షత్ర మండలంలోనే లక్షలాది తెలివైన నాగరికతలుంటే అక్కడి నుంచి ఎవరూ మన దగ్గరికి రాలేదేంటి? అనే ప్రశ్న ఉదయించడం సహజమే. దీనికి సమాధానమే 'ఫెర్మీ వైరుధ్యం'. ఇదో పెద్ద చిక్కుముడి. సాపేక్ష సిద్ధాంతం చెప్పే సమాధానం ఇదీ.. మనకీ, వాళ్లకీ మధ్య దూరాన్ని ఊహించుకోవడమే కష్టం. అంతేకాదు.. వారిని చేరుకోవటానికి కాంతి వేగాన్ని మించిన వేగంతో, సంవత్సరాల తరబడి ప్రయాణం చేయాలి. ఇది అసాధ్యం. వాళ్లు మన దగ్గరికి రావాలన్నా, మనం వాళ్ల దగ్గరికి వెళ్లాలన్నా కాంతి వేగంతో ప్రయాణించే వ్యోమనౌక కావాలి. అది చాలా చాలా కష్టమైన పని. అయితే బహుశా వాళ్లు మనలా కాకుండా, మనకు తెలియని కొత్త మార్గాల్లో మనతో సంప్రదించే అవకాశముందని కొందరు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. మనల్ని ఇంకా జాగ్రత్తగా గమనిస్తూ ఉండవచ్చేమోననీ ఊహిస్తున్నారు.

ఆగని అన్వేషణ

మన సౌర కుటుంబం ఆవలి గ్రహాలనూ శాస్త్రవేత్తలు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇటీవల జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ 'కె2-18బి' అనే గ్రహం వాతావరణంలో డైమిథైల్ సల్ఫైడ్ వాయువును గుర్తించింది. ఇది మన భూమి మీద కూడా ఉంటుంది. ఎక్కువగా సముద్ర జీవుల (ఫైటోప్లాంక్టన్) వల్ల విడుదలవుతుంది. కాబట్టి దీన్ని జీవం ఉనికికి బలమైన సూచనగా భావిస్తున్నారు. అయితే, ఇలాంటి వాయువులు కొన్నిసార్లు జీవం లేకుండానూ తయారవ్వొచ్చు. అందుకే శాస్త్రవేత్తలు ఇప్పుడు ఆ గ్రహాల వాతావరణంలో ఆక్సిజన్, మీథేన్ వంటి ఇతర 'జీవ వాయువుల' కోసం వెతుకుతున్నారు. ఇవన్నీ జీవం ఉనికిని మరింత గట్టిగా నిర్ధారించగలవు.

మనం అంతరిక్షంలోకి వెళ్లి, ఆ గ్రహాలను చేరాలంటే మనకు రాకెట్లు, అంతరిక్ష నౌకలు కావాలి కదా? వాటిని ఎలా తయారు చేయాలి? ఎలా ముందుకు నడిపించాలి? జీవాన్ని ఎలా కనిపెట్టాలి? ఇవన్నీ భౌతికశాస్త్ర సూత్రాల ప్రకారమే జరుగుతాయి. భవిష్యత్తులో వాళ్లని నిజంగా చేరడానికి, కాంతి వేగానికి దగ్గరగా ప్రయాణించే కొత్త 'ప్రొపల్షన్ సిస్టమ్స్' మీదా చాలా పరిశోధనలు జరుగుతున్నాయి. అంటే, మనమూ చాలా వేగంగా ప్రయాణించే మార్గాలను కనిపెట్టే ప్రయత్నంలో ఉన్నామన్నమాట!

అడుగంటని ఆశలు

గ్రహాంతరవాసులు ఉన్నారని భౌతికశాస్త్రం బలంగా చెప్పలేదు. కానీ, ఈ విశ్వం ఎంత విశాలమైందో, మనకు ఎదురయ్యే సవాళ్లేంటో, తెలివైన జీవుల గురించి ఎందుకు ఆలోచించాలో, పరిశోధనలను ఎలా ముందుకు తీసుకెళ్లాలో అనే వాటిని స్పష్టంగా చూపిస్తుంది. ఇప్పుడున్న అధునాతన టెక్నాలజీ, కొత్త కొత్త ఆవిష్కరణలతో మన గ్రహాంతరవాసుల అన్వేషణ మరింత వేగం పుంజుకుంది. ఇది జ్ఞానాన్ని పెంచుతూ, మన అన్వేషణను మరింత ఉత్సాహంగా, ఆసక్తికరంగా మార్చే ఒక అద్భుతమైన ప్రయాణం. ఈ ప్రయాణం ఎప్పటికీ ఆగదు, మన ఆశ ఎప్పటికీ అడుగంటదు!

# ఏసీ దుస్తులు!

బోరాన్ నైట్రైడ్, సిలికాన్ ఆక్సైడ్ రెండూ వేడిని తట్టుకునే గుణం కలిగుంటాయి. అందుకే వీటిని కలగలిపి గణనీయంగా వేడిని తగ్గించగల పద్ధతిని రూపొందించారు. ఈ వస్త్రాలతో తయారుచేసిన దుస్తులను ధరిస్తే బయట 35 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రత ఉన్నా 15 డిగ్రీల ఉష్ణోగ్రత చల్లదనాన్ని ఇస్తున్నట్టు ప్రయోగాల్లో వెల్లడైంది. అంటే 20 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రత తగ్గిందన్నమాట. చలికాలం రాగానే స్వెటర్లు ధరిస్తాం. ఇవి చలిని అడ్డుకొని ఒళ్లను వెచ్చగా ఉంచుతాయి. మరి వేసవిలో బయటి వేడి పడనీయకుండా చల్లగా ఉంచే దుస్తులుంటే? ఎంత బాగుంటుందో కదా. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ అలబామా శాస్త్రవేత్తలు అలాంటి దుస్తులనే రూపొందిస్తున్నారు. నిజానికి వీళ్లు పూర్తిగా కొత్త వస్త్రాలనేమీ కనుగొనలేదు. ప్రస్తుతమున్న వస్త్రాలనే వేడిని నియంత్రించే విధంగా మార్చే విధానాన్ని రూపొందించారు. ఎలక్ట్రోస్పిన్నింగ్, ప్లాస్మా సర్ఫేస్ మోడిఫికేషన్ పద్ధతుల ద్వారా దీన్ని సాధించగలిగారు. ఎలక్ట్రోస్పిన్నింగ్ ద్వారా వస్త్రం అంతటా బోరాన్ నైట్రైడ్ నానో రేణువులు సమానంగా చల్లుతారు. ఇక ప్లాస్మా సర్ఫేస్ మోడిఫికేషన్ విధానంలో తక్కువ ఉష్ణోగ్రత ప్లాస్మా చికిత్స ద్వారా దుస్తులను కుట్టటానికి ఉపయోగించే దారాల్లో సిలికాన్ ఆక్సైడ్ నానో రేణువులను జొప్పిస్తారు. ఇవి వస్త్రం మీద అదనపు పొరలా పనిచేస్తాయి. ఐదు నుంచి ఎనిమిది సార్లు ఉతికినా ఈ పొర అలాగే ఉంటున్నట్టు పరీక్షల్లో తేలింది. వస్త్రం తీరుతెన్నులేవీ మారలేదు కూడా. కాకపోతే ఉతికిన ప్రతిసారీ చల్లదనాన్ని కలిగించే గుణం తగ్గుతున్నట్టు గుర్తించారు. వస్త్రం మీద రెండు పొరలు ఏర్పాటు చేస్తే ఇది మరింత బాగా పనిచేయొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ పరిజ్ఞానం ఎలాంటి రకం వస్త్రాల మీదైనా పనిచేయగలదని వివరిస్తున్నారు. 'చల్లటి' దుస్తుల కోసం వేడిని తట్టుకునే కొత్త పదార్థాలను రూపొందించటం మీదే గత అధ్యయనాలు కృషి చేశాయి. తాజా అధ్యయనంలో మాత్రం అందుబాటులో ఉన్న వస్త్రాలను మార్చటం మీద దృష్టి సారించారు. ఇప్పుడు వాడకంలో ఉన్న పరిజ్ఞానాల కన్నా ఇది మరింత సమర్థమైంది, చవకైంది కావటంతో మున్ముందు బాగా ఆదరణ పొందగలదని భావిస్తున్నారు.

# ఏ కన్నీటెనకాల ఏముందో తెలుసునా ?

'నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి, ఏ కన్నీటెనకాల ఏముందో తెలుసునా?' అని మనసు కవి ఆత్రేయ ఒక పాటలో నిగూఢంగా ప్రశ్నిస్తారు. దీనికి జవాబు ఆ మనసే చెప్పాలి. అంతా భావోద్వేగాల మహత్తు. ఇంతకీ కన్నీరెందుకొస్తుంది? దీనికి ఏమైనా ప్రయోజనం ఉందా?

దుఃఖంలో, బాధలో ఏడుస్తాం. నవ్వటం వంటి భావోద్వేగాలకు లోనైనప్పుడూ అప్రయత్నంగానే కొన్నిసార్లు కన్నీటి బొట్లు రాలుతుంటాయి. ఎందుకిలా? విచిత్రమైన ప్రశ్నలా అనిపించొచ్చు గానీ దీని వెనకాల పెద్ద తతంగమే నడుస్తుంది. కంట్లో దుమ్ము పడినప్పుడో, ఉల్లిగడ్డ కోస్తున్నప్పుడు వెలువడిన ఆవిరి తగిలినప్పుడో వాటిని బయటకు పంపటానికీ.. అలాగే కనుగుడ్డును తేమగా ఉంచటానికీ కన్నీరు ఉత్పత్తి అవుతుంటుంది. ఇదంతా సహజ ప్రక్రియ. అయితే భావోద్వేగాలతో ముడిపడిన కన్నీరు దీనికి పూర్తిగా భిన్నం.

మెదడులో భావోద్వేగాలను విడమరచుకునే భాగాలు.. ముఖ్యంగా భావాలకు అనుగుణంగా శరీరం స్పందించే తీరును నియంత్రించే హైపోథలమస్ ఇలాంటి కన్నీటిని ప్రేరేపిస్తుంది. బాధలో, దుఃఖంలో ఉన్నప్పుడు ఈ భాగాలు కన్నీటి గ్రంథులను (లాక్రిమల్ గ్లాండ్స్) ఉత్తేజితం చేసి, మరింత ఎక్కువగా కన్నీరు ఉత్పత్తయ్యేలా చేస్తాయి.

శరీరం ఒత్తిడిని తట్టుకోవటానికీ ఏడ్పు తోడ్పడుతుందని ఒక భావన. భావోద్వేగంతో ఉబికి వచ్చే కన్నీటిలో ఒత్తిడితో ముడిపడిన హార్మోన్లు పెద్దమొత్తంలో ఉంటున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. అంటే కన్నీరు ఈ హార్మోన్లను బయటకు పోగొట్టటం ద్వారా మనసు కుదురుకోవటానికి దోహదం చేస్తుందన్నమాట.

ఏడ్చినప్పుడు గుండె వేగాన్ని తగ్గించే, విశ్రాంతి కలిగించే పారాసింపథెటిక్ నాడీ వ్యవస్థ ప్రేరేపితమవుతుంది కూడా. అందుకేనేమో ఏడ్చిన తర్వాత మనం విశ్రాంతి భావన పొందుతాం.

ఏడ్వటానికి సామాజిక ప్రయోజనమూ ఉందండోయ్. బాధ, విచారంలో ఉన్నట్టు కన్నీరు ఎదుటివారికి సంకేతం ఇస్తుంది. చుట్టుపక్కల వారు తమను అర్థం చేసుకోవటానికి.. వారి నుంచి సాంత్వన, లాలన పొందటానికిది తోడ్పడుతుంది. గట్టిగా రోదించక పోయినా కూడా నిశ్శబ్దంగా ప్రవహించే కన్నీరు ఆపదలో ఉన్నారనే సూచనలు చేస్తుంది.

ఇలా కన్నీరు తమకు తాము సాంత్వన పొందటానికే కాకుండా.. చుట్టుపక్కల వారి నుంచి సానుభూతి లభించటానికీ సాయం చేస్తుంది.



# గోదావరి జిల్లాల సమాచారమ్

## సినీఫక్కీలో గంజాయి రవాణా



**గోకవరం :** ఎవరికి అనుమానం రాకుండా కారులో ప్రత్యేక అరలను ఏర్పాటు చేసి సినీఫక్కీలో గంజాయి తరలిస్తున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోరుకొండ సీఐ సత్యనారాయణ, ఎస్సై పవన్‌కుమార్‌లో బుధవారం గోకవరం పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించిన వివరాలివీ..

**పుష్ప సినిమా తరహాలో..**

రంపచోడవరం మండలం యర్లమామిడికి చెందిన కత్తుల ప్రతాప్‌రెడ్డి, గుర్తేడు మండలం దుంపవలసకు చెందిన కొండల శ్రీకృష్ణరెడ్డి ఒడిశాలోని చిత్రకొండ నుంచి వివిధ రాష్ట్రాలకు గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని తరలిస్తున్నారు. చిత్రకొండ నుంచి రాజస్థాన్‌కు గంజాయిని తరలిస్తుండగా గోకవరం శివారున గంగాలమ్మ ఆలయం వద్ద బుధవారం పోలీసులు పట్టుకున్నారు. వీరితో పాటు రాజస్థాన్‌కు చెందిన హవాసింగ్, పవన్‌కుమార్ యాదవ్‌లను అదుపులోకి తీసుకొని వారి నుంచి కారులోని 59 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కారులో ప్రత్యేక అరలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇంజిన్ పక్కన, డ్యాష్ బోర్డు, డిక్కీ వెనుక అరల్లో గంజాయిని ప్రత్యేకంగా ప్యాక్ చేసి ఉంచారు. పుష్ప సినిమా తరహాలో జరుగుతున్న ఈ గంజాయి రవాణాను చూసి పోలీసులు ఆశ్చర్యపోయారు.

**రూ.30లక్షల విలువైన సరకు స్వాధీనం**

అదుపులోకి తీసుకున్న నిందితులను విచారించగా కత్తుల ప్రతాప్‌రెడ్డి, కొండల శ్రీకృష్ణరెడ్డి చేసిన మరిన్ని నేరాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఇతర రాష్ట్రాలకు గంజాయిని రవాణా చేయడం అనుమానం వస్తే అక్కడే వాహనాన్ని వదిలేసి పరారవుతుంటారు. గతంలో వీరిపై గోకవరంలో రెండు, నాతవరంలో ఒకటి, మార్టురులో ఒక కేసు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరికి గంజాయి సరఫరా చేసే ఒడిశాలోని చిత్రకొండకు చెందిన పంగి శ్రీధర్, గణపతిలపైన కేసు నమోదు చేశామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.30 లక్షలు వరకు ఉంటుందని నలుగురు నిందితులను కోర్టుకు తరలించామన్నారు. ఈ కేసులో ప్రతిభ చూపిన ఎస్సై పవన్‌కుమార్, సిబ్బందిని అభినందించారు.

## అలంకరణ చేపలు, సముద్ర నాచు పెంపకానికి ప్రోత్సాహం



**కాకినాడ:** తీర ప్రాంత గ్రామాల్లో మత్స్యకార కుటుంబాల జీవనోపాధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. వాతావరణ మార్పులు, సముద్ర కాలుష్యం, విపత్తులతో మత్స్య సంపద తగ్గిపోతోంది. వీటిపై ఆధారపడే వారికి అండగా ఉండేలా స్వయం ఉపాధి మార్గాలు చూపిస్తున్నారు. జీసీఎఫ్–ఈసీఆర్ఐసీసీ (గ్రీన్ క్లైమేట్ ఫండ్) ప్రాజెక్టు ద్వారా నిధులను సమకూర్చుతున్నారు. అలంకరణ చేపలు, పీతలు, సముద్రనాచు పెంపకం యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. మహిళల ఉపాధికి చేయూతనిందిస్తున్నారు.

**రుణం ఎలా ఇస్తారంటే..**

అలంకరణ చేపల పెంపకం: ముగ్గురు సభ్యులు కలిపి ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. దీనికి జీసీఎఫ్–ఈక్రిక్ ద్వారా రూ.45,948 ఆర్థిక సాయం అందిస్తారు. మిగతా రూ.55 వేలు పీఎంఎస్ఎస్‌వై పథకం, డీఆర్‌డీఏ ద్వారా సమకూర్చుతారు.

**సముద్రనాచు:** ఒక్కో లబ్ధిదారునికి రూ.11,662 జీసీఎఫ్–ఈక్రిక్ ద్వారా అందిస్తారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన ద్వారా రూ.4800 సాయం అందుతుంది. రూ.1,538 లబ్ధిదారుని వాటాగా చెల్లించాలి.

**పీతల సాగు:** ఒక్కో లబ్ధిదారునికి రూ.19,404 ఆర్థిక సాయం అందుతుంది.

శిక్షణ .. మార్కెటింగ్: కాకినాడ అర్బన్, గ్రామీణ, కరప, కాజులూరు, కోటనందూరు, పెదపూడి, రౌతులపూడి, తాళ్లరేవు, తొండంగి, తుని, యు.కొత్తపల్లి, ఏలేశ్వరం, గొల్లప్రోలు మండలాల్లోని 91 గ్రామాల్లో ఈ పథకం కార్యకలాపాలు చేపట్టనున్నారు. కోనసీమ జిల్లాలో 86 గ్రామాలు ఎంపిక చేసి మత్స్యకార మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. కాకినాడ, కోనసీమ జిల్లాలోని 12 చోట్ల సముద్రనాచు పెంపకం మొదలుపెట్టారు. ఇటీవల చిత్రయానాంలో 300 కేజీల నాచు ఉత్పత్తి చేశారు. కేజీ రూ.25 వరకు పలుకుతోంది. ఏడాది పొడవునా 30–60 రోజులకు ఒక పంట తీయవచ్చని జీసీఎఫ్–ఈక్రిక్ జిల్లాల సమన్వయకర్త శ్రీహర్ష చెప్పారు.

చాలామంది ఆసక్తి చూపుతున్నారు..

**– డా.అంజలి, ప్రిన్సిపల్, రాష్ట్ర మత్స్య సాంకేతిక శిక్షణ సంస్థ**

అలంకరణ చేపలు, సముద్ర నాచు పెంపకం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చు.మత్స్యకార మహిళలతో పాటు పొదుపు సంఘాలకు శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటికే కొన్ని యూనిట్లు ఏర్పాటయ్యాయి. వారిని చూసి మరి కొంతమంది ముందుకొస్తున్నారు. మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేస్తాం.

## ఉత్సాహంగా రంగోళీ పోటీలు

-మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహణ

**ఆంధ్రవిశ్వవిద్యాలయం, (విశాఖ సమాచారం):** ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా ఏయూ ఉద్యోగులు, విద్యార్థులకు రంగోళీ పోటీలను నిర్వహించారు. ఏయూ పరిపాలనా భవనం ఎదురుగా ఏర్పాటు చేసిన ఈ పోటీలలో ఏయూ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులను తీర్చిదిద్దారు. నిత్యం పుస్తకాలు, ప్రయోగశాలల్లో గడిపే విద్యార్థులు కాస్త విరామం తీసుకుని అందమైన రంగ వల్లులను తీర్చిదిద్దారు. శతాబ్ది శోభను తీసుకువచ్చే విధంగా ఈ కార్యక్రమం సాగింది. కార్యక్రమంలో మెత్తం 50 మంది వరకు పాల్గొని ఉత్సాహంగా ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ ఈ సందర్భంగా విద్యార్థులను, ఉద్యోగులకు అభినందించారు. శతాబ్ది ఉత్సవాలు, మహిళా దినోత్సవం పురస్కరించుకుని వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మహిళా అభ్యున్నతి, వికాసాన్ని ప్రతిబింబిస్తూ రంగవల్లులు తీర్చిదిద్దడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రంగవల్లులను తిలకించి వాటిని తీర్చిదిద్దిన వారిని అభినందించారు. ఏయూ ఉపకులపతి సతీమణి శ్రీమతి జి. పావని స్వయంగా విద్యార్థులు వేసిన ముగ్గులను పరిశీలించారు. ఎంతో సృజనాత్మకంగా ఆలోచన చేస్తూ, మహిళా సాధికారతను ప్రతిబింబిస్తూ వీటిని తీర్చిదిద్దడం పట్ల విద్యార్థులను అభినందించారు. కార్యక్రమాన్ని మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఏ. పల్లవి సమన్వయం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య ఆర్. పద్మశ్రీ, ఆచార్య ఏం.శశి. డీన్లు కె.రమాసుధ, డి. లలిత భాస్కరి, ఆచార్య వి.వల్లీకుమారి, మేరీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుల అరెస్టు

**సీతానగరం**: బొబ్బిల్లంక గ్రామంలోని సుబ్బారావు పేటలో సోమవారం అర్ధరాత్రి జరిగిన మాజీ భార్య, అత్త హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పర్చుతున్నట్లు కోరుకొండ సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి తెలిపారు. ఆయన బుధవారం సీతానగరం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. హత్యకు పాల్పడిన చోడదాసి సీతారామరాజు (పండు), అతడికి సహకరించిన స్నేహితులు, అదే గ్రామానికి చెందిన చోడదాసి రమేష్ (చిన్న), చిత్రపు అజయ్ కుమార్, కన్నెం సురేష్ (పెద్ద)లను అరెస్ట్ చేశామన్నారు. ఎస్సై డి.రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గిట్టుబాటు కాని సర్వే రాళ్ల తయారీ



**దేవరపల్లి:** ప్రస్తుతం సర్వే రాళ్లకు డిమాండ్ బాగా తగ్గిపోయింది. రెండేళ్లుగా మాకు వ్యాపారం సాగడం లేదు. కూలి డబ్బులు కూడా రావడం లేదు. 1.5 అడుగుల రాయి తయారు చేసినందుకు కార్మికుడికి రూ.25 ఇవ్వాలి. మరో వైపు క్వారీలో బండల ఖరీదు పెరిగింది. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి. అమ్మకాలు లేక ఎక్కడ రాళ్లు అక్కడే ఉండిపోయాయి. దుద్దుకూరు సర్వే రాళ్లు నాణ్యతగా ఉండడం వల్ల ఎక్కువగా కొనుగోలు చేస్తారు. గత ప్రభుత్వంలో వ్యాపారం లాభసాటిగా ఉండేది. తయారైన రాళ్లు ఎప్పటికప్పుడు అమ్ముడుపోయేవి. పొలాలు, ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసినప్పుడు అందరికీ టక్కున గుర్తుకు వచ్చేవి సర్వే రాళ్లు. భూమిని కొలతలు కొలిచి, సరిహద్దులను గుర్తించి, అక్కడ ఈ రాళ్లను పాతిపెడతారు. ఇక భూముల అమ్మకాలు, కొనుగోళ్లు జరిగినప్పుడు హద్దులను నిర్ధారించడానికి ఇవి ఎంతో కీలకంగా ఉంటాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రాళ్లను తయారు చేసే కార్మికుల జీవితాలు అధ్వానంగా ఉన్నాయి. చంద్రబాబు పాలనలో రియల్ ఎస్టేట్ పడిపోవడంతో రాళ్లకు డిమాండ్ తగ్గిపోయింది. దీంతో అవి కార్మికులకు గుదిబండలుగా మారాయి.

**కష్టం ఎక్కువే**

కష్టం ఎక్కువ, ఫలితం తక్కువ అన్నట్టుగా ఉంది సర్వే రాళ్ల తయారీ కార్మికుల పరిస్థితి. రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుని నల్లరాతి బండలను చెక్కి సర్వే రాళ్లను తయారు చేస్తారు. పొలాలు, ఇళ్ల స్థలాల సరిహద్దుల్లో పాతడానికి నల్లరాతి సర్వే రాళ్లను ఎక్కువగా వినియోగిస్తారు. 1.5 అడుగులు, 2 అడుగులు, 2.5 అడుగులు, 3 అడుగల పొడవైన రాళ్లను సరిహద్దు రాళ్లుగా వినియోగిస్తారు. పొడవును బట్టి రాయి ధర ఉంటుంది. ఒక్కొక్క రాయి రూ. 40 నుంచి 100 పలుకుతుంది. కానీ దాదాపు రెండేళ్లుగా గిరాకీ లేకపోవడంతో ఎక్కడ రాళ్లు అక్కడే పడి ఉన్నాయి.

**దుద్దుకూరులో తయారీ**

దేవరపల్లి మండలం దుద్దుకూరులో సర్వే రాళ్లు తయారు చేస్తున్నారు. దాదాపు 50 సంవత్సరాలుగా ఈ పనిపై ఆధారపడి ఎన్నో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. బందపురం శివారు రంగరాయ కాలనీ వద్ద సర్వే రాళ్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. కొవ్వూరు మండలం దేచర్ల రెవెన్యూ పరిధిలోని ఆర్లమ్మ క్వారీ, లక్ష్మీపురం క్వారీల నుంచి పెద్ద నల్లరాతి బండలను తీసుకు వచ్చి, వాటిని కార్మికులు సర్వే రాళ్లు తయారు చేస్తారు. ఒక లారీ బండలు సుమారు రూ.పది వేలు ఉండగా, వాటితో దాదాపు 500 రాళ్లు తయారు చేస్తారు. రాళ్ల తయారీకి సుమారు రూ.12,500 ఖర్చు అవుతుంది. ప్రస్తుతం రాళ్ల తయారీ గిట్టుబాటు కాకపోయినా, తాతల నాటి నుంచి వృత్తిగా వస్తున్నందున దీన్నే నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని కార్మికులు చెబుతున్నారు. ఒకప్పుడు సుమారు 100 కుటుంబాలు రాళ్లు తయారు చేస్తూ జీవనం సాగించేవి. వ్యాపారం గిట్టుబాటు కాకపోవడంతో చాలామంది వేరే పనులకు మారిపోయారు. ప్రస్తుతం 20 కుటుంబాలు రాళ్లు తయారు చేసి విక్రయాలు చేస్తున్నాయి.

**ఉత్తరాంధ్ర జిల్లాలకు సరఫరా**

ఇక్కడ తయారు చేసిన సర్వే రాళ్లను ఉత్తరాంధ్ర జిల్లాలైన విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, నర్సీపట్నం, తుని, విజయవాడ, ఖమ్మం ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగుంటే సర్వే రాళ్లుకూ గిరాకీ ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లోని బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు సర్వే రాళ్లను కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం లేకపోవడంతో రాళ్లకు డిమాండ్ తగ్గిందని తయారీదారులు చెబుతున్నారు. అనంతరం రెండేళ్లుగా కొనుగోళ్లు లేక ఎక్కడ రాళ్లు అక్కడే ఉండిపోయాయి. అక్కడక్కడ భూముల రీసర్వే జరగడం, స్థానికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం జరుగుతున్నందున రాళ్లు కొనుగోలు చాలా తక్కువగా ఉంటోంది.

## 'స్వచ్ఛ సర్వేక్షణ్'కు సన్నద్ధత అంతంతే



నగరాలు, పట్టణాలల్లో పారిశుద్ధ్య, పచ్చదనం, పరిశుభ్రత లక్ష్యంగా ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛ సర్వేక్షణ్' పోటీలను నిర్వహిస్తోంది. ఈ ఏడాది కూడా జనవరి నుంచి ఏప్రిల్ వరకు దీనిపై సర్వే జరుగుతుంది. ఘన వ్యర్థాల నిర్వహణ నుంచి పరిశుభ్రత వరకు వివిధ అంశాల్లో వెయ్యి మార్కులకు ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. కాకినాడ నగరంలో మాత్రం దీనికి సన్నద్ధత అంతంతమాత్రంగా ఉంది. వీటిని సరిదిద్దకుండా అధికారులు వార్డుల్లో పర్యటిస్తూ మెరుగైన ర్యాంకు సాధిస్తామంటూ ప్రకటనలు చేస్తున్నారు.

**ఇలా ఉంటే..సాధన ఎలా?**

గత ఏడాది జులైలో ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో కాకినాడకు 38వ స్థానం దక్కింది. పక్కనే ఉన్న రాజమహేంద్రవరానికి 19వ ర్యాంకు వచ్చింది. ఈ సారి మొదటి పది ర్యాంకుల్లో నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆచరణలో మాత్రం అది అమలు కావటం లేదు. పరిశుభ్రతతో పాటు ఇంటింటా చెత్త సేకరణ, ఘన వ్యర్థాలు, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాల్లో ఒక్కటీ పరిపూర్ణంగా అమలు కావడం లేదు.

**ఇవీ సమస్యలు..**

నగరంలో ప్రధాన కూడళ్లలో 14 వరకు సామాజిక మరుగుదొడ్లున్నాయి. ఇవి దాదాపుగా మూతపడ్డాయి.

ప్రధాన వీధుల్లో డివైడర్లపై సరైన పచ్చదనం లేదు. గోడలు రంగులు వెలసిపోయి కళావిహీనంగా కనిపిస్తున్నాయి.

ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా చేయడం లేదు. చెత్తను తరలించేందుకు తోపుడు బండ్లు, ఇతర వాహనాల కొరత తీవ్రంగా ఉంది. కంపాక్టర్ వాహనాలు సరిపడా లేవు. ప్రజలు కార్యాలయానికి రాకుండానే అన్ని రకాల సేవలు అందేలా పుర యాప్ తీసుకొచ్చారు. దీనిపై అవగాహన కల్పించి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించడంలోనూ శ్రద్ధ లేదు. నగరంలో ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం కూడా తూతూ మంత్రంగానే అమలవుతోంది. కూడళ్ల వద్ద చిల్లులు పడిన బిన్నులు ఉంచుతున్నారు. వాటిలో వేసిన చెత్తను పశువులు, కుక్కలు, పందులు బయటకు లాగి మరింత అధ్వానం చేస్తున్నాయి. నగరంలో రోజుకు 30 ఎంఎల్‌డీల మురుగు నీరు సముద్రంలో కలుస్తుంది. దీనిని శుద్ధిచేయడానికి ప్లాంట్లు లేవు. ఏటిమొగలో నిర్మిస్తున్న ఎస్టీపీ ఇంకా వినియోగంలోకి రాలేదు.

**చర్యలు తీసుకుంటాం**

– ఎన్‌వీవీ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి కమిషనర్, కాకినాడ

నగరంలో రోజూ క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నాం. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన స్థానం కోసం ప్రయత్నిస్తున్నాం. ప్రధానంగా మరుగుదొడ్లను వినియోగంలోకి తెస్తాం. డివైడర్లు, పార్కుల్లో పచ్చదనాన్ని మెరుగుపరుస్తాం.

## ద్విచక్ర వాహన ప్రమాదాలే అత్యధికం



**తాళ్లరేవు :** గతేడాది డిసెంబరు 19న తాళ్లరేవు మండలం కోరింగ పరిధిలో జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. రెండు బైక్‌లు ఢీకొట్టే సమయంలో బ్రేక్‌లు ఉపయోగించకపోవడం, నిర్లక్ష్యపు చోదకం వల్ల ప్రాణ నష్టం జరిగిందని అధికారులు పరిశీలనలో తేలింది.

రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన ఇద్దరు ఇంటర్ విద్యార్థులు గత నెల 26న పరీక్షలు రాయడానికి సమీప కళాశాలకు రాయల్ ఇన్‌ఫీల్డ్ బైక్‌పై వెళ్లారు. మార్గమధ్యంలో ప్రమాదానికి గురై ఇద్దరూ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది.

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. రోజుకు సగటున రెండు నుంచి మూడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రయ్‌మంటూ మోటార్ సైకిళ్లపై దూసుకుపోతున్నవారే ప్రమాదాలకు ఎక్కువ గురవుతున్నారు. తర్వాత స్థానంలో కార్లు, లారీతో జరిగిన ప్రమాదాలు ఉంటున్నాయి. గతేడాది జిల్లాలో 804 రోడ్డు ప్రమాదాలు జరిగితే వీటిలో అత్యధికంగా 272 ద్విచక్రవాహనాలే ఉన్నాయి. 106 మంది ప్రాణాలు కోల్పోగా మరో 257 మంది క్షతగాత్రులయ్యారు.

**నియంత్రణకు ఏం చేయాలంటే..**

రహదారి నిబంధనలు కచ్చితంగా అమలు జరిగేలా పర్యవేక్షణ పెంచాలి. హెల్మెట్, సీటు బెల్ట్ ధరించడం తప్పనిసరి చేయాలి. ఉల్లంఘించినవారిపై జరిమానాలు విధించాలి.

వేగ నియంత్రణ పాటించేలా ఎక్కడికక్కడ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలి..

కోరింగ పరిధిలో రోడ్డు నిర్మాణంలో లోపం ప్రమాదాలకు కారణమవుతుంది. ఇక్కడ ఓ చోట రోడ్డు 1.5 మీటర్ల వెడల్పు చేయాల్సి ఉంది. కళాశాలలకు మోటార్ సైకిళ్లపై వచ్చే విద్యార్థులపై నిఘా పెట్టాలి. ఇటు కళాశాలల యాజమాన్యం, అటు పోలీసులు విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తుండాలి.

**కారణాలివే..**

కొంత మంది విద్యార్థులు పాఠశాల చదువు పూర్తయిందో లేదో ఇంటర్‌లోనే బైక్‌లపై విన్యాసాలు చేయడం మొదలుపెడుతున్నారు. నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడం. ముందు వాహనాలను అధిగమించడంలో అంచనా తప్పడం. అతి వేగం, స్పోర్ట్స్ బైక్‌ల అతి వినియోగం,శిరస్త్రాణం ధరించకపోవడం మద్యం మత్తులో వాహనాలు నడపడం

**జాతీయ రహదారులు రక్తసిక్తం..**

జిల్లాలో గతేడాది 804 ప్రమాదాలు జరిగితే 343 జాతీయ రహదారులపైనే చోటు చేసుకున్నాయి. తుని నుంచి రాజానగరం వరకు ఎన్‌హెచ్–16 పరిధిలో 240, తుని రూరల్, అన్నవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో 93 చొప్పున ప్రమాదాలు జరిగాయి. 44 మంది ప్రాణాలు కోల్పోయారు. ఎన్‌హెచ్–216లో కోరింగ పోలీస్ స్టేషన్ పరిధిలో 60 ప్రమాదాలు జరిగాయి. జిల్లాలోని రాష్ట్ర హైవేలపై 203, ఇతర రోడ్లపై 258 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

## 2026 అనకాపల్లి బాలోత్సవ్ జిల్లా ప్రధమ పిల్లల పండుగ వేడుకలకు ఆహ్వానం..




**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** మార్చి 6 , 7 వ తేదీలలో పట్టణంలో గల న్యూ కోలనీ రోటరీ హాలులో అనకాపల్లి బాలోత్సవ్ 2026 వేడుకలకు జిల్లాలో గల సుమారు 1800 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో జరిగే 32 రకాల పోటీలలో పాల్గొ0టున్నారనిపోటీలలో పాల్గొనే విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయము తో బాటు మంచినీరు వంటి సౌకర్యములు ఏర్పాటు చేస్తున్నామని గావున జిల్లా ప్రజలు, విద్యార్థులు, ఈ కార్యక్రమములో పాల్గొని విజయవంతం జేయాలని అలాగే ఈ కార్యక్రమాలకు జిల్లా గౌరవ ముఖ్య అధికారులు అతిథులుగా పాల్గొంటారనిగావున ఈ కార్యక్రమాలకు సహకరించి విజయవంతం చేయాలని అలాగే అనకాపల్లి పాత్రికేయ మిత్రులు, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు కూడా పాల్గొని మీ వంతు ప్రసార సహకారం అందించాలని బాలోత్సవ్ కమిటీ కన్వీనర్ కడిమిశెట్టి త్రిమూర్తులు రెడ్డి, కార్యదర్శి బొప్పే ఉమామహేశ్వరరావు, ప్రోగ్రామ్ కమిటీ సభ్యులు బల్లానాగభూషణ ము తెలియ జేశారు.

## 'జీఎంఆర్' పన్ను బకాయి రూ.1.47 కోట్లు

**కడియం:** వేమగిరిలోని జీఎంఆర్ సంస్థ ఆ గ్రామ పంచాయతీకి రూ.1,47,72,147 పన్ను బకాయి పడింది. పన్ను వసూలుపై ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో ఎంపీడీవో కె.రమేష్, డిప్యూటీ ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్, కార్యదర్శులు రూప్‌చంద్, ఎ.శ్రీనివాసరావు బుధవారం జీఎంఆర్ సంస్థ ప్రతినిధులను కలిశారు. తక్షణమే పన్ను బకాయిలు చెల్లించాలని కోరారు.

## లభ్యం కాని రాహుల్ ఆచూకీ

**అనపర్తి:** హోలీ సందర్భంగా అనపర్తిలో కాలువలో స్నానానికి వెళ్లి గల్లంతైన తొమ్మిదేళ్ల కొమరపు రాహుల్ ఆచూకీ లభ్యం కాలేదు. మంగళవారం ఉదయం 10 గంటలకు కాలువలో పడిపోయిన రాహుల్ కోసం పోలీస్, అగ్నిమాపక సిబ్బంది రాత్రి వరకూ గాలించారు. చీకటి పడడంతో గాలింపును నిలిపివేసి, బుధవారం తెల్లవారు జాము నుంచి ప్రారంభించారు. అనపర్తి ఎస్సై ఎల్.శ్రీను నాయక్, ఫైర్ ఆఫీసర్ జీరి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ధవళేశ్వరం నుంచి వచ్చిన గజ ఈతగాళ్లు కాలువలోని చెత్తను తొలగించి అణువణువూ జల్లెడపడుతున్నారు. అలాగే అనపర్తి పోలీసులు డ్రోన్‌తో కాలువ పరిసర ప్రాంతాల్లో గాలిస్తున్నారు. అయినా బుధవారం సాయంత్రం వరకు బాలుడి ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం నీటి లెవెల్ తగ్గించి మళ్లీ వెతుకుతామని ఎస్సై శ్రీను నాయక్ తెలిపారు.

## దివ్యాంగ క్రీడాకారులకు అభినందనలు

**సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం):** దివ్యాంగ క్రికెట్ కంట్రోల్ బోర్డు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సమీర్ దివ్య సాహిత్య ట్రస్ట్ నిర్వహణలో ఒడిశాలో ఫిబ్రవరి 21 నుంచి 23 వరకు జరిగిన వీల్‌చైర్ క్రికెట్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ జట్టులో ఎనిమిది మంది క్రీడాకారులు తూర్పుగోదావరి జిల్లాకు చెందినవారు కావడం విశేషం. ఈ సందర్భంగా కలెక్టర్ కలెక్టర్ కీర్తి ఆ క్రీడాకారులను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ పోటీల్లో పాల్గొని ఉత్తమ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) శేషగిరి, యోగా కోచ్ నాగేంద్ర, ఫుట్‌బాల్ కోచ్ నాగరాజు, చెస్ కోచ్ జగన్నాథరావు పాల్గొన్నారు. సహజ వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఆహార ధాన్యాలను వినియోగించడం వల్ల కుటుంబ ఆరోగ్యం కాపాడుకోవచ్చని కలెక్టర్ కీర్తి అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో అవగాహన ఉ శిక్షణ నిర్వహించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు అనుబంధంగా పనిచేస్తున్న రైతు సాధికార సంస్థ సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఆ ఉత్పత్తులను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, పాఠశాల విద్యార్థులకు, గర్భిణులకు, బాలింతలకు అందిస్తే ఆరోగ్య స్థితి మెరుగుపడుతుందన్నారు.

## పాపాల గుట్టు వీడేనా..?



**రాజమహేంద్రవరం**: పాల కల్తీ ఘటనకు సంబంధించి కీలక ఫోరెన్సిక్ నివేదికలు వచ్చే అవకాశం ఉందని జిల్లా అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఆ పాలల్లో ఇథలిన్ గ్లైకాల్ కలవడంతో సమస్య తీవ్రత పెరిగిందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. మరో ల్యాబ్‌కు పంపిన నమూనాలను విశ్లేషించగా పాలల్లో డిటర్జెంట్ కలిసినట్లు నిర్ధారిస్తూ ఓ నివేదిక వచ్చినట్లు తెలిసింది. దాంతో ఇంతస్థాయిలో ఆరోగ్యంపై ప్రభావం ఉండదని చెబుతున్నారు. పాల కొలత పెంచేందుకు యూరియా, డిటర్జెంట్ కొందరు వినియోగిస్తారని, వాటి ప్రభావం ఆరోగ్యంపై దీర్ఘకాలంలో చూపుతుందని, ఇంతస్థాయిలో ఉండదని నిపుణులు చెబుతున్నారు. పాల కూలింగ్‌కు ఉపయోగించే ఫ్రీజర్‌లో ఇథనాల్ గ్లైకాల్ (కూలెంట్) లీకేజీ అవ్వడం, వాటిని వినియోగించడంతోనే ఇంతమంది తీవ్ర అనారోగ్యంతో ప్రాణాలతో పోరాడుతున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది.

తొమ్మిదికి చేరిన మృతులు

మహాశివరాత్రి తర్వాత రోజు నుంచే ఒక్కొక్కరుగా ఆసుపత్రిపాలై ఇప్పుడు ప్రాణాలతో పోరాడుతున్నారు. 20 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా బుధవారానికి 9మంది మృతిచెందినా ఓ వృద్ధురాలి పేరు ఈ జాబితాలో చేర్చట్లేదు.

ప్రస్తుతం నాలుగు ప్రైవేటు ఆసుపత్రుల్లో 12 మంది చికిత్స పొందుతుండగా 8 మందికి వెంటిలేటర్‌పై డయాలసిస్ చేస్తున్నారు. మరో ముగ్గురికీ డయాలసిస్ చేస్తున్నారు. బాధితుల కుటుంబ సభ్యులు దాదాపు 15 రోజులుగా ఆసుపత్రుల వద్దే పడిగాపులు కాస్తున్నారు.

## ఆనందంగా ఉందని సహించలేకే చంపేశాడు..



**సీతానగరం(కోరుకొండ) :** సీతానగరం మండలం బొబ్బిల్లంక గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన తల్లీ, కూతుళ్ల హత్య కేసులో బుధవారం నలుగురి వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. సీతానగరం పోలీసుస్టేషనులో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోరుకొండ సీఐ ఎస్వీవీఎస్ మూర్తి, సీతానగరం ఎస్సై రాంకుమార్ వివరాలను వెల్లడించారు. ఈ నెల 2వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో బొబ్బిల్లంకకు చెందిన సోదదాసి సీతారామరాజు తనతో విడిపోయినా ఆనందంగా జీవిస్తుందని సహించలేక భార్యను పథకం ప్రకారం హత్య చేశాడు. అడ్డు వచ్చిన అత్తనూ నరికి చంపాడు. సహచరులు సోదదాసి రమేష్, చిత్రపు అజయ్‌కుమార్, కన్నెం సురేష్‌లతో కలిసి విచక్షణారహితంగా ఈ దారుణానికి ఒడిగట్టారు. ఈ ఘటపై మూడు బృందాలు ఏర్పాటు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేశామని సీఐ వివరించారు. దాడికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని, నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా రిమాండు విధించారని తెలిపారు. ఈ నలుగురిపైనా పాత నేర చరిత్ర ఉందని, వీరిపై రౌడీషీట్లు తెరుస్తామన్నారు. అన్ని రకాల సాక్ష్యాలను ప్రవేశపెట్టి చార్జిషీట్ వేస్తామన్నారు.

# నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం

**మహారాణిపేట:** జిల్లాలో విద్యుత్ రంగ అభివృద్ధి పనులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా తదితర అంశాలపై ఎంపీ ఎం.శ్రీభరత్ బుధవారం సమీక్షించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో జరిగిన జిల్లా విద్యుత్ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ముందుగా జిల్లాలో అమలు చేస్తున్న పథకాలు, కొనసాగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ వివరించి, 11 మండలాల ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని తెలిపారు. వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరించేలా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అలాగే పీఎం కుసుమ్ పథకం ఉద్దేశాలను ప్రచారం చేస్తూ, వ్యవసాయ రంగంలో సోలార్ విద్యుత్ వ్యవస్థలను ప్రోత్సహించాలని సూచించారు. భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు, ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్లు, 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పనుల పురోగతిని సమీక్షించిన ఎంపీ.. పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్‌డీఎస్‌ఎస్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ, విద్యుత్ నష్టాల తగ్గింపు, స్మార్ట్ మీటరింగ్, మౌలిక సదుపాయాల బలోపేతంపై దృష్టి సారించాలని సూచించారు. డిస్కం ఎస్ఈ శ్యాంబాబు, ట్రాన్స్‌కో ఎస్ఈ శివరామ కృష్ణ, ఈఈలు ధర్మరాజు, శ్రీనివాసరావు, వీకే నాయుడు, సింహాచలం నాయుడు, డీఈఈ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# 12వ పీఆర్సీ కమిషన్ తక్షణం వేయాలి

మహారాణిపేట: రాష్ట్రంలో 12వ పీఆర్సీ కమిషన్ నియామకంతో పాటు, మధ్యంతర భృతిని తక్షణమే ప్రకటించాలని జిల్లా జేఏసీ నూతన చైర్మన్, ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన జేఏసీ నూతన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బకాయిల విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల డీఏలను మంజూరు చేయాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల హక్కుల సాధన కోసం భవిష్యత్తులో సంఘటితంగా పోరాడాలని జేఏసీ కోఉ చైర్మన్ ఎం.రవికుమార్ పిలుపునిచ్చారు.

జిల్లా జేఏసీ నూతన కార్యవర్గం ఎన్నిక

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్ల సంఘాలతో కూడిన జిల్లా జేఏసీ కార్యవర్గాన్ని ఈ సందర్భంగా పునర్ వ్యవస్థీకరించారు. నూతన చైర్మన్‌గా కె.ఈశ్వరరావును ఎన్నుకున్నారు. కోఉచైర్మన్లుగా ఎ.కె.శివాజీ, ఈ.పైడిరాజు, ఎం.రవికుమార్, వైస్ చైర్మన్లుగా కరుణకుమార్, జి.శ్రీను, టి.భవాని, డి.డి.ప్రసాదరావు, బి.హరినాధరావు, కార్యదర్శిగా ఎం.శ్రీను (పీఆర్‌టీయూ), కోశాధికారిగా పి.అప్పలరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏవీఎస్ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, జాయింట్ కార్యదర్శులుగా పి.వి.కిరణ్, కె.ఆనందకుమార్, బి.వెంకటరావు, కె.జగదీష్‌కుమార్, జి.రవికుమార్, పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

# పరీక్షల నిర్వహణ తీరుపై అయోమయం

**ఆరిలోవ:** పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ తీరు ఉపాధ్యాయుల్లో అలజడి రేపుతోంది. 2025ఉ26 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పరీక్షలు ఈ నెల 16న ప్రారంభం కానున్నాయి. పరీక్ష కేంద్రాల్లో ఇన్విజిలేషన్, నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ పర్యవేక్షిస్తుంది. అయితే, ఈసారి ఇన్విజిలేటర్ల నియామక ప్రక్రియ అస్తవ్యస్తంగా ఉందంటూ ఉపాధ్యాయ వర్గాల్లో నిరసన వ్యక్తమవుతోంది.

గత విద్యా సంవత్సరం వరకు జిల్లా విద్యాశాఖ అధికారులే పరీక్షల నిర్వహణ బాధ్యతలను చూసేవారు. కానీ, ఈ ఏడాది రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ నేరుగా ఈ ప్రక్రియను చేపట్టింది. ఈ మార్పు ఉపాధ్యాయులకు కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించిన ఉపాధ్యాయులకు వరస నిర్ణయాలు నిరాశ కలిగిస్తున్నాయి. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఇతర సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వం, ఇప్పుడు పరీక్షల నిర్వహణలోనూ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని వారు మండిపడుతున్నారు.

**నేరుగా ఉత్తర్వులు**

కమిషనర్ ఆఫ్ ఎడ్యుకేషన్ కార్యాలయం నుంచే ఇన్విజిలేటర్లతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ల ఎంపిక జరిగింది. వారికి నేరుగా ఆర్డర్ కాపీలు పంపడంతో జిల్లా అధికారులకు సైతం ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. గతంలో ప్రతి హైస్కూల్, యూపీ స్కూల్ నుంచి ఒకరు లేదా ఇద్దరిని ఎంపిక చేసేవారు. అవసరమైతే ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను కూడా తీసుకునేవారు. దీని వల్ల పాఠశాలల్లో మిగిలిన ఉపాధ్యాయులతో తరగతులు సజావుగా సాగేవి. కానీ, ప్రస్తుతం ఒకే పాఠశాల నుంచి ఐదారుగురు ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. కొన్ని పాఠశాలల నుంచి అసలు ఎవరినీ తీసుకోలేదు. దీని వల్ల ఐదారుగురు ఉపాధ్యాయులు పరీక్ష విధులకు వెళ్లే పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు బోధన పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని ప్రధానోపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

**జిల్లాలో 133 కేంద్రాలు**

ఈ ఏడాది జిల్లాలో 30,633 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరి కోసం 133 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రానికి ఒక సీఎస్, ఒక డీవోతో పాటు సుమారు 1,850 మంది సిబ్బందిని కేటాయించారు. నిబంధనల ప్రకారం 60 ఏళ్ల లోపు వారిని నియమించాల్సి ఉండగా, 58 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న వారినే ఎక్కువగా ఎంపిక చేయడం గమనార్హం. పాత పద్ధతిలోనే నియామకాలు జరిపి ఉంటే పాఠశాలల నిర్వహణకు ఇబ్బంది ఉండేది కాదని ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

# బెస్ట్ ఫిజిక్ చాంపియన్ మను కృష్ణ

**మద్దిలపాలెం:** ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో కన్నూరు యూనివర్సిటీకి చెందిన ఎన్.మను కృష్ణ చాంపియన్ ఆఫ్ ది చాంపియన్‌గా నిలిచారు. ఏయూ మాజీ ఉపకులపతి, సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ఆచార్య జి.ఎస్.ఎన్. రాజు, ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్ సంయుక్తంగా మను కృష్ణకు ట్రోఫీని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య జి.ఎస్.ఎన్. రాజు మాట్లాడుతూ.. క్రీడల్లో పాల్గొనడం, సానుకూల దృక్పథం కలిగి ఉండటం ఎంతో ప్రధానమని పేర్కొన్నారు. ఏయూ వీసీ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ క్రీడా వేడుకను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. ఏయూ క్రీడా సంచాలకుడు ఆచార్య ఎన్. విజయ్ మోహన్ మాట్లాడుతూ.. శతాబ్ది ఉత్సవాల వేళ ఈ పోటీల నిర్వహణకు సహకరించిన ఏఐయూకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా.. విశ్వవిద్యాలయాలకు అందించే ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్ విభాగం ప్రథమ స్థానంలో సంయుక్తంగా మంగళూరు విశ్వవిద్యాలయం, కన్నూరు యూనివర్సిటీలు నిలిచాయి. తేజ్ బహదూర్ సింగ్ యూనివర్సిటీ ద్వితీయ స్థానం, సావిత్రీబాయి పూలే విశ్వవిద్యాలయం తృతీయ స్థానం సాధించాయి. విజేతలకు అతిథులు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో ఏఐయూ అబ్జర్వర్ డాక్టర్ కౌకబ్ అజీమ్, ఏయూ క్రీడా విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, విశ్రాంత బాడీబిల్డింగ్ కోచ్ డాక్టర్ ఆర్.వి.ఎన్. రత్నాకర్, బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కె.గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.

# మాతాశిశు మరణాలను అరికట్టేందుకు చర్యలు

**పాడేరు:** జిల్లాలో మాతాశిశు మరణాలను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. జిల్లా అభివృద్ధికి బుధవారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో సఫలీకృతం కావాలని, వాటిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రధానంగా హైరిస్క్ గర్భిణులను ముందుగా గుర్తించి వారికి అవసరమైన సేవలు అందించాలని, బాల్య వివాహాలు, మధ్యలో చదువు మానేయడం వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. హెల్త్ సబ్ సెంటర్ల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, బర్త్ వెయిటింగ్ హాళ్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ పక్కాగా అందించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, వాళ్లు ముందు గ్రేడుల్లోకి వచ్చేలా తయారు చేయాలన్నారు. పదో తరగతి వంద రోజుల ప్రత్యేక ప్రణాళికను పక్కాగా అమలు చేసి టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లోని పరిస్థితులను మెరుగుపరచాలని, నాణ్యమైన విద్య, ఆహారం అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, అధిక సంఖ్యలో ఇళ్లు ఉగాది నాటికి గృహ ప్రవేశం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పీ4లో బంగారు కుటుంబాలు, మార్గదర్శులను అనుసంధానించాలని, పీ4లో విజయగాథలపై ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతూరు ఐటీడీఏ పీవో శుభంనొక్వాల్, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ డి.కృష్ణమూర్తినాయక్, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ కె.రామకృష్ణారావు, ఐసీడీఎస్ పీడీ సీహెచ్. ఝాన్సీబాయి, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, హౌసింగ్ పీడీ బి.బాబునాయక్, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ పీబీకే.పరిమిళ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నందు, డ్వామా పీడీ విద్యాసాగరరావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, మండల ప్రత్యేకాధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# వినూత్న రీతి లో నిరసన కొనసాగింపు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** ఆంధ్ర యూనివర్సిటీ అధ్యాపకులు రిజిస్టర్ ఆఫీస్ ఎదుట చూస్తున్న నిరసన దీక్షలు 19వ రోజుకు చేరినవి. ముఖ్యంగా మొన్న జరిగినటువంటి అతిథిదేపకుల ఇంటర్వ్యూలో వెబ్ కాస్టింగ్ తో ఇంటర్నల్ నిర్వహించి విసి ప్రొసీడింగ్స్ కూడా ఇవ్వకుండా అతిథి అధ్యాపకులను అన్యాయానికి గురిచేసింది. యూనివర్సిటీ అధికారులు పేపర్ కి 45,000 నుంచి 54000 వేలకు పెంచినట్టుగా సమాచారం తెలుస్తుంది. ఆంధ్ర యూనివర్సిటీ అతిథి అద్దెపకులు నెలవారి జీతల కోసం పోరాడుతున్నారు కానీ పేపర్ వేతనం కోసం కాదు అని తెలియజేస్తున్నాం. అదే రకంగా వినూత్న నిరసనలో భాగంగా రేపు వన్ టవర్కు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఎం సురేష్ మీనన్,శేషు,ముసుగు ప్రసాద్,దాస్ , ప్రతాప్ , లక్ష్మి, ద్రాక్షయని, కళ్యాణి, దివ్య,ఫణి,గిరీష్, దేవదానం , తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అన్యాక్రాంతం అవుతున్న పట్టించుకోని రెవెన్యూ అధికారులు





**అనంతగిరి విశాఖ సమాచారం న్యూస్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం. భీంపోలు పంచాయితీ. నందకోట రెవెన్యూ గ్రామమునకు సంబంధించిన నేరేడువలస గ్రామం లో ఆదివాసి గిరిజనుల భూములు సర్వే నెంబరు 102లో సుమారు 36 ఎకరాములు జురాయితి భూములు పై నెల్లూరు జిల్లా వాసైన చౌదరి కన్నులు పడ్డాయి ఆ గిరిజన రైతుల భూములు ఎలాగైనా సుధీనపర్చుకోవాలని పోయం పని నిరక్షరాసులైన గిరిజనులు వారి అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని ఆ భూములో సొర బడి ఆదివాసీ అమాయక గిరిజను మాయ మాటలు చెప్పి వారిని బెదిరించి ఆ భూములు చౌదరి అధైనంలో ఉంచుకున్నాడు నిరక్షరసులైన గిరిజనులకు అడవి తల్లి పై ఆధారపడి జీవనం సాగిస్తున్న అమాయక ఆదివాసి గిరిజనులు అటవీ పోడు భూములపై జీవిస్తున్న వారిని గుర్తించి అనంతగిరి మండల సర్వేయర్లు వచ్చి తులసి సర్వే చేసి ఆ భూములు అమాయక ఆదివాసి గిరిజనులకు అప్పచెప్పినారు అప్పటినుంచి ఆ పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనుల జురాయితి భూములు లాక్కోవడం కాకుండా అది చాలక గిరిజన సాగు చేస్తున్న డి పట్టా ప్రభుత్వ భూములు 11 ఎకరాములు కూడా సాగులో ఉన్న గిరిజనులపై దౌర్జన్యం చేసి భయభ్రాంతులను కలిగించి ఆ ప్రభుత్వ డి పట్టా ప్రభుత్వ భూములు కూడా సుధీనం చేసుకొని నేరేడు వలస గిరిజనులకు పాలేరుగా చౌదరి పని వారిగా తన చెప్పు చేతల్లో పెట్టుకొని ఆ 11 ఎకనములు కూడా చుట్టూ కంచి వేసి మిషన్లు పెట్టి చదును చేయించుకుంటున్నాడు చౌదరికి అడిగే వారు లేరని మనకు ఇష్టం వచ్చినట్టుగా పనులు చేసుకున్నాడు ఎక్కడో దూరప్రాంతమైన నెల్లూరు జిల్లా నుండి వచ్చి మారుమూల అమాయక ఆదివాసి అమాయక గిరిజనులపై ప్రతాపం చూపిస్తున్నాడు ఇంకా జరుగుతున్నప్పటికీ అనంతగిరి మండల రెవెన్యూ అధికారి మండల్ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ గారు స్పందించి గిరిజన ప్రాంతంలో ప్రవేశించి అమాయక ఆదివాసి గిరిజనులకు భయభ్రాంతులను కలిగిస్తున్న చౌదరిపై చట్టపరమైన చర్యలు తీసుకొని గిరిజనలు సాగు చేస్తున్న డి పట్టా ప్రభుత్వ భూములు నేరేడు వలస గ్రామ గిరిజనులకు అప్పజెప్ప లని కోరుచున్నారు.

# నూతనముగా నిర్మించిన రామ మందిరం వద్ద హోమ కార్యక్రమము





**సాలూరు విశాఖ సమాచారం :** పాచిపెంట మండలం గడి వలస గ్రామంలో నూతనమగా నిర్మించిన శ్రీ హనుమాన్ సీతారామ చంద్ర నూతనముగా నిర్మించిన రామ మందిరం వద్ద శ్రీశైలం వేదపండితులు రామచంద్ర శర్మ వేద పాఠశాల శ్రీశైలం అధ్యక్షులు వేదమంత్రాలతో గడి వలస రామ మందిరం వద్ద గురువారం ఉదయం నుండి సాయంత్రం వరకు హోమ కార్యక్రమాలు నిర్వహించారు గ్రామ ప్రజలు భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు సాయంత్రం ఐదు గంటలకు గ్రామ భక్తులు గ్రామంలో శ్రీరాముని విగ్రహాలను తిరు వీధి మహోత్సవం నిర్వహించారు మహిళలు గ్రామ భక్తులు శ్రీరామ భక్తి గీతాలు పాడి గ్రామ పురవీధుల్లో శ్రీరాముని విగ్రహాలకు హోమ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి పాచిపెంట మాజీ ఎంపీపీ పిన్నింటి ప్రసాద్ బాబు స్వామి వారి పల్లకని ఊరేగింపు కార్యక్రమ పాల్గొన్నారు గ్రామ పురోహితులు వి ప్రభాకర్ శర్మ గ్రామ పురోహితులు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం శ్రీరాముని విగ్రహాలు ప్రతిష్ట పూర్ణహుతి పూర్ణకుండ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని గ్రామ పురోహితులు విలేకరులకు తెలిపారు ఈ కార్యక్రమానికి గ్రామ భక్తులు చుట్టుపక్కల ఉన్న భక్తుల అంతమంది వచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆ శ్రీరాముని కరుణ కటాక్షాలు కృపకు పాత్రులు అవుతారని గ్రామ పురోహితులు తెలిపారు ఈ కార్యక్రమానికి గ్రామములో ఉన్న యువకులు పెద్దలు భక్త బృందం మహిళలు శ్రీరాముని భజన పాటలతో తిరువీధి మహోత్సవం నిర్వహించారు

# వైఎస్ జగన్ ఆపన్నహస్తం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** బ్రెయిన్ సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఏడేళ్ల పాపకు మాజీ సీఎం వైఎస్ జగన్ ఆపన్నహస్తం అందించారు. రూ.2 లక్షల ఆర్థిక సాయం చేశారు. విశాఖ పర్యటనకు వచ్చిన వైఎస్ జగన్‌ను 39వ వార్డుకు చెందిన ఎండీ హఫీజ్ కలిసి తన పాప దయనీయ స్థితిని విన్నవించారు. దీంతో చలించిపోయిన వైఎస్ జగన్ తక్షణమే పాప చికిత్స నిమిత్తం వైఎస్సార్‌సీపీ నుంచి రూ.2 లక్షల సాయం అందజేశారు.

# కొత్తూరు పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా సారా సీతయ్య



**అనంతగిరి విశాఖ సమాచారం న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతరం మండలం. కొత్తూరు పంచాయతీ. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీ చేయుటకు సారా సీతయ్యను కొత్తూరు సర్పంచ్ అభ్యర్థిగా తీర్మానం చేసినట్లు తెలుగుదేశం పార్టీ అరకు ఇన్చార్జి సియారి దొన్ను దొర తెలిపారు పంచాయతీ అభివృద్ధి బాట లో నడవాలంటే కొత్తూరు పంచాయతీ ప్రజలు సారా సీతయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించి కొత్తూరు పంచాయతీ కేంద్రంలో తెలుగుదేశం జెండా గురవేయాలని ఆయన అన్నారు

# పరువు హత్య కోసం పోరాటం






**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** మండపేట మండలం,ద్వారపూడికి చెందిన, పోలిపల్లి సూర్యనారాయణ కుమారుడు,పోలిపల్లి వీర వెంకట సూర్య ప్రకాష్, మండపేట మండలం,జెడ్ మేడపాడు గ్రామానికి చెందిన, అయినవిల్లి సంధ్య (ప్రస్తుత రాయవరం డిప్యూటీ తాసిల్దార్ ), చాలాకాలంగా ప్రేమించుకుంటున్నా,కారణంగా, వీరిద్దరూ, గతవారం, అన్నవరంలో ప్రేమ వివాహం చేసుకొనుట జరిగినది. ఈ నేపథ్యంలో, పెళ్లి అయిన మరునాడే,డిప్యూటీ తాసిల్దారు, సంధ్య సోదరులు,సూర్య ప్రకాష్ ఇంటికి వెళ్లి, వరుణ్ణి, బయటికి పిలిచి, అత్యంత కిరాతకంగా,దారుణంగా, పాశవికంగా, రాళ్లతో కొట్టి చంపారు. ఈ హంతకులను, కఠినంగా శిక్షించాలని,కోరుతూ, ఈరోజున,విశాఖపట్నం, అఖిల గాండ్ల,తెలికుల, సంక్షేమ సంఘం తరఫున, జిల్లా అధ్యక్షులు, డాక్టర్ దాడి సత్యనారాయణ గారి ఆధ్వర్యంలో కార్పొరేషన్ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి, పత్రిక సమావేశం కూడా నిర్వహించుట జరిగినది. అనంతరం,ర్యాలీగా కలెక్టర్ ఆఫీస్ కి వెళ్లి, ప్రభుత్వం, నిందితులపై, కఠిన చర్యలు తీసుకునే విధంగా, కలెక్టర్ గారికి వినతిపత్రం ఇచ్చుట జరిగినది. అక్కడినుండి కమిషనర్ ఆఫ్ పోలీస్ వారి ఆఫీసుకు వెళ్లి, వారికి,జరిగిన దారుణ సంఘటన గురించి, కమిషనర్ గారికి కూడా,వివరించి,ప్రభుత్వపరంగా, కఠిన చర్యలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కమిషనర్ గారిని కూడా కోరుతూ,రిప్రెజెంటేషన్ ఇచ్చుట, జరిగినది. రిప్రెజెంటేషన్లు అందజేసి,బాధిత కుటుంబానికి న్యాయం చేయవలసిందిగా కోరడమైనది. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారికి,లోకేష్ బాబు గారికి, హోమ్ మినిస్టర్ గారికి కూడా రిప్రెజెంటేషన్లు,పంపించుట జరిగినది. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, అత్యంత వెనుకబడిన కుటుంబానికి చెందిన సూర్య ప్రకాష్ కుటుంబాన్ని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని, వారి కుటుంబంలో, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి, జీవనాధారం కల్పించాలని కోరుతూ, వినతి పత్రాలను పంపించుట జరిగినది. సంధ్య సోదరులు సూర్యప్రకాశరావును, పెళ్లి అయిన మరునాడే, పాసవికంగా హత్య చేసిన, అత్యంత వెనుకబడిన, మా,గాండ్ల, తెలికుల, కులానికి చెందిన వ్యక్తిని, ఆమానవీయంగా, కిరాతకంగా, అత్యంత దారుణంగా, పాసవికంగా, హత్య చేసిన,ఆమె సోదరులను, కఠినంగా శిక్షించాలని,సమాజంలో, భవిష్యత్తులో, ఇటువంటివి, పునరావృతం, కాకుండా కఠిన చర్యలు, తీసుకొనవలసినదిగా, మరియు కుటుంబానికి ఆధారమైన, పెద్ద దిక్కును, కోల్పోయిన, అత్యంత వెనుకబడిన,పేద కుటుంబీకులైన, పోలిపల్లి సూర్యనారాయణ , కుటుంబాన్ని ఆదుకొని,న్యాయం, చేయాల్సిందిగా, కోరి ప్రార్థిస్తున్నాము.

# ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు.. అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి

**కాకినాడ రూరల్ విశాఖ సమాచారమ్ :** డ్రైన్లు నిర్మించి సంవత్సరాలు గడిచినా పూడిక తీయకపోవడంతో చెత్తచెదారం పేరుకుపోయి దుర్వాసనలు వ్యాపిస్తూ దోమలు విపరీతంగా పెరిగి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాకినాడ రూరల్ మండలం వాకలపూడి గ్రామం రాజాజీ నగర్, ఎఫ్సీఐ కాలనీ నివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానికులు కృష్ణ, జగదీష్ మాట్లాడుతూ సంవత్సరకాలంగా డ్రైన్ల పూడికలు తొలగించకపోవడంతో మురుగునీరు నిలిచిపడి పరిసరాలు అస్వచ్ఛంగా మారాయని, దాంతో దోమలు విపరీతంగా పెరిగి కాలనీలో జ్వరాలు, వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఫిర్యాదు చేసినా సరైన స్పందన లేకపోగా మర్యాద లేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఎఫ్సీఐ కాలనీలో మురుగునీరు నిలిచిపోవడంతో పందులు, పశువులు తిరుగుతూ మరింత అస్వచ్ఛత నెలకొంటోందని, దోమల మందు పిచికారీ కూడా చేయడం లేదని, అడిగితే పంచాయతీలో నిధులు లేవని కార్యదర్శి చెప్పడం బాధాకరమని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి డ్రైన్ల పూడిక తొలగించి శుభ్రపరిచే చర్యలు చేపట్టి కాలనీవాసులను వ్యాధుల బారినుంచి కాపాడాలని వారు డిమాండ్ చేశారు.






## విడుదలకు ముందే వారణాసి అరుదైన రికార్డ్.



తెలుగు సినిమా స్థాయిని ప్రపంచ దేశాలకు పరిచయం చేసిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, ఇప్పుడు మరో సంచలనానికి తెరలేపుతున్న విషయం తెలిసిందే. సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న 'వారణాసి' చిత్రం విడుదలకు ముందే ఒక చారిత్రాత్మక మైలురాయిని చేరుకోబోతోంది. కేవలం ఇండియాలోనే కాదు, ప్రపంచ సినిమా చరిత్రలోనే నిలిచిపోయేలా ఈ చిత్ర బృందం ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. మంచు ఖండం అంటార్కిటికాలో షూటింగ్ జరుపుకోనున్న తొలి భారతీయ సినిమాగా 'వారణాసి' అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకోబోతోంది. ఆ వివరాలు ఇలా వున్నాయి..

సాధారణంగా భారీ బడ్జెట్ సినిమాల్లో మంచు కొండలు లేదా సముద్ర తీరాలను చూపించాలంటే గ్రాఫిక్స్ (ఎఫీశ) పై ఆధారపడుతుంటారు. కానీ, రాజమౌళి మార్క్ అంటేనే సహజత్వం. అందుకే 'వారణాసి' తదుపరి షెడ్యూల్ కోసం ఏకంగా అంటార్కిటికాలోని సౌత్ పోల్‌ను ఎంచుకున్నారు. ఇక ఈ విషయాన్ని స్వయంగా చిత్ర కథానాయిక ప్రియాంక చోప్రా, మహేష్ బాబుతో జరిగిన ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు. సెట్లు వేయడం కంటే, అసలైన లొకేషన్లలో షూటింగ్ చేస్తే వచ్చే ఆ అనుభూతే వేరని, అందుకే ఈ రిస్క్ తీసుకుంటున్నట్లు చిత్ర యూనిట్ భావిస్తోంది.

అంటార్కిటికా వంటి గడ్డకట్టే ప్రదేశంలో షూటింగ్ చేయడం అంటే మాటలు కాదు. అక్కడ ఉండే విపరీతమైన చలి, వాతావరణ మార్పులు మరియు సామాగ్రిని తరలించడం వంటివి చిత్ర బృందానికి పెద్ద సవాలుగా మారనున్నాయి. ఇక కేవలం విజువల్ ఎఫెక్ట్స్ నమ్ముకోకుండా, ఇంతటి కష్టతరమైన ప్రాంతానికి వెళ్లి షూటింగ్ చేయాలని నిర్ణయించుకోవడం ఈ సినిమాపై ఉన్న అంకితభావాన్ని చాటుతోంది. ఇక ఈ నిర్ణయంతో భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కించేలా 'వారణాసి' రూపుదిద్దుకుంటోంది. సినిమా అడ్వెంచర్ థ్రిల్లర్ కావడంతో, ఈ లొకేషన్లు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయని చెప్పడంలో సందేహం లేదు. ఒకప్పుడు కేవలం స్టూడియోలకే పరిమితమైన తెలుగు సినిమా, ఇప్పుడు ఖండాలు దాటి సౌత్ పోల్ వరకు వెళ్తుండటం నిజంగా గర్వకారణం. 'వారణాసి' సాధించబోయే ఈ ఘనత కేవలం ఒక రికార్డు మాత్రమే కాదు, భవిష్యత్తు తరాల దర్శకులకు ఒక స్ఫూర్తి. ఇక షూటింగ్ ప్లాన్ చేసినట్లుగా సజావుగా సాగితే, ప్రపంచంలోనే అత్యంత కఠినమైన ప్రదేశాల్లో చిత్రీకరించబడిన సినిమాల జాబితాలో మన 'వారణాసి' ముందు వరుసలో ఉంటుంది. ఈ వార్త తో మహేష్ బాబు అభిమానుల్లో అప్పుడే అంచనాలు ఆకాశాన్ని తాకాయి.

## రూ.2000 కోట్లు కష్టం కాకపోవచ్చు..!



ఈమధ్య కాలంలో బాలీవుడ్ సినిమాలు, సౌత్ సినిమాలు వెయ్యి కోట్ల మార్క్‌ను సునాయాసంగా చేరుకుంటున్నాయి. స్టార్ హీరోల క్రేజ్, వివాదాస్పద సబ్జెక్ట్ లు బాక్సాఫీస్ వద్ద వందల కోట్ల వసూళ్లు కురిపిస్తున్నాయి. ప్రేక్షకులకు కనెక్ట్ అయితే వెయ్యి కోట్ల వసూళ్లు నమోదు కావడం పెద్ద కష్టం ఏమీ కాదు అని పలు సినిమాలు నిరూపితం చేశాయి. గత ఏడాది చివర్లో వచ్చిన 'ధురంధర్' సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లు వసూళ్లు చేస్తే చాలా పెద్ద విషయం అనుకున్నారు. కానీ సినిమాలోని మ్యాటర్ కారణంగా, సినిమాకు వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్ కారణంగా, సినిమా చుట్టూ నెలకొన్ని వివాదాల కారణంగా విడుదలైన తర్వాత భారీగా పబ్లిసిటీ దక్కింది. మొదటి వారం తో పోల్చితే రెండో వారం అత్యధిక వసూళ్లు నమోదు కావడం జరిగింది. ధురంధర్ సినిమా ఫైనల్‌గా వరల్డ్ బాక్సాఫీస్ వద్ద రూ.1350 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టినట్లుగా చిత్ర యూనిట్ సభ్యులు అధికారికంగా ప్రకటించారు

ధురంధర్ సినిమా దాదాపు నాలుగు వారాల పాటు బాక్సాఫీస్ వద్ద సందడి చేసింది. పైగా ఓటీటీలో స్ట్రీమింగ్ కాస్త ఆలస్యం అయిన కారణంగా వసూళ్లు మరింత ఎక్కువగా నమోదు అయ్యాయి అనే టాక్ ఉంది. ఓటీటీలో స్ట్రీమింగ్ అయిన తర్వాత కూడా అత్యధికులు స్ట్రీమింగ్ చేశారని రికార్డులు చెబుతున్నాయి. అందుకే ఇప్పుడు ధురంధర్ 2 సినిమాపై విపరీతమైన అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా సినిమా ఉంటుంది అనే నమ్మకంను చిత్ర యూనిట్ సభ్యులు కల్పిస్తూ పబ్లిసిటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మార్చి 19న ధురంధర్ 2 సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ అంచనాలు పెంచేసింది. ఇండియాలో ఇంకా అడ్వాన్స్ బుకింగ్ ప్రారంభం కాలేదు. కానీ యూఎస్‌లో ఇప్పటికే సినిమా అడ్వాన్స్ బుకింగ్ ప్రారంభం అయినట్లుగా అధికారికంగా ప్రకటన వచ్చింది.

రణ్వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాకు ఆదిత్య ధర్ దర్శకత్వం వహించారు. మొదటి పార్ట్‌లో రణ్వీర్‌సింగ్ పాత్రను దర్శకుడు చూపించిన తీరు అద్భుతంగా ఉంది. పాకిస్తాన్‌లో స్పై జీవితం ఎలా సాగుతుంది అనే విషయాన్ని కళ్లకు కట్టినట్లుగా దర్శకుడు చూపించి సక్సెస్ అయ్యాడు. సెకండ్ పార్ట్‌లో అంతకు మించిన మ్యాటర్ ఉంటుందని చెప్పకనే చెబుతున్నట్లుగా ట్రైలర్ ఉంది. అందుకే యూఎస్‌లో ప్రీ సేల్ అదిరి పోతుందని బాక్సాఫీస్ వర్గాల వారు అంటున్నారు. సినిమా విడుదలకు ఇంకా రెండు వారాల సమయం ఉండగానే దాదాపు 1.3 లక్షల డాలర్లను ధురంధర్ 2 రాబట్టింది. దాదాపుగా 600 షో లు షెడ్యూల్ అయ్యాయి. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం దాదాపు 8 వేల టికెట్లు బుక్ అయ్యాయి. టాక్సిక్ సినిమా అదే రోజున విడుదల కాబోతున్నప్పటికీ ధురంధర్ 2 వైపు ప్రేక్షకులు మొగ్గు చూపుతున్నారు. బాక్సాఫీస్ వద్ద టాక్సిక్ సినిమాతో ధురంధర్ 2 గట్టి పోటీని ఎదుర్కోవాల్సి వస్తుందని, తద్వారా వసూళ్లపై ప్రభావం పడే అవకాశం ఉందనే ప్రచారం జరిగింది. కానీ తాజాగా యశ్ నటించిన టాక్సిక్ సినిమా విడుదల వాయిదా వేస్తున్నట్లు అధికారికంగా ప్రకటన వచ్చింది. దాంతో ధురంధర్ 2 కి పోటీ లేదు. సోలోగా బాక్సాఫీస్ ను షేక్ చేయడం ఖాయం. అందుకే ధురంధర్ 2 సినిమాకు హిట్ టాక్ వచ్చినా, ధురంధర్ 1 ను మించి ఉందని టాక్ వచ్చినా బాక్సాఫీస్ వద్ద రూ.2 వేల కోట్ల వసూళ్లు నమోదు చేయడం పెద్ద కష్టం ఏమీ కాదు అంటూ బాక్సాఫీస్ వర్గాల వారు అంటున్నారు.

ఈ మధ్య కాలంలో వచ్చిన పలు సీక్వెల్స్ వసూళ్లను పరిశీలిస్తే ధురంధర్ 2 కి అన్ని కలిసి వచ్చే అంశాలు అన్నట్లుగా పరిస్థితులు ఉన్నాయి. ధురంధర్ 2 సినిమాను కేవలం హిందీలోనే కాకుండా సౌత్ ఇండియన్ భాషల్లోనూ డబ్ చేయడం వల్ల మరింతగా కలెక్షన్స్ ఉంటాయనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. ఇండియాలో వెయ్యి కోట్లు దాటడం ద్వారా రికార్డ్‌ను ధురంధర్ 2 నమోదు చేయబోతుందనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. మరో రెండు వారాల్లో రాబోతున్న ధురంధర్ 2 ఎన్ని రికార్డ్‌లను బ్రేక్ చేయనుందో చూడాలి.

## ఇకపై పెద్దతెర-బుల్లితెరకు స్టార్లతో పనే లేదు!



ఇకపై పెద్దతెర- బుల్లితెర స్టార్ల ఉద్యోగాలు ఊస్టింగ్ అవ్వబోతున్నాయా? నటీనటులకు భారీ పారితోషికాలు చెల్లించి కాల్షీట్లు కొనుక్కోవాల్సిన పరిస్థితి ఉండదా? అంటే.. అవుననే తాజా సాంకేతికత నిరూపిస్తోంది. ఆర్జీవీ అలియాస్ రామ్ గోపాల్ వర్మ హెచ్చరికలు నిజం అవ్వడానికి ఇంకెంతో సమయం పట్టదని తాజా పరిస్థితులు చెబుతున్నాయి. ఏఐ బొమ్మ లేదా యానిమేటెడ్ బొమ్మ అని తీసిపారేయడానికి లేదు. చూస్తుండగానే అంతా మారిపోతోంది. శంకర్ -జీన్స్-లో వర్చువల్ ఐశ్వర్యారాయ్ ని చూపించినప్పుడు గొప్ప ఆశ్చర్యం వ్యక్తం చేసినవారు.. ఇకపై మానవ ప్రపంచంలో సంచరించే వర్చువల్ నటీనటులను చాలా సాధారణంగా తీసుకునే ఛాన్సుందని అంచనా. భవిష్యత్ లో నటీనటులను పూర్తిగా కృత్రిమ మేధస్సుతోనే తయారు చేస్తారనే సంకేతాలు బలంగా ఉన్నాయి. ఇది కేవలం యాంకరింగ్ వరకే పరిమితం కాదు... బుల్లితెర, పెద్ద తెరకు స్టార్లను సరఫరా చేయడానికి ఏఐ చాలా సహకరించబోతోంది. భారతీయ బుల్లితెర చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలుకాబోతోంది. సాంకేతిక పరిజ్ఞానం అంచులను తాకుతూ.. మనుషులకు దీటుగా నటించేందుకు -నైనా ఏవిటిఆర్- అనే ఏఐ బ్యూటీ సిద్ధమైపోయింది. ఇప్పటికే నైనా నటించిన కొన్ని వీడియోలు, డ్యాన్స్ వీడియోలు, మోడలింగ్ అసైన్ మెంట్లకు సంబంధించిన ఇన్ స్టా వీడియోలు ఇంటర్నెట్ ని కుదిపేస్తున్నాయి. దీనిని నిశితంగా గమనిస్తే... నైనా కేవలం ఒక యానిమేషన్ బొమ్మ మాత్రమే కాదు.. అత్యంత అధునాతనమైన -మెషిన్ లెర్నింగ్- మోషన్ క్యాప్చర్ టెక్నాలజీల మేళవింపుతో సృష్టించిన ఒక అద్భుత దృశ్య కావ్యం. ఈ సరికొత్త టెక్నాలజీ వల్ల నైనా అనే పాత్రధారి కదలికలు, ప్రవర్తన అచ్చం నిజమైన నటిని తలపిస్తూ ప్రేక్షకులను మాయ చేస్తున్నాయి. ఇక నైనా ప్రధాన పాత్రలో రాబోతున్న బుల్లితెర సీరియల్ గురించి పరిశ్రమ వర్గాల్లో భారీ చర్చ సాగుతోంది. బుల్లితెరపై సరికొత్త చరిత్ర సృష్టించబోతున్న ఈ ధారావాహిక 2026 మే నెల చివరి వారంలో లేదా జూన్ మొదటి వారంలో గ్రాండ్‌గా లాంచ్ కాబోతోందని సమాచారం. ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ ఛానల్ స్టార్ ప్లస్ లో ఈ వినూత్న ప్రయోగం ప్రసారం కానుందని టాక్ వినిపిస్తోంది. ఒక ఏఐ నటి పూర్తిస్థాయి లీడ్ రోల్‌లో కనిపించడం ఇదే మొదటిసారి కావడంతో అభిమానులు ఈ తేదీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక సీరియల్ ప్రారంభం కాకముందే నైనా సోషల్ మీడియాలో ఒక పెద్ద సెన్సేషన్‌గా మారింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ భామకు ఇప్పటికే లక్షలాది మంది ఫాలోయర్స్ ఉన్నారు. తను పోస్ట్ చేసే ప్రతి రీల్.. ప్రతి కిల్లింగ్ మూవ్ నెట్టింట నిమిషాల్లో వైరల్ అవుతోంది. విశేషమేమిటంటే ఒక ఏఐ మోడల్ అయి ఉండి కూడా తన గ్లామర్‌తో పెద్ద పెద్ద బ్రాండ్‌ల దృష్టిని ఆకర్షించి -బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్- కూడా దక్కించుకుంటోంది.

## దక్షిణాఫ్రికాకు ఘోరపరాభవం

టోర్నీలో ఆ జట్టుకు తిరుగులేదు. పదునైన బౌలింగ్, దుర్భేద్యమైన బ్యాటింగ్‌తో అజేయంగా నాకౌట్‌కు చేరుకుంది. అంచనాలు పెరిగాయి. సెమీస్‌లోనూ ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. కానీ ఫ్చ..! పాత కథే పునరావృతమైంది. ఐసీసీ టోర్నీల్లో కీలక మ్యాచ్‌ల్లో తడబడే అలవాటును దక్షిణాఫ్రికా కొనసాగించింది. సెమీస్‌లో తేలిపోయింది. టోర్నీలో కష్టంగా ముందంజ వేసిన న్యూజిలాండ్.. అసలు పోరులో అదరగొట్టింది. ఆల్‌రౌండ్ ఆధిపత్యంతో సఫారీలను చిత్తు చేస్తూ.. టీ20 ప్రపంచకప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆకాశమే హద్దుగా చెలరేగిన ఓపెనర్ ఫిన్ అలెన్.. టీ20 ప్రపంచకప్‌లోనే అత్యంత వేగవంతమైన శతకం (33 బంతుల్లో) నమోదు చేయడంతో కివీస్ అలవోకగా విజయం సాధించింది.

దక్షిణాఫ్రికా ప్రపంచకప్ కల మరోసారి చెదిరింది. కిందటిసారి ఫైనలిస్ట్ ఈసారి సెమీస్‌లో బోల్తా కొట్టింది. బుధవారం ఏకపక్షంగా సాగిన పోరులో న్యూజిలాండ్ 9 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘనవిజయం సాధించింది. మొదట దక్షిణాఫ్రికా 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. యాన్సెన్ (55 నాటౌట్; 30 బంతుల్లో 2ఐ4, 5ఐ6) టాప్ స్కోరర్. రచిన్ రవీంద్ర (2/29), మెకాంచి (2/9), హెన్రీ (2/34) దక్షిణాఫ్రికాను కట్టడి చేశారు. ఓపెనర్లు ఫిన్ అలెన్ (100 నాటౌట్; 33 బంతుల్లో 10ఐ4, 8ఐ6), సీఫర్ట్ (58; 33 బంతుల్లో 7ఐ4, 2ఐ6) వీరవిహారం చేయడంతో లక్ష్యాన్ని న్యూజిలాండ్ 12.5 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. అలెన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

ఆ ఇద్దరు దంచేశారు..: లక్ష్యం చిన్నదేమీ కాదు. సఫారీల బౌలింగ్ తేలికైంది కూడా కాదు. కానీ విధ్వంసక బ్యాటింగ్‌తో విరుచుకుపడ్డ ఓపెనర్లు సీఫర్ట్, అలెన్.. చాలా త్వరగానే మ్యాచ్‌ను న్యూజిలాండ్ చేతుల్లోకి తెచ్చారు. ప్రత్యర్థికి చిన్న అవకాశమైనా లేకుండా చేశారు. పేస్, స్పిన్ అన్న తేడా లేకుండా దక్షిణాఫ్రికా బౌలర్లందరినీ ఉతికేసిన ఈ జోడీ.. స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఇద్దరూ పోటీపడి బౌండరీలు బాదేశారు. ముఖ్యంగా అలెన్ ఆటైతే హైలైట్స్‌ను తలపించింది. యథేచ్ఛగా బ్యాట్ ఝుళిపించిన అతడు.. బోష్ వేసిన ఓ ఓవర్లో వరుసగా 6, 4, 4, 4, 4 దంచేశాడు. కివీస్ 6 ఓవర్లకే 84/0తో నిలవడంతో దక్షిణాఫ్రికా ఆశలు ఆవిరయ్యాయి. ఆ తర్వాత కూడా ఓపెనర్ల జోరు కొనసాగింది. సీఫర్ట్ 28 బంతుల్లో, అలెన్ 19 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేశారు. 10వ ఓవర్లో సీఫర్ట్ ఔట్ కావడంతో 117 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యం విడిపోయింది. అయినా దక్షిణాఫ్రికాకు సంతోషించడానికేమీ లేకపోయింది. కివీస్.. సాఫీగా లక్ష్యం దిశగా సాగింది. రచిన్ క్రీజులోకి రాగా.. అలెన్ విధ్వంసాన్ని కొనసాగించాడు. యాన్సెన్ వేసిన ఇన్నింగ్స్ 13వ ఓవర్లో రెండు సిక్స్‌లు, మూడు ఫోర్లతో శతకంతో పాటు లక్ష్యాన్నీ పూర్తి చేశాడు. అలెన్ 33 బంతుల్లోనే మూడంకెల స్కోరును అందుకోవడం విశేషం.

ఆదుకున్న యాన్సెన్: అంతకుముందు న్యూజిలాండ్ సూపర్ బౌలింగ్‌తో దక్షిణాఫ్రికాను కట్టడి చేసింది. యాన్సెన్ ఆదుకోకుండా ఉంటే సఫారీ జట్టు చాలా తక్కువ స్కోరుకు పరిమితమయ్యేది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాను ఆఫ్‌స్పిన్నర్ మెకాంచి రెండో ఓవర్లోనే దెబ్బతీశాడు. అతడు వరుస బంతుల్లో డికాక్ (10), రికెల్టన్ (0)ను ఔట్ చేశాడు. మార్‌క్రమ్ (18), బ్రెవిస్ (34) నిలవడంతో 55/2తో దక్షిణాఫ్రికా కోలుకున్నట్లే కనిపించింది. కానీ కివీస్ బౌలర్లు విజృంభించడంతో చకచకా మూడు వికెట్లు కోల్పోయి 77/5తో కష్టాల్లో పడింది. ఆ దశలో స్టబ్స్ (29)తో కలిసి యాన్సెన్ జట్టును ఆదుకున్నాడు. భారీ షాట్లు ఆడేస్తూ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. 19వ ఓవర్లో స్టబ్స్ ఔట్ కావడంతో 83 పరుగుల ఆరో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత మరో రెండు వికెట్లు పడ్డా.. యాన్సెన్ కడ వరకూ నిలిచాడు.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) మిచెల్ (బి) రచిన్ 18; డికాక్ (సి) ఫెర్గూసన్ (బి) మెకాంచి 10; రికెల్టన్ (సి) అలెన్ (బి) మెకాంచి 0; బ్రెవిస్ (సి) శాంట్నర్ (బి) నీషమ్ 34; మిల్లర్ (సి) మిచెల్ (బి) రచిన్ 6; స్టబ్స్ (బి) ఫెర్గూసన్ 29; యాన్సెన్ నాటౌట్ 55; బోష్ (బి) హెన్రీ 2; రబాడ (సి) నీషమ్ (బి) హెన్రీ 0; కేశవ్ మహరాజ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 14 మొత్తం: (20 ఓవర్లలో 8 వికెట్లకు) 169; వికెట్ల పతనం: 1-12, 2-12,




3-55, 4-77, 5-77, 6-150, 7-166, 8-166; బౌలింగ్: మ్యాట్ హెన్రీ 4-0-34-2; మెకాంచి 1-0-9-2; ఫెర్గూసన్ 4-0-29-1; నీషమ్ 3-0-42-1; శాంట్నర్ 4-0-25-0; రచిన్ 4-0-29-2

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: సీఫర్ట్ (బి) రబాడ 58; ఫిన్ అలెన్ నాటౌట్ 100; రచిన్ నాటౌట్ 13; ఎక్స్‌ట్రాలు 2 మొత్తం (12.5 ఓవర్లలో వికెట్ నష్టానికి) 173; వికెట్ల పతనం: 1-117; బౌలింగ్: యాన్సెన్ 2.5-0-53-0; రబాడ 3-0-28-1; ఎంగిడి 2-0-22-0; బోష్ 2-0-35-0; కేశవ్ మహరాజ్ 3-0-33-0 టీ20 ప్రపంచకప్ ఫైనల్ చేరడం కివీస్‌కు ఇది రెండోసారి. ఆ జట్టు 2021లో తొలిసారి తుదిపోరుకు అర్హత సాధించి, రన్నరప్‌గా నిలిచింది.

## ఆ ఒక్కడే మా ఓటమిని శాసించాడు: సౌతాఫ్రికా కెప్టెన్




న్యూజిలాండ్ ఓపెనర్ ఫిన్ అలెన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో తమ ఓటమిని శాసించాడని సౌతాఫ్రికా కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్ అన్నాడు. పవర్ ప్లేలోనే తమ ఓటమిని ఖాయం చేశాడని తెలిపాడు. మ్యాచ్ ఆరంభంలో పిచ్ కూడా బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉందని, బంతి బ్యాట్‌పైకి రాలేదని చెప్పాడు. పరుగులు చేయాలనే ఒత్తిడిలో వరుసగా వికెట్లు కోల్పోయామని పేర్కొన్నాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో భాగంగా న్యూజిలాండ్‌తో బుధవారం కోల్‌కతా వేదికగా జరిగిన తొలి సెమీఫైనల్లో సౌతాఫ్రికా 9 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. దాంతో ఓటమెరుగని జట్టుగా సెమీఫైనల్ చేరిన సౌతాఫ్రికా.. ఫైనల్ చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది.

బౌలింగ్ సూపరో సూపర్..

ఈ మ్యాచ్ అనంతరం తమ పరాజయంపై స్పందించిన మార్క్‌రమ్.. బ్యాటింగ్ వైఫల్యం తమ పతనాన్ని శాసించిందన్నాడు. 190 పరుగులు చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేదన్నాడు. న్యూజిలాండ్ బౌలర్లు అసాధారణ ప్రదర్శన కూడా తమ విజయవకాశాలను దెబ్బతీసిందని అభిప్రాయపడ్డాడు. ఫిన్ అలెన్, టీమ్ సీఫెర్ట్ విధ్వంసకర బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను ఏకపక్షంగా ముగించారని తెలిపాడు. 'మ్యాచ్ ఆరంభంలో పిచ్ కండిషన్స్‌కు తగ్గట్లు న్యూజిలాండ్ బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు.

ఈ గెలుపు క్రెడిట్ పూర్తిగా వారి బౌలింగ్ విభాగానిదే. ఆరంభంలో పిచ్ కూడా బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉంది. కొన్ని బంతులు ఆగుతూ వస్తే.. మరికొన్ని బంతులు తక్కువ ఎత్తులో వచ్చాయి. దాంతో పరుగులు చేయడం కష్టమైంది. ఆ ఒత్తిడిలో మేం వరుసగా వికెట్లు కోల్పోయాం.

ఇక ప్రత్యర్థి జట్టులో ఎవరో ఒకరు ఫిన్ అలెన్ తరహా ఇన్నింగ్స్ ఆడినప్పుడు.. ఫీల్డింగ్ టీమ్‌గా గెలిచే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. నిజాయితీగా చెప్పాలంటే.. ఈ మ్యాచ్‌లో మేం 170 పరుగులు చేయడం గొప్ప ప్రయత్నమే. న్యూజిలాండ్ పవర్ ప్లేలోనే దూకుడుగా ఆడి మంచి ఆరంభాన్ని అందుకుంది. మ్యాచ్‌ను ఇంత త్వరగా ముగించినందుకు ఫిన్ అలెన్, సీఫెర్ట్ ఇన్నింగ్స్‌లకు భారీ క్రెడిట్ ఇవ్వాలి. పిచ్ బాగుంటుందని, బ్యాటింగ్‌కు అనుకూలిస్తుందని మేం ఊహించాం. బహుశా మేం కష్టపడి 190 పరుగులు చేసి ఉంటే మ్యాచ్‌లో నిలిచేవాళ్లమేమో. ఈ ఫలితం తీవ్ర నిరాశకు గురి చేసింది. కానీ ఈ టోర్నీలో మా జట్టు ప్రదర్శన పట్ల గర్వంగా ఉంది. మా కుర్రాళ్లు అద్భుతంగా ఆడారు. ఈ ఓటమి మాకు చెంప దెబ్బ. ముందుగా ఈ ఓటమి బాధ నుంచి తేరుకున్నాక.. జట్టుగా కూర్చుని ఈ ఫలితంపై చర్చించుకుంటాం. మా తప్పిదాలను సవరించుకొని తిరిగి పుంజుకుని మళ్ళీ బలంగా వస్తాం. ప్రస్తుతం చాలా నిరాశగా ఉన్నాం. ఒక జట్టుగా మేము మరింత బలంగా, మెరుగ్గా తిరిగి రావాలి.'అని మార్క్‌రమ్ చెప్పుకొచ్చాడు.

శతక్కొట్టిన ఫిన్ అలెన్.. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 169 పరుగులు చేసింది. మార్కో యాన్సెన్(30 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 55 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ(2/34), కోల్ మెక్‌కాంచీ(2/9), రచిన్ రవీంద్ర(2/29) రెండేసి వికెట్లు తీయగా.. లాకీ ఫెర్గూసన్, జేమ్స్ నీషమ్ చెరో వికెట్ పడగొట్టారు.

అనంతరం న్యూజిలాండ్ 12.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 173 పరుగులు చేసి గెలుపొందింది. ఫిన్ అలెన్(33 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్స్‌లతో 100 నాటౌట్) సెంచరీతో చెలరేగగా.. టీమ్ సీఫెర్ట్(33 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 58) హాఫ్ సెంచరీతో రాణించాడు. సౌతాఫ్రికా బౌలర్లలో కగిసో రబడా ఒక్కడే ఒక వికెట్ తీసాడు.

## చరిత్ర సృష్టించిన ఫిన్ అలెన్.. గేల్, యువరాజ్ సింగ్ రికార్డ్ బద్దలు!

న్యూజిలాండ్ ఓపెనర్ ఫిన్ అలెన్ చరిత్ర సృష్టించాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన సెంచరీ నమోదు చేశాడు. న్యూజిలాండ్‌తో బుధవారం కోల్‌కతా వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్ 2026 సెమీఫైనల్లో 33 బంతుల్లో సెంచరీ చేయడం ద్వారా ఫిన్ అలెన్ ఈ ఫీట్ సాధించాడు. అంతేకాకుండా టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే నాకౌట్ మ్యాచ్‌ల్లో సెంచరీ బాదిన తొలి బ్యాటర్‌గా కూడా ఫిన్ అలెన్ చరిత్రకెక్కాడు. ఈ క్రమంలో అతను తిలక రత్నే దిల్షాన్ పేరిట ఉన్న రికార్డ్‌ను అధిగమించాడు. 2009 టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్లో వెస్టిండీస్‌పై శ్రీలంకకు చెదిన దిల్షాన్ 96 పరుగులు చేశాడు. ఇప్పటి వరకు పొట్టి ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌ల్లో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోర్‌గా ఉండగా.. ఫిన్ అలెన్ తాజా శతకంతో బద్దలుకొట్టాడు.

టీ20 ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోర్లు..

100 - ఫిన్ అలెన్ వర్సెస్ సౌతాఫ్రికా, కోల్‌కతా, 2026 సెమీ-ఫైనల్‌లి
96 - తిలకరత్న దిల్షాన్ వర్సెస్ వెస్టిండీస్, ది ఓవల్, 2009 సెమీ-ఫైనల్‌లి
89 - విరాట్ కోహ్లీ వర్సెస్ వెస్టిండీస్, ముంబై వాంఖడే స్టేడియం, 2016 సెమీ-ఫైనల్‌లి
86 - అలెక్స్ హేల్స్ వర్సెస్ ఇండియా, అడిలైడ్, 2022 సెమీ-ఫైనల్‌లి
85 - మార్లన్ శామ్యూల్స్ వర్సెస్ ఇంగ్లాండ్, కోల్‌కతా, 2016 ఫైనల్‌లి
85 - కేన్ విలియమ్సన్ వర్సెస్ ఆస్ట్రేలియా, దుబాయ్, 2021 ఫైనల్

క్రిస్ గేల్ రికార్డ్ బద్దలు..

ఐసీసీ టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే ఫాస్టెస్ట్ సెంచరీ బాదిన బ్యాటర్‌గానూ ఫిన్ అలెన్ నిలిచాడు. ఈ క్రమంలోనే క్రిస్ గేల్ పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. 2016లో ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఇంగ్లండ్‌పై 47 బంతుల్లో క్రిస్ గేల్ సెంచరీ చేశాడు. పొట్టి ప్రపంచకప్‌లో ఇదే ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డ్‌గా ఉండగా.. ఫిన్ అలెన్ కేవలం 33 బంతుల్లోనే సెంచరీ బాది గేల్ రికార్డ్ బద్దలు కొట్టాడు.

అంతర్జాతీయ టీ20ల్లో న్యూజిలాండ్ తరపున కూడా ఇదే ఫాస్టెస్ట్ సెంచరీ. 2020లో వెస్టిండీస్‌పై గ్లేన్ ఫిలిప్స్ 46 బంతుల్లో సెంచరీ చేయగా.. ఫిన్ అలెన్ తాజా శతకంతో అధిగమించాడు. అంతేకాకుండా ఒక పూర్తి స్థాయి సభ్యదేశంపై టీ20ల్లో నమోదైన అత్యంత వేగవంతమైన సెంచరీ కూడా ఇదే.

## పాక్ జట్టులో ఆరుగురు కొత్త ఆటగాళ్లు

లాహోర్: టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ పేలవ ప్రదర్శన నేపథ్యంలో జట్టులో సంస్కరణలు చేపట్టే దిశగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అడుగులు వేస్తోంది. బంగ్లాదేశ్‌లో ఈ నెల 11 నుంచి మూడు వన్డేల సిరీస్ ఆడబోయే పాక్ జట్టుకు ఆరుగురు కొత్త ఆటగాళ్లను ఎంపిక చేసింది. మాజ్ సదాఖత్, షమైల్ హుస్సేన్, ఘాజీ ఘోరి, సాద్ మసూద్, అబ్దుల్ సమద్, ఫైజల్ అక్రమ్‌లకు తొలిసారి వన్డే జట్టులో చోటు దక్కింది. ఈ జట్టుకు ఫాస్ట్‌బౌలర్ షహీన్ షా అఫ్రిది సారథ్యం వహిస్తాడు.

టెస్టు కోచ్‌గా సర్ఫరాజ్!: పాకిస్థాన్ టెస్టు జట్టు ప్రధాన కోచ్‌గా సర్ఫరాజ్ అహ్మద్‌కు బాధ్యతలు అప్పగించేందుకు పాక్ బోర్డు సిద్ధమైనట్లు సమాచారం. ఐసీసీ ప్రపంచ టెస్టు ఛాంపియనషిప్‌లో భాగంగా పాక్ ఈ ఏడాది వరుసగా టెస్టు సిరీస్‌లు ఆడనుంది. ప్రస్తుత కోచ్ అజర్ మహమూద్ మధ్యంతర ఒప్పందం ముగియడంతో పాక్.. సర్ఫరాజ్‌కు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. అయితే సర్ఫరాజ్ ఇంకా తన నిర్ణయాన్ని వెల్లడించలేదు.

**ఓటమితో మొదలు..**

పెర్త్: ఆసియాకప్ మహిళల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌ను భారత్ పరాజయంతో ఆరంభించింది. బుధవారం తొలి పోరులో 1-2తో వియత్నాం చేతిలో ఓడింది. నాన్ తి వాన్ (30వ నిమిషం) మ్యాచ్‌లో తొలి గోల్ సాధించి వియత్నాంను ఆధిక్యంలో నిలబెట్టింది. రెండో అర్ధభాగంలో మైదానంలోకి వచ్చిన భారత అరంగేట్ర క్రీడాకారిణి సాన్‌ఫిదా నోంగ్రమ్ (65వ నిమిషం) గోల్ కొట్టి స్కోరు సమం చేసింది. అయితే తి వాన్ 94వ నిమిషంలో గోల్ సాధించడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, vspnews4@gmail.com